సంచలన వార్తా పత్రిక

లీడర్

SANCHALANA VAARTHA PATRIKA LEADER

Read / Share / Follow

www.leaderepaper.com

www.facebook.com/leaderramanamurthy/

www.twitter.com/leaderramanamurthy/

మంగళవారం • 6 మార్చి 2018 । సంపుటి : 20 సంచిక : 218 । ఎడిటర్ : వి.వి.రమణమూర్తి । 8 పేజీలు । వెల : రూ. 2.00

Published from Visakhapatnam, Rajahmundry and Hyderabad

నాకింత... నీకెంత...





- జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్... అవినీతి పుట్ట
- తవ్వేకొద్దీ ..అక్రమాలు
- చక్రం తిప్పుతున్న చైన్‌మెన్‌లు
- నిర్మాణదారులు, అధికారులకు వీరే మీడియేటర్లు
- రూ.కోట్లు వెనకేసుకుంటున్న చిరు ఉద్యోగులు
- ఏసీబీకి పట్టుబడ్డ ముని"కోటి" ప్రత్యక్ష నిదర్శనం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : మహా విశాఖ నగరపాలక సంస్థలో అత్యంత లాభ దాయకమైన విభాగం ఏమిటని ప్రశ్నిస్తే... టపక్ మని చెప్పేది టౌన్‌ప్లానింగ్ విభాగ మనే. టౌన్‌ప్లానింగ్ అంటే ఒక బంగారు బాతులా భావిస్తారు. ఇక్కడ ఏ చిరు ఉద్యోగంలోనైనా తలదూర్చితే ఇక వారి తలరాత మారిపోయినట్టే. అందుకే లక్షలు ఖర్చు చేసి మరీ వివిధ శాఖల నుండి డిప్యూటేషన్‌లు వేసుకొని మరీ ఇక్కడకు వస్తుంటారు. అతి చిన్న పోస్టుకు సైతం ప్రముఖ రాజకీయ నాయకులచే సిఫార్సులు కూడా చేయించుకుంటున్నారంటే ఈ పోస్టు డిమాండ్ ఏమిటో ? మరి వేరేగా చెప్పనవసరం లేదు. ముఖ్యంగా కింది స్థాయి ఉద్యోగులకు రాబడి చెప్పుకుంటూ పోతే అంతా ఇంతా కాదు. ప్రతి రోజు లక్షలు రూపా యలు అదనపు ఆదాయం రెండు చేతులా సంపాదించుకొనే అద్భుతమైన అవకాశం ఇక్కడే వుందనడంలో అతిశయోక్తి లేదు. ముఖ్యంగా టౌన్‌ప్లానింగ్‌లో అత్యంత కింది స్థాయి ఉద్యోగం "చైన్‌మెన్" అంటే భలే గిరాకీ. క్షేత్రస్థాయిలోనే వుంటూ అండిగా, దండిగా సంపాదించు కోవచ్చునని పలువురు రుజువు చేశారు కూడా. వీరు తమ ప్రాంతంలో జరుగుతున్న భవన నిర్మాణాలకు సంబంధించి తమ ఉన్నతాధికారులకు ఎంత చెబితే అంత. తొలిత భవన నిర్మాణదారులు వీరిని



మిగతా 2లో ▶

చేస్తాం చూస్తాం...అంటే కుదరదు



రాష్ట్రప్రయోజనాలపై బీజేపీ నాలుగేళ్ళగా మోసం చేసి ఇంకా చేస్తాం.. చూస్తాం అంటే కుదరదని టీడీపీ నాయకులు జీవిఎంసీ గాంధీ విగ్రహం వద్ద విన్నూత్న ఆందోళన చేస్తున్న దృశ్యం...

3లో

గవర్నర్ తెలుగులో ప్రసంగించకపోవడం అన్యాయం

ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించాలని ప్రధానికి లేఖ

మాజీ మంత్రి దాడి వీరభద్రరావు



అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్ : ఉభయ చట్టసభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం తెలుగులో ఇవ్వకుండా ఇంగ్లీషులో ఇవ్వడం చూస్తే గవర్నర్ నర్సింహం తెలుగుపట్ల ఎంత విద్వేషం ఉందో అర్థమవుతుందని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. సోమవారం స్థానిక రింగురోడ్డు లక్ష్మీనారాయణనగర్‌లోగల తన కార్యాలయంలో ఏర్పాటైన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గవర్నర్ ప్రసంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తెలుగులో, ఇంగ్లీ షులో, ఉర్దూలో కూడా ప్రచురి స్తారన్నారు. కానీ గవర్నర్ ఇంగ్లీషులో మాత్రమే ప్రసంగించడానికి ఇష్టపడ్డారన్నారు. 2019 డిసెంబర్ నుంచి సమైక్య ఆంధ్రప్రదేశ్‌కు గవర్నర్‌గా నియమింపబడి రాష్ట్ర విభజన జరిగిన

మిగతా 2లో ▶

పార్లమెంటులోనే ఉన్నామా?



సభ్యులు తీరుపై రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు ఆగ్రహం

పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం.. లోక్‌సభ వాయిదా

ఢిల్లీ : పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న తీరుపై రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్యనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సభా కార్యకలాపాలకు సభ్యులు అడ్డుపడటం సరికాదని సూచించారు. పార్లమెంటు బడ్జెట్ మలి



విడత సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ పలువురు ఎంపీ రాజ్యసభలో ఆందోళన చేపట్టారు. దీంతో ఛైర్మన్ కాసేపు సభను

మిగతా 7లో ▶

జేఎఫ్సీ ప్రొడ్యూసర్, డైరెక్టర్ చంద్రబాబే

పవన్ ఓ పెయిడ్ ఆర్టిస్టు: విజయసాయిరెడ్డి

- వైసీపీతోనే ప్రత్యేక హోదా సాధ్యం
- కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ పై స్పష్టత లేదు



న్యూఢిల్లీ : ప్రజలను మభ్యపెట్టేందుకే జనసేన పార్టీ జాయింట్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ పేరిట నాటకం ఆడుతున్నదని, తెరవెనుక ఉండి ఈ తతంగాన్ని నడిపిస్తున్నది చంద్రబాబునాయుడేనని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయిరెడ్డి వ్యాఖ్యానించారు. విభజనతో

మిగతా 7లో ▶

మరో భారీ స్కామ్

- రూ.3,200 కోట్ల టీడీఎస్ ఎగవేత
- నిందితుల్లో రాజకీయ నేతలు, సినీ నిర్మాతలు!

(ప్రత్యేక ప్రతినిధి)

దేశంలో మరో భారీ కుంభకోణం బయటపడింది. ఆదాయపు పన్ను విభాగం దీన్ని వెలుగులోకి తెచ్చింది. ఇందులో మొత్తం 447 కంపెనీల ప్రమేయం ఉండగా, ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన సుమారు రూ. 3,200 కోట్లను ఆయా కంపెనీల యాజమాన్యం నొక్కేసింది. ఉద్యోగుల నుంచి



టీడీఎస్ (టాక్స్ డిడక్షన్ ఎట్ సోర్స్) రూపంలో వసూలు చేసిన మొత్తాన్ని ఈ కంపెనీలు ఐటీ శాఖకు చెల్లించలేదని చెబుతూ, ఈ కంపెనీలకు ఐటీ చట్టం ప్రకారం వారంట్లను జారీ చేసింది. ఆరోపణలు రుజువైతే ఈ కంపెనీల యజమానులకు గరిష్ఠంగా ఏడేళ్ల వరకూ

మిగతా 7లో ▶

ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఇవ్వాల్సిందే

కేంద్రం ఆదుకోవాలి.. ప్రజల కష్టాలు తీర్చాలి

ఏపీ అసెంబ్లీలో గవర్నర్



అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న ప్రత్యేక హోదా, విశాఖపట్నానికి రైల్వే జోన్ లపై కేంద్ర ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు కావాల్సిందేనని తెలుగు రాష్ట్రాల గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. సోమవారం ఉదయం ఏపీ అసెంబ్లీ 2018-19 బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా, ఉభయ సభలనూ ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. విభజన చట్టంలోని ఎన్నో హామీలు అమలు కావాల్సివుం దని వెల్లడించిన ఆయన, విభజన గాయాల నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే బయట పడుతోందని అన్నారు. విభజనతో రాష్ట్రం చాలా నష్టపోయిందని చెప్పారు. ఆస్తులను ప్రాంతాల వారీగా, అప్పులను జనాభా ప్రాతిపదికన పంచారని గుర్తు చేసిన ఆయన, తన ప్రభుత్వం మూడున్నరేళ్లుగా హామీల అమలు కోసం ప్రయత్నం సాగి స్తోందని అన్నారు. రాష్ట్ర ప్రజల్లో ఎంతో అసంతృప్తి నెలకొని ఉందని, అది తొలగాలంటే, కేంద్రం చొరవ చూపించాల్సిందేనని నరసింహన్ స్పష్టం చేశారు.

రాష్ట్రంలో విద్యుత్ కొరత అన్న మాట లేకుండా చేయగలిగామని ఆయన అన్నారు. గత సంవత్సరం 11.31 శాతం వృద్ధి రేటును సాధించామని వెల్లడించిన ఆయన విభజన హామీల

మిగతా 7లో ▶

త్వరలో 'మహారాజ' యోగం...!

లగ్జరీ రైళ్ల ఛార్జీలను సగానికి సగం తగ్గించనున్న రైల్వే శాఖ



ఢిల్లీ : ప్యాలెస్ ఆన్ వీల్స్, గోల్డెన్ చారియట్, మహా రాజా ఎక్స్‌ప్రెస్ లాంటి లగ్జరీ రైళ్లు ఇప్పటివరకు ఎగువ మధ్యతరగతి వాళ్లకు, ధనికులకు మాత్రమే పరిమితమై పోయాయి. కానీ, భారత రైల్వేలు త్వరలోనే వాటిని సామాన్యుడికి సైతం

మిగతా 7లో ▶

'పిఎన్‌బి' కుంభకోణంలో నలుగురు అరెస్టు



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు(పిఎన్‌బి) కుంభకోణంలో నలుగురిని అరెస్టు చేసినట్లు సిబిఐ అధికారులు వెల్లడించారు. నీరవ్‌మోడీ గ్రూపు కంపెనీలకు చెందిన ఆడిటర్‌తో పాటు ముగ్గురు ఉద్యోగుల్ని అరెస్టు చేశారు. అలాగే చోక్సీకి చెందిన గీతాంజలి గ్రూపు

మిగతా 2లో ▶

జగమేమాయ!



వీఆర్‌ఓ పోస్టు కావాలా.. పూర్వంలా లక్షల్లో కాదయ్యా.. కోట్లలో ఇవ్వాల్సి వుంటుంది..!

అట్టహాసంగా ఆస్కార్ వేడుకలు

- ఉత్తమ చిత్రంగా ది షేప్ ఆప్ వాటర్
- ఉత్తమ నటి ఫ్రాన్సెస్ మెక్ డోర్మండ్
- ఉత్తమ నటుడుగా గ్యారీ ఓల్డ్ మ్యాన్
- ఉత్తమ దర్శకుడిగా గులెర్మో డెల్ టోరో







లాస్‌ఏంజెల్స్ : 90వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా కొనసాగింది. లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో జరిగిన వేడుకల్లో ప్రముఖ అమెరికన్ టెలివిజన్ హోస్ట్ జిమ్మీ కిమ్మెల్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. సినిమా రంగానికి సంబంధించి ప్రపం చంలోనే అత్యుత్తమ అవార్డుగా పరి గణించే ఆస్కార్ విజేతల జాబితా విడు దలైంది. ఉత్తమ చిత్రంగా ది షేప్ ఆఫ్ వాటర్ నిలిచింది. అంతేకాదు ఇదే చిత్రానికి దర్శకత్వ బాధ్యతలు అందించిన గులెర్మో డెల్ టోరోను ఉత్తమ దర్శకుడిగా ఆస్కార్ జ్యూరీ ఎంపిక చేసింది. ఈ చిత్రానికి మరో రెండు అవార్డులు కూడా

మిగతా 7లో ▶

ఐపీఎల్ వేడుకలు వాయిదా

న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపీఎల్)-2018 సీజన్‌ను గ్రాండ్‌గా ఆవిష్కరించేందుకు బీసీసీఐ చేసిన భారీ ప్రణాళికకు సుప్రీంకోర్టు నియమిత పాలక కమిటీ(సీవోఏ) బ్రేక్ వేసింది. లీగ్ ఆరంభ మ్యాచ్‌కు



ముందు రోజు అంటే ఏప్రిల్ 6న సీజన్ వేడుకలను అట్టహాసంగా నిర్వహించడంతో పాటు లీగ్ గొప్పతనాన్ని ప్రదర్శించాలని తొలుత బీసీసీఐ భావించింది. ప్రస్తుతం లీగ్‌లో తొలి మ్యాచ్ (ఏప్రిల్ 7) ఆరంభానికి కొన్ని గంటల ముందే వేడుకలు నిర్వహించడానికి బీసీసీఐ సన్నాహాలు చేస్తోంది. దీనికి గల కారణాలను బీసీసీఐ అధికారి

మిగతా 7లో ▶

సంచలన వార్తాపత్రిక
లీడర్ క్లాసిఫైడ్స్

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు. - మేనేజ్‌మెంట్

విశాఖపట్నం | మంగళవారం 6-3-2018

Minimum 1 week | రోజుకి రూ.40/- మాత్రమే Size : 1x3

CONTACT : 92466 21490 / 92982 05388 | 5% GST EXTRA

SELL & BUY
Old & Used Home / Office Furniture, Sofas, Dining / Office Tables, Cots, Alamirah, Racks, TV, Fridge, Fans, Curious... and more on your behalf..
KKM's TRANSMIT SERVICES
Opp. Sampat Vinayaka Temple, Asilmetta Up Vizag-3.
Ph: 0891-2755866, 2701716
(BY AN EDUCATED SELF EMPLOYED)
9735 1/9-6/3

లోకేష్ గోల్డ్ లోన్స్
మీ బంగారం బ్యాంక్ / ప్రైవేట్ సంస్థల్లో ఉన్నదానిని విడిపించి మార్కెట్ రేటుకు కొనబడును.
7799 22 3300
11137 11/2 - 11/8



LOANS..LOANS
వ్యాపారం/చదువు/పెళ్లి అవసరాలకు 5 Crores వరకు House/Flat/ Vuda Sites పై Mortgage Loans. House/Flat/Site కొనుగోలు కొరకు Loans. Income tax లేనివారు Cibil Problem వున్నవారు కూడా సం॥
91330 19488
11334 10/2 - 13/3



WANTED
Freshers or 1 Year Experience Male/Female Nurses to Work in Hospitals
9394745566, 9396745566
11352 20/2-22/3

ఉద్యోగావకాశాలు
బ్యాంకుకు సంబంధించిన ఆఫీసులో పార్ట్ /ఫుల్ టైం పనిచేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం 10 వేలు నుండి బస్ పాస్+మొబైల్ బిల్
8142485443, 8919992357
11354 21/2-23/3

కావలెను
నెట్ వర్క్ మార్కెటింగ్‌లో ఫుల్/పార్ట్ టైం పనిచేస్తూ మంచి ఆదాయం సంపాదించడానికి అభ్యర్థులు కావలెను.
99660 55830
11429 28/2-7/3

వెన్నెల ఫంక్షన్ హాల్ ఫ్రీ
సెంట్రల్ ఏసీ హోటల్ ఆరిటాకు ఏసీ బార్ ఎదురుగా ఎన్.ఎ.డి. జంక్షన్, వైజాగ్.
అతితక్కువ రేట్లకే క్యాటరింగ్ & హాస్టల్స్ ఆఫీసులకు ఫుడ్ సప్లయ్, హోటల్‌లో రూ. 79/-లకే 30 రకాల ఐటమ్స్‌తో విందు భోజనం
72889 99970
11338 11/2 - 11/8

3 లక్షల పెట్టుబడితో
(2 1/2 సెంట్ల భూమి రిజిస్ట్రేషన్) 30 లక్షలు వరకూ పొందే అవకాశం. (10 శ్రీ గంధం, 8 ఎర్ర చందనం మొక్కలతో), 10 నుండి 12 సం॥ లలో
KHAN SHAIK, CEO
DHATTRI PROMOTERS & DOVELOPERS
Muralinagar jn., Vsp-7
9000928636,9133998820
11363 28/2 -07/3

BUSINESS OFFER
ఇంటి వద్ద ఉంటూ ఎలాంటి మెషనరీ లేకుండా ఆడ, మగవాళ్ళు పవర్‌గార్డ్స్ తయారు చేయండి. మెటీరియల్ మేమే ఇస్తాం. తయారైనవి కొంటాం. నెలకు అధిక ఆదాయం.
99896 83543
11055 16/2 - 19/3

సువర్ణావకాశము
ప్రముఖ సంస్థలో 'మేనేజర్' కేడర్‌లో పనిచేయుటకు వయస్సు 30సం॥ పైబడిన స్త్రీ/పురుషులు కావలెను. రిటైర్డ్/VRS/చదువుకున్న గృహిణులు కూడా అర్హులే. ఆదాయం 30,000/- నుండి 50,000/- వరకూ సంపాదించే అవకాశం.
నిధి: 85006 92674
11368 02/3-9/3

కావలెను
అక్కయ్యపాలెంలో గల ఆఫీసు నందు పనిచేయుటకు ఆఫీసు అసిస్టెంట్స్- 2 ఆటో డ్రైవర్లు కావలెను.
9246612502, 0891-2532279
11365 1/3 - 8/3

WANTED
Office Assistants (Male)
Modern Dotmitory 3rd Floor, ANR Shopping Mall Building, Dwarakanagar, Visakhapatnam-16
9052501379, 8121000222
11077 3/3 - 10/3

WANTED
ACCOUNTANT with fully Computer Knowledge
Qlf : Inter (CEC) / B.Com
Age : 20 to 30 yrs. (M/F)
48-1-30/A, Nr. Reddy Hospital, Ramatalkies, Vizag.
81421 47666
11370 4/3 - 11/3

కావలెను
ప్రముఖ విద్యా సంస్థలో పనిచేయుటకు PRO's, TELECALLERS RECEIPTIONISTS కావలెను. Salary upto Rs. 20,000/- గాజువాక, విశాఖపట్నం.
7799770103,7799770104
11371 4/3 - 11/3

BUSINESS OFFER
MLM లీడర్స్‌కు ఆహ్వానం కేవలం రూ.1500/-లతో గోవా యాత్ర మరియు ప్రతి రోజు రూ.400/- నుండి రూ.3000/- అప్పైన రూ.9000/- వరకు సంపాదించుకునే అవకాశం.
www.infitourism.com
85005 09034, 77992 19789
11065 22/2 - 09/3

TO-LET SHOPS/OFFICE
Sri Sankara Matam Opposite, Dwarakanagar, 80 feet Road facing, Beside Padmasali Bhavan, Visakhapatnam-16
89780 98572
11369 3/3 - 10/3


Plots for Sale
భోగాపురం NH 16కు అనుకొని భీమిలికి ఐఎన్‌ఎస్‌ఐ కళింగకు 2.5 కి.మీ. దూరంలో వుడా ఎల్‌పీ నెంబరుతో ప్లాట్లు అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలదు. బ్యాంకు లోన్స్, స్పాట్ రిజిస్ట్రేషన్
8790816762, 9581570806
9592 20/2-7/3

విజయనగరం జిల్లా నెల్లిమర్ల టౌన్‌లో రామతీర్థాలు జంక్షన్ వద్ద రిజిస్ట్రేషన్ ఆఫీస్ ఎదురుగల ప్రక్కలైనులో ఇల్లు అద్దె + (తనఖా) + అమ్మకమునకు కలదు.
91608 23872
11431 1/3 - 8/3

పార్లర్ స్టాఫ్ కావలెను
పార్లర్‌లో పనిచేయుటకు స్టాఫ్ కావలెను.
• క్యాషియర్ • స్టాల్ బోయ్స్ • వంట మాస్టర్ • క్లీనర్స్
94405 55623
11070 27/2 -06/3

కావలెను
పెదవాల్తేరు జంక్షన్ నందు ప్రముఖ హోటల్‌లో పనిచేయుటకు అనుభవం గల సౌత్ ఇండియన్ మాస్టర్స్ కావలెను.
72077 20727
11362 27/2 -06/3

కావలెను
ఆటో డ్రైవర్ కమ్ హెల్పర్ కావలెను. జీతం : 8500/-
94416 81757
11428 28/2-7/3



న్యూమరాలజీ
విద్యార్థుల పేర్లు న్యూమరాలజీ ద్వారా సవరించుకుని, విద్యా, ఉద్యోగ వ్యాపారాలందు అభివృద్ధి సాధించుటకై సంప్రదించండి.
శ్రీనివాస సాయి, డైమండ్ పార్కు వద్ద, ద్వారకానగర్ 2వ లైన్, వైజాగ్
ఫోన్ : 81791 66777
11071 28/2-7/3

BUSINESS OFFER
P/F RBI అండర్‌లోని NBFC (నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీ) కేటగిరిలో రిజిస్టర్ అయిన NEW SHOP కంపెనీలో కేవలం రూ॥ 500/- పెట్టుబడితో లక్షలు సంపాదించు అవకాశం.
73308 37549
11072 28/2-7/3

PLOTS FOR SALE
నెలకు 5000/- EMI తో Vuda Plot 12/30 నెలల వాయిదాల్లో కొత్తగా నిర్మించబోయే భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకి అతి దగ్గర్లో చ॥గ॥ 5800/- బుకింగ్ రూ.20,000/-
99481 48009
98489 65432
11364 28/2-7/3

వధువు కావలెను
పుట్టిన తేది : 26-05-1985
ఎత్తు : 5'.10"
రంగు : చామనచాయ
చదువు : B.Sc కెమిస్ట్రీ,M.Sc (CI)
ఉద్యోగం : ఫార్మ కంపెనీ
గోత్రం : భరద్వాజస, బ్రాహ్మణ
శాఖ : ఆరువేల నియోగు వరుడిని శాఖ పట్టింపులేదు.
88860 80250
88971 04555
11074 1/3 - 8/3

కావలెను
మల్టీ కలర్ ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
93485 50909

వెంటనే కావలెను
ఎటువంటి బాదరబందీ లేనివారు సీతమ్మధార ఏరియా లోని ఇంట్లో వుండి వంట చేసి ఇల్లు చూసుకొనుటకు వంటమనిషి కావలెను
98663 19393
11367 1/3 - 8/3

నలుగురు అరెస్టు

(మొదటి పేజీ తరువాయి)

సంస్థల డైరెక్టర్‌ను కూడా అరెస్టు చేసినట్లు తెలిపారు. నీరవ్‌మోడీ ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన మనీష్ కె. బసామియా (ఎజిఎం), ఆర్థిక నిర్వాహకుడు మిల్టెన్ అనిల్ పాంద్యాలు పిఎన్‌బికి మోసపూరిత లెటర్స్ ఆఫ్ అండర్ టేకింగ్స్ (ఎల్‌ఒయుఎస్)కు దరఖాస్తులు సమర్పించారని పేర్కొన్నారు. ఆడిటర్ సంజయ్ రాంభియా, వారి సహాయకులు సంపత్, మెహతాలను విచారణ అధికారులు అరెస్టు చేసినట్లు తెలిపారు. మొహుల్ చోక్సీకి చెందిన కంపెనీ ' గిలి ఇండియా ' డైరెక్టర్ అనియత్ శివరామన్ నాయర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. నిందితులు నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలు పంజాబ్ నేషనల్ బ్యాంకు నుండి మోసపూరితంగా (తాజాగా వెలువడిన లెక్కలతో కలిపి) రూ.12,600 కోట్లు దోచుకున్న సంగతి తెలిసిందే.

10th/INTER/DEGREE ONE SITTING ADMISSIONS
ALL DEGREE/DIPLOMA ADMISSIONS IN DISTANCE AND REGULAR MODE AVAILABLE FROM GOVT UNIVERSITIES
TEAMS 9885847768 8121527999
11432 02/3 -17/3

RAMANUJAN & RAMAN
Opp.RTC Complex, Visakhapatnam
98850 80592
2018 IIT-NEET-BITSAT-EAMCET CRASH COURSE COACHING
11073 1/3 - 8/3

NEW BATCH
RRB: GROUP-D: LOCO PILOT
ARMY, NAVY, AIRFORCE
Excellent Coaching
Experienced Faculty
HARI COLLEGE
PML Complex 3rd Floor
NAD Jn. VIZAG-27
98483 17625
90000 90431
0891- 2571674
Hostel available
11346 17/2-18/3

ఆర్యవైశ్య యువజన సంఘం
వధూ వరుల పరిచయ మహా వేదిక
తేది : 1-4-2018
ఆదివారం
వేదిక : కళాభారతి ఎ.సి ఆడిటోరియం
మద్దిలపాలెం, విశాఖపట్నం
వివరాలకు సంప్రదించండి :
92468 00766
93931 02766
92475 87818
94401 02899
11064 20/2-7/3

Plots for Sale
భోగాపురం NH 16కు అనుకొని భీమిలికి ఐఎన్‌ఎస్‌ఐ కళింగకు 2.5 కి.మీ. దూరంలో వుడా ఎల్‌పీ నెంబరుతో ప్లాట్లు అతి తక్కువ ధరకే అమ్మకమునకు కలదు. బ్యాంకు లోన్స్, స్పాట్ రిజిస్ట్రేషన్
8790816762, 9581570806
9592 20/2-7/3

BUY & SELL
Old House Hold/ Office/Shop/Hotel/ Furniture
{T.V., FANS, Zym Exercise Cycles, SOFAs, Cots Alamaras, Tabels & Chairs Frig.}
MASETTY & CO.
AUCTIONERS
Nehru Bazar, Dwarakanagar, Visakhapatnam -16.
Ph: 2798616, 2563759
11136 11/2 - 12/3

హోమియో
చర్మ,కీళ్లు, గ్యాస్ట్రిక్, షుగర్, బి.పి, ఉలిపిర్లు, థైరాయిడ్, కిడ్నీ, గర్భాశయ, మానసిక, శారీరక వ్యాధులు, ఎలర్జీ, ఆస్తమా మొదలగు దీర్ఘవ్యాధులకు
అభినందన హోమియో క్లినిక్
డా॥ మోటూరి శ్రీరామకృష్ణ MD
వారణాసి మెజిస్టిక్, 2వ లైను, ద్వారకానగర్, పిజ్జాహట్ ఎదురుగా, విశాఖపట్నం - 16
9290128515
8019141135
అన్ని వ్యాధులకు తక్షణమే సంప్రదించండి

కావలెను
వెంకోజీ పాలెం
శీలానగర్
ఆటోనగర్
గాజువాక
శ్రీ నగర్
యందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును.
అర్హత : టెన్త్ (పాస్/ఫెయిల్)
హేమ శ్రీ దుర్గా సెక్యూరిటీ
96039 96036
81427 08899
0891 - 2768898
11503 27/2 -06/3

More Value any old A/C 4000 to 5000 below 5 ysears A/C 6000 TO 12000 any Un Condition A/C 2500/- to 3000/- Towers A/C Package A/C Units buying only.
95509 53369
11366 1/3 - 8/3

బ్యాంక్ గోల్డ్ లోన్స్
❖ అకౌంట్ అవసరం లేదు
❖ అత్యధిక గ్రాము రేటు, అతి తక్కువ వడ్డీ.
❖ మీ బంగారు ఆభరణాలను ఇతర సంస్థల నుండి ఉచితంగా బదిలి చేయబడును
97041 91234
11076 2/3-17/3

పరీక్షలొచ్చేసాయి
మీ పిల్లలు పరీక్షలలో మంచి మార్కులు తెచ్చుకోవాలంటే ఉచిత కౌన్సిలింగ్, రక్ష సరస్వతి పూజలో పాల్గొనండి.
శ్రీ రుద్రా జ్యోతిషాలయం
98481 84660
11074 1/3 - 8/3

లీడర్
చదవండి ! చదివించండి!!

వైద్యరాజ్ ఔషధ-శాల
కేరళ ఆయుర్వేద పంచకర్మ సెంటర్
మా ప్రత్యేకతలు
ఆయుర్వేద రిజువినేషన్ థెరపీ & అన్ని రకముల చికిత్సలు కలవు. సాంప్రదాయ పద్ధతిలో, ప్రత్యేక శ్రద్ధతో చికిత్స చేయబడును.
నిపుణులైన కేరళ డాక్టర్లు, థెరపిస్టులచే చికిత్స చేయబడును.
సీనియర్ కేరళ వైద్యులు డా॥ కె.ఎం.ఉన్నికృష్ణన్, DAM (గౌర)
ఈ నెల 3,4 మరియు 5వ తేదీల్లో మా ఔషధశాల యందు అందుబాటులో ఉండును.
సీనియర్ వైద్యుల అపాయింట్‌మెంట్ కొరకు ఈ నెంబర్లను సంప్రదించండి.
90305 68264
76758 61446
డోర్. నం.58-14-56/1/1, జర్నలిస్ట్ కాలనీ, రైతు బజార్ దగ్గర, P.F. ఆఫీస్ వెనుక, మర్రిపాలెం వుడా లే-అవుట్, విశాఖపట్నం-18. ఫోన్ : 0891-2568264
www.vaidyarajayurvedic.com
11075 1/3 - 8/3

నాకింత.....నీకెంత...

(మొదటి పేజీ తరువాయి)

ప్రసన్నం చేసుకుంటే తప్ప, అక్కడ ఇసుకగాని, రాయిగాని పడదు. నియమ,నిబంధనలు ప్రకారం అనుమతులు తీసుకొని నిర్మిస్తే ఒక ధర, ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని, లేదా అక్రమంగా భవన నిర్మాణాలు చేపట్టదలిస్తే ఒక ధర ముందుగానే సంబంధిత చైన్‌మెన్‌లు నిర్ణయించేస్తారు. అందులోనే తమ వాటా, తమ అధికారుల వాటా కలుపుకొని సదరు భవన నిర్మాణదారుల నుండి వసూళ్లుచేస్తుంటారు. ఇలా ప్రతి రోజు లక్షలాది రూపాయలు చేతిలో ఆడిస్తూ ఆర్థికానందంతో ఇక్కడి చైన్‌మెన్‌లు మరింత అవినీతివంతమైన విధి నిర్వహణ చేస్తూ తమ ఆస్తులు పెంచుకుంటున్నారు.

ముని"కోటి" ప్రత్యక్ష సాక్ష్యం

ఇటీవల అవినీతి నిరోధకశాఖకు చిక్కిన మునికోటి నాగేశ్వరరావే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. అంతవరకు చైన్‌మెన్‌గా పనిచేసి పెద్ద ఎత్తున అక్రమాస్తులు కూడగట్టుకున్న నాగేశ్వరరావు అక్రమాస్తులు వింటే గుండె టపాల్‌మనాల్సిందే.అక్షరాల రూ.10 కోట్లు అక్రమంగా సంపాదించినట్లు ఏసీబీ నిగ్గుతేల్చింది. జీవీఎంసీ జోన్-3 చైన్‌మన్‌గా పనిచేసిన ఈయనకు నెలవారీ వేలల్లో జీతాలున్నా, ప్రతి రోజూ లక్షల్లో అదనపు ఆదాయం సమకూరడమే. అనతి కాలంలో ఇంత పెద్దఎత్తున అక్రమార్జన చేయగలిగారు. విశాఖలోని వెంకోజీపాలెంలో రూ.10 కోట్ల విలువైన 339 గజాల స్థలం ఉన్నట్లు తేలింది. దీనిపై న్యాయపరమైన చిక్కులున్నట్లు గుర్తించారు. అలాగే ఈయన బంధువులు వద్ద కూడా ఈయన అక్రమార్జనను దాచిపెట్టినట్లు తెలుస్తోంది. ఆయన బంధువుకు ఎలాంటి ఉద్యోగం లేకపోయినా ఆయన పేరుతో రూ.85 లక్షల విలువైన ఆస్తులున్నట్లు ఏసీబీ గుర్తించారు. అంటే చేసేది చిరుఉద్యోగమే అయినా సంపాదించింది కోట్ల రూపాయలు కావడం గమనార్హం. ఇదే కోవలో ఎంతో మంది చైన్‌మెన్‌లు కోట్లకు పడగెత్తి ధర్జాగా అక్రమార్జనతో విలాసాలు చేస్తున్నారు.

ఎందుకంత డిమాండ్ ..?

నగరంలో కొత్తగా భవనం నిర్మించాలని, పై అంతస్తులు నిర్మించాలన్నా ఖచ్చితంగా జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అనుమతులు తప్పనిసరి. అయితే నగరంలో చాలా వరకు ఆయా స్థలాలకు సంబంధించి ఖచ్చితమైన పత్రాలు చాలా మందికి లేవు. ఆక్రమణలు ఇతరత్ర కారణాలు మూలంగా ప్రస్తుతం టౌన్‌ప్లానింగ్ నియమ నిబంధనలు మేరకు వారు గృహాలు నిర్మించుకునేందుకు పలు అడ్డంకులు ఎదురౌతున్నాయి. ఈ నేపథ్యంలో అనుమతులు లేకుండానే నిర్మాణాలు సాగించాలంటే ఖచ్చితంగా టౌన్‌ప్లానింగ్ విభాగం సిబ్బంది, అధికారుల సహాయ, సహకారాలు తప్పనిసరి. ఇందులో ముఖ్యంగా క్షేత్రస్థాయిలో చైన్‌మెన్‌లే కీలక పాత్ర పోషిస్తారు. ఆయా నిర్మాణాలను అడ్డుకోకుండా జాగ్రత్త పడాలంటే ముందుగా చైన్‌మెన్‌లను ఆయా నిర్మాణదారులు కలిసి వారిని ప్రసన్నం చేసుకుంటారు. దీంతో చైన్‌మెన్‌లు ఆయా భవన నిర్మాణాలను బట్టి తమకు ఎంత ఇవ్వాలో చెబుతున్నారు. అందులోను తమ అధికారులకు ఎంత ఇవ్వాలో కూడా లోపాయికారిగా తమ అధికారులతో సంభాషించిన తరువాత నిర్మాణదారులకు చెబుతారు. కోరిన విధంగా నిర్మాణదారులు సొమ్ములు ఇస్తే ఇక అటువైపుగానే అధికారులుగాని, చైన్‌మెన్‌గాని వెళ్లరు. అయితే నిబంధనలు మేరకు అనుమతులు తీసుకున్నవారిని సైతం వీరు విడిచిపెట్టరు. ఎంతో కొంత ఇస్తే తప్పా, వారి నిర్మాణాలను సాగనీయరు. ఇక ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్నవారు, నిబంధనలకు విరుద్ధంగా నిర్మించేవారు, అనుమతులు లేకుండా పనులు ప్రారంభించేవారు వుంటే ఇక చైన్‌మెన్‌ల పంట పండినట్లే.

రెండు, మూడు వార్డులకు ఒక్కరే చైన్‌మెన్

అక్రమార్జనకు కలిసిరావడం అంటే ఇదేనేమో ? వాస్తవంగా ఒక వార్డుకు ఒక చైన్‌మెన్ వుంటారు. ఈయనే ఆ వార్డులో అక్రమ నిర్మాణాలు సాగనీయకుండా, ఆక్రమణలు జరగనీయకుండా చూడాల్సిన బాధ్యత నిర్వర్తించేది. అయితే ఆయా వార్డుల్లో ఇప్పటికే పెద్ద ఎత్తున అనుమతులు లేకుండా నిర్మాణాలు సాగడం,అవి వరదలా సొమ్ములు కురిపించడం అందరికీ తెలిసిందే. ఇది చాలదన్నట్లు సిబ్బంది లేమి కారణం చూపుతూ ఒక్కో చైన్‌మెన్‌కు రెండు, మూడు వార్డులు అప్పగించడంతో ఇక చైన్‌మెన్‌లకు అడ్డు,అదుపులేకుండా పోయింది. పరిధి పెరగడంతో ఆదాయం కూడా గణనీయంగా పెంచుకుంటున్నారు. వాస్తవంగా జీవీఎంసీ విలీన ప్రాంతాలుతో(అనకాపల్లి, భీమిలి) కలిపి దాదాపు 100 నుండి 120 మంది చైన్‌మెన్‌లు వుండాల్సి వున్నప్పటికీ, కేవలం 35 మంది మాత్రమే చైన్‌మెన్‌లు పనిచేస్తూ రెండు, మూడు వార్డుల్లో చక్రం తిప్పుతున్నారు.

అధికారులేమీ... తక్కువ తినలేదు

అక్రమ నిర్మాణదారులకు, అధికారులకు మధ్య మధ్యవర్తిత్వం వహించేది కూడా చైన్‌మెన్‌లే. నిర్మాణదారుల కోరిక మేరకు సంబంధిత చైన్‌మెన్‌లు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్, ఏసీపీ, ఇతర అధికారుల దృష్టికి చైన్‌మెన్‌లు తీసుకువెళ్లడం,వారి కోరిక మన్నించాక, మౌఖిక ఆదేశాలుతో చకచకా భవన నిర్మాణాలు సాగిపోవడం జరుగుతోంది. దీంతో జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగం అనుమతులు లేకుండానే నగరవ్యాప్తంగా పెద్ద ఎత్తున భవన నిర్మాణాలు సాగుతున్నాయి. ఫలితంగా ఆ విభాగంలో కిందిస్థాయి నుండి అధికారులు వరకు కోట్లాది రూపాయలు మామూళ్లు రూపంలో చేతికి అందుతున్నాయి. ఉదాహరణకు తాజాగా పట్టుబడ్డ చైన్‌మెన్ 10 కోట్లు రూపాయలు సంపాదించగా, అంతకు ముందు పలువురు ఏసీపీలు, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌లు, అధికారులు సైతం పెద్ద మొత్తంలో అక్రమార్జన చేసి ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. గతంలో ఇక్కడ టౌన్‌ప్లానింగ్ విభాగంలో దీర్ఘకాలంగా విధులు నిర్వర్తించిన రెహమాన్‌పై ఏసీబీ దాడులు చేసిన సందర్భంలో బయటపడ్డ ఆస్తులే నిదర్శనం. ఆయన ఇక్కడి నుంచి పదోన్నతిపై బదిలీపై వెళ్లినప్పటికీ చేసిన పాపం వీడలేదు. విశాఖనగరంలోని ఆయన నివాసం వద్ద ఏసీబీ సోదాలు చేయగా, పెద్ద ఎత్తున స్థిర,చరాస్థులు, నగదు, బంగారం, వెండి బయటపడ్డాయి. ఈ విభాగంలో చైన్‌మెన్‌లు,ఉన్నతాధికారులు ఇలా అన్ని కేడర్‌ల్లోను కోట్లాది రూపాయలు వెనకేసుకొనే వెసులుబాటు వుందని వారు నిరూపించారు.

ఉన్నతాధికారులకు తెలియదా ?

మహానగరంలో పట్టపగలే ధర్జాగా జరుగుతున్న అక్రమ నిర్మాణాల గురించి ఉన్నతాధికారులకు కూడా తెలియదనడంలో పలు అనుమానాలకు తావిస్తోంది. నగరంలో అన్ని వార్డుల్లో నిత్యం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు జరుగుతునే వున్నాయి. అయినప్పటికీ, అవేవీ ఆయా అధికారుల కళ్లకు కనిపించకపోవడం విడ్డూరంగా వుంది. ఇది లోపాయికారిగా చైన్‌మెన్‌లు కుదుర్చిన ఒప్పందాలేనని తేటతెల్లమౌతోంది. వాస్తవంగా ఉన్నతాధికారులు విజిట్ సందర్భంలో ఆయా భవనాల విషయాన్ని పట్టించుకోకపోవడం గమనార్హం. చిత్తశుద్ధితో వారు పరిశీలిస్తే అక్రమ నిర్మాణాలు కొంత వరకైనా తగ్గి వుండేది.తాము కోరిన మొత్తాన్ని ఇవ్వనివారినే టార్గెట్ చేస్తున్నారు తప్పా, ముందస్తుగా పైకం ఇచ్చి పనులు ప్రారంభించినవారి జోలికి వెళ్లడం లేదన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. కంచే చేను మేసిన చందాన నగరంలో అక్రమ నిర్మాణాలను, ఆక్రమణలను నిరోధించాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది కుమ్మక్కై అక్రమ నిర్మాణాలను యధేచ్ఛగా సాగేలా తోడ్పాటు అందిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ఏసీబీ చలువ వలనే వెలుగు చూస్తున్న అక్రమాలు

పట్టణ ప్రణాళికావిభాగంలో పేరుకుపోతున్న అవినీతి,అక్రమాలుపై అవినీతి నిరోధకశాఖాధికారులు దృష్టిసారించడం మూలంగానే ఆ శాఖలో పలువురు అక్రమార్కులు పట్టుపడుతున్నారు. ఈ విభాగంపై పెద్ద ఎత్తున వస్తున్న ఆరోపణలు నేపథ్యంలో ఏసీబీ రంగంలోకి దిగి టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమార్కులను టార్గెట్ చేసి దాడులు చేయడంతో ఒక్కొక్కరిగా అవినీతి సిబ్బంది, అధికారుల భాగోతం బయటపడుతోంది. పలువురు అధికారులతో పాటు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, చైన్‌మెన్‌లు వరుసగా ఏసీబీకి చిక్కుతున్నారు. మరో వైపు ఏసీబీ అధికారులు నేరుగా అక్రమ భవనాలపై కూడా దృష్టిసారిస్తున్నారు. గతంలో గాజువాకలో జరుగుతున్న ఒక అక్రమ కట్టడాన్ని అడ్డుకొని కేసు నమోదు చేశారు కూడా. ఇలా ఏసీబీ చొరవతోనే కొంతవరకు టౌన్‌ప్లానింగ్ అవినీతి బయటకొస్తున్నది తప్పా, ఉన్నతాధికారులు మాత్రం ఆ విభాగంలో అవినీతికి ప్రక్షాళన చేసే పాపాన పోలేదు. వాస్తవంగా చైన్‌మెన్,బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లకు తెలియకుండా ఆయా వార్డుల్లో ఇసుక, రాయిగాని పడదు. అలాంటప్పుడు జీవీఎంసీ ఉన్నతాధికారులు పరిశీలనకు వెళ్లినప్పుడు అది అక్రమ భవన నిర్మాణం అని తెలిసినా... సంబంధిత సిబ్బందిపై చర్యలకు ఉపక్రమించకపోవడం గమనార్హం. జీవీఎంసీ ఉన్నతాధికారుల ఉదాశీనతతో కింది స్థాయి సిబ్బంది మరీ బరితెగించి సంపాదిస్తున్నారు. అవినీతి నిరోధకశాఖ అధికారులు టౌన్‌ప్లానింగ్ విభాగంపై మరింత దృష్టిసారించి మరింతమంది అక్రమార్కుల గుట్టు రట్టు చేయాలని, లేదంటే నగమంతా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు మరింత జోరుగా సాగుతాయని, తద్వారా నగరం దిశ,దశ లేకుండా పోతుందని పలువురు పేర్కొంటున్నారు.

గవర్నర్ తెలుగులో ప్రసంగించకపోవడం అన్యాయం

(మొదటి పేజీ తరువాయి)

తరువాతకూడా 8 ఏళ్ల నుంచి ఉభయ తెలుగు రాష్ట్రాలకు గవర్నర్‌గా నర్సింహమే ఉన్నారన్నారు. ఏపీలో కొన్నాళ్లు పోలీసు అధికారిగా పనిచేసి 8 ఏళ్లుగా చక్కగా మాట్లాడే అలవాటు ఉన్నప్పటికీ ప్రసంగాన్ని తెలుగులో చెప్పకపోవడం తెలుగు భాషను గవర్నర్ అగౌరవ పరిచినట్లే అవుతుందన్నారు. కుముద్‌బెన్‌జోషి గవర్నర్‌గా ఉన్నప్పుడు అధికార భాషకు సంబంధించిన ఒక ఫైల్‌ను అమె వద్దకు తాను పంపగా తనయొక్క తెలుగు సంతకాన్ని నేర్చుకొని ఆ ఫైల్‌పై తెలుగులో సంతకం చేశారన్నారు. తెలుగు భాష మరియు తెలుగు ప్రజల ఔన్నత్యంకోసం స్వర్గీయ ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ ఆశయాల మేరకు కనీసం చట్టసభల్లోకూడా ఇంకా ఇంగ్లీషులోనే వ్యవహారాలు జరిపించడం గవర్నర్‌కు తగిన పని అని ఆయన అన్నారు. ఎంజీ రామచంద్రన్‌కు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు ప్రకటించినప్పుడు ఆ అవార్డుయొక్క సర్టిఫికేట్‌ను తమిళంలో ఇవ్వనందుకు తిరస్కరించారని గుర్తు చేశారు. అటువంటి తమిళరాష్ట్రం నుంచి వచ్చిన నర్సింహంను తమిళనాడులో ఇంగ్లీలో మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఉభయ రాష్ట్రాల గవర్నర్ నర్సింహన్‌ను ఉమ్మెత్తు పువ్వులా తయారు అయ్యాడయ్యాడి ఈ పువ్వు చూడదానికి అందంగా ఉంటుంది తప్ప ఆస్వాదించడానికి అపహాస్యంగా ఉంటుందన్నారు. రెండు రాష్ట్రాలకు గవర్నర్‌గా ఉండే అదృష్టం ఈయనకు ఒక్కరికే దక్కిందన్నారు. 4 ఏళ్లుగా దేశంలో ఏపీకి గవర్నర్ పదవికి అర్హులైన వారు ఎవరూలేరా అని ప్రశ్నించారు. కేంద్రానికి ఇది కనబడలేదా అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా విభజన జరిగిన తరువాత వచ్చిన రాష్ట్ర సమస్యలను పరిష్కరించే చొరవ తీసుకోని గవర్నర్ మనకెందుకన్నారు. గుళ్లు, గోపురాలకు పరిమితమైన గవర్నర్‌ను దేవాదాయ ధర్మాదాయశాఖకు బదిలీచేస్తే బాగుంటుదని అభిప్రాయం వ్యక్తం చేశారు. మన రాష్ట్రానికి కొత్త గవర్నర్‌ను నియమించాలని బీజేపీ నుంచి హరిబాబు, ఇతర నాయకులు డిమాండ్ చేసిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకుండా నర్సింహంనే కొనసాగించడం వెనుక చిదంబర రహస్యం మేంటున్నారు. ఇప్పటికైన ఏపీకి కొత్త గవర్నర్‌ను నియమించాలని కోరుతూ ప్రధాని మోడీకి లేఖ పంపించడమైందని మాజీ మంత్రి దాడి తెలియజేశారు.

Today Classifieds

TO-LET
PVJR గెస్ట్ హౌస్ బిల్డింగ్ నందు 2ఫ్లోర్లు (15X90) స్కూలు బిల్డింగ్‌కు అనుకూలం. అన్ని సౌకర్యములతో అద్దెకు ఇవ్వబడును.
98496 90327
80085 40434
11435 5/3 - 12/3

డ్రైవర్లు కావలెను
OLA & UBER
టాక్సీ నడుపుటకు బ్యాడ్జి కలిగి అనుభవం గల డ్రైవర్లు వెంటనే కావలెను
జీతం : రూ. 12,000/-
99662 25019
11080 5/3 - 12/3

పార్ట్ టైం /ఫుల్‌టైం జాబ్స్
ప్రముఖ హోటల్స్ , మాల్స్, హాస్పటల్స్, ఇండస్ట్రీలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్, హౌస్ కీపింగ్, డ్రైవర్స్ & మ్యాన్ పవర్ M/F కావలెను. చదువుతో పనిలేదు.
98481 35331
98487 82255
11079 5/3 - 12/3

అనుభవం గల **వంట మాస్టర్లు, హెల్పర్స్, క్లీనర్స్ కావలెను**
Real DEEPAK PUNJABI DHABA A/C
హోటల్ మేఘాలయ ఎదురుగా, ఆశీలమెట్ట, వైజాగ్.
93931 09246
0891 - 2743637
50000 5/3 - 12/3

VIVO healthcare
SKILLING INDIA TO SAVE LIVES
ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
100% స్కాలర్‌షిప్ మైనార్టీ యువతకు
కోర్సుల వివరాలు :
ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్
డయాలసిస్ టెక్నీషియన్
ఫ్లెబోటోమి టెక్నీషియన్
డెంటల్ అసిస్టెంట్
జనరల్ డ్యూటీ అసిస్టెంట్
Call : 90150 46000
ద్వారకానగర్, విశాఖపట్నం
11078 5/3 - 12/3

సంచలన వార్తాపత్రిక
లీడర్
విశాఖపట్నం సిటీ
విశాఖపట్నం
మంగళవారం 6-3-2018

9,10తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: గోపాలపట్నంలో గల నరవ బెహ రా పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 9,10తేదీల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు బెహరా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ విజయ చైతన్య ఒక ప్రకటనలో తెలిపారు. గాబ్రియల్‌మహల్, టకాటా కంపెనీలు పాలిటెక్నిక్‌లో 201 7-18లో 60శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్య ర్థులను ఆహ్వానించారు. మరిన్ని పూర్తి వివరాలకు 80969 51452, 9666621144 నెంబర్లకు సంప్రదించ వచ్చని తెలిపారు

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ సృజన

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: జిల్లా కలెక్టర్ కార్యాలయం సోమవారం జిల్లానలు మూ లల నుంచి ప్రజావాణికి వచ్చిన వారితో కిటకిటలాడింది. ఏపీ ట్రామాకేర్ సెంటర్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గత ఆరునెల లుగా సిబ్బందికి జీతాలు ఇవ్వడంలేదని తక్షణమే జీతాలు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 10 కేంద్రాలలో 580 మంది సిబ్బంది వివిద హోదాల్లో సర్ణ న్స్, మెడికల్ ఆఫీసర్స్,స్టాఫ్‌నర్సులు, రెడియో ఆఫీసర్స్, లేబ్ టెక్నీషియన్స్ తదితర విభాగాల్లో పనిచేస్తున్నాం న్నారు. జీతాలతోనే కుటుంబాన్ని పోషించుకునే ఉద్యోగులు జీతాల్లేక పోషణ కష్టతర మవుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కంచరపాలెం శ్రీమత్స్యమాంబ ఆలయం మార్కెట్లో గత 60సంవత్స రాలుగా చేపల వ్యాపారం చేసుకుం టూ జీవనం సాగిస్తున్న తమ స్థలాలను అభి వృద్ధి పేరిట స్థానిక సంఘనాయకులు తీసుకుని, తమకు ఇప్పుడు అన్యాయం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణమే మరోచోట మార్కెట్ యార్డు నిర్మాణం చేసి 60 కుటుంబాలను ఆదుకోవాలని విన్నవించారు. నగర వ్యాప్తంగా వున్న ముఠాకూలీల సంఘం ఆధ్వర్యంలో కూలీ రేట్లు నిబంధనల ప్రకారం యాజమాన్యం పెంచేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని విన్నవించుకున్నారు. ఇప్పటివరకూ 25కేజీల బస్తాకు లోడింగ్‌కు ఆరు రూపాయిలు,అన్‌లోడింగ్‌కు మూడురూపాయి ల తొంబైపైసలు ఇస్తున్నారని, ప్రతిరెండుసంవత్సరాలకు 40 శాతం చొప్పున కూలిరేట్లు పెంచుతారన్నారు. ఫిబ్రవ రినెలతో గడువు ముగుస్తుండటంతో మార్చి 1వతేదీ నుంచి కొత్తధరలు అమల్లోకి రావాలని కాని యాజమా న్యాలు స్పందించడంలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. జేసీ సృజన, ఏజేసీ సిరి, డిఆర్వో చంద్రశేఖర్ రెడ్డి ఫిర్యాదులు తీసుకున్నావారిలో వున్నారు

డయల్ యువర్ కలెక్టరుకు 18 వినతులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : సోమవారం ఉదయం జిల్లా కలెక్టరు కార్యాల యంలో నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి 18 ఫోన్ కాల్స్ అందాయి. వీటిలో 6ఫోన్ కాల్స్ రెవెన్యూ శాఖకు చెందినవి కాగా, వికలాంగుల సంక్షేమ శాఖకు చెందినవి 2, గ్రామీణ నీటిసరఫరా విభాగానికి చెందినవి 2, మిగిలిన 8 వివిధ శాఖలకు సంబంధించినవి. వీటిలో ముఖ్యమైనవి రావికమతం మండలం రాయపాడు గ్రామం నుండి, కొత్తకోట గ్రామాల నుండి తాగునీటి సమస్య ఎదుర్కొం టున్నట్లు తెలియజేయగా సంబంధిత గ్రామీణ నీటి సరఫరా విభాగపు అధికార్లకు సమస్యను పరిష్కరించాల్సిందిగా జాయింట్ కలెక్టర్-2 డా.సిరి కోరారు. ఈ దయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమంలో డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి ఇతర అధికార్లు పాల్గొన్నారు

ప్రత్యేక హోదా, రైల్వేజోన్ ఇవ్వాలి

- పార్లమెంట్‌లో టీడీపీతో బీజేపీ ఎంపీలు గళంమెత్తాలి
- నాలుగేళ్లుగా ఆంధ్రా ప్రజలను మభ్యపెట్టారు
- 8 బోగీల బొమ్మల రైలుతో నిరసన
- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్



రైలు నమూనాతో నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి, తదితరులు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: రైల్వేజోన్ ఇస్తామని ఆంధ్రప్రజలను నాలుగేళ్ళుగా మోసం చేస్తున్న మోడీ మెడలు వంచుతామని దక్షిణ నియోజక వర్గం ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. సోమవారం జీవిఎంసీ గాంధీ పార్కు నుండి సరస్వతి పార్కు వరకు బీజేపీ ఎక్స్‌ప్రెస్ నాలుగు సంవత్సరాలు లేటు అనే నినాదంతో 8 బోగీల బొమ్మరైల్‌తో టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మీడియా తో మాట్లాడుతూ విభజన చట్టంలో అంశాలు, రైల్వేజోన్, రాష్ట్రప్రయోజనాలుపై జరుగుతున్న పార్లమెంట్ సమావేశాల్లో టీడీపీ ఎంపీలు గళంమెత్తుతున్నారో దానికి సంఘీభావంగా ఈ విన్నూత్న కార్యక్రమం చేపట్టడం జగిందన్నారు. ముఖ్యంగా ఆంధ్రాప్రజల ఓట్లుతో గెలిచిన బీజేపీ ఎంపీలు కూడా టీడీపీ ఎంపీలతో కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్న విధంగా చేయావల్సిన బాధ్యత రాజకీయపార్టీలపై వుంద న్నారు. సీఎం చంద్రబాబు దీనిపై 20సార్లు ఢిల్లీకి వెళ్ళి మోడీని కలిసిన అడుగుతున్న చేస్తాం..చూస్తాంమని కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రత్యేక హోదా అడిగితే ప్రధానీ నరేంద్రమోడీ ప్రత్యేక ప్యాకేజీతో అంతకన్నా ఎక్కువఇస్తామంటే గుడ్డిగా నమ్మిమన్నారు. నమ్మినదానిపై వంచన చేసి బీజేపీ విధివిదానాలు ప్రజలకు నచ్చుడం లేదన్నారు. ఆంధ్రాకు నాలుగేళ్ళుగా మోసం చేస్తున్న బీజేపీ మోడీకు కన్నువిప్పు కలిగే విధంగా నిరసన చేపట్టా మని, విశాఖరైల్వేజోన్, విభజన చట్టం ప్రకారం ఆంధ్రాకు రావల్సిన 74వేల కోట్లు చేస్తాం చూస్తాం.. ఎడ్యుకేషన్ ఇన్సిస్టూట్స్ 2వేల కోట్లు , అంటున్నారన్నారు. అదే మాదిరిగా వెనుకబడిన జిల్లాలకు స్పెషల్ ప్యాకేజీ 24వేల కోట్లు ఇవ్వాలి, దేని కైనా చేస్తాం..చూస్తాం అంటూన్నారే తప్ప మోడీ ఆంధ్రా కు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా ఆంధ్రప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. అటువైపు మహారాష్ట్రలో శివసేనాకు కత్తిపోటు పొడిచారని, అదే విధంగా అంధ్రాకు చేస్తున్నారని చెప్పారు. మీ యొక్క పద్ధతి మార్చుకుని సంవత్సర కాలంలో ఆంధ్రాకు న్యాయం చేసి చిత్తశుద్ధి చూపించాలన్నారు. లేదని కాంగ్రెస్ పార్టీ విభజించినట్లు ప్రాంతాల్లో చిచ్చుపెడితే కాంగ్రెస్‌కు పట్టిన గతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. అనంతరం టీడీపీ మహిళా నాయకులు వేషదారిణితో వున్న మోడీను మెడలు వంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన ప్రయోజనాలుపై నిలదీసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ముత్యాలనాయుడు, ఈతలపాక సుజాత, డాక్టర్ విల్లూరి చక్రవర్తి, దువ్వారపు రామారావు, బుచ్చా రామరెడ్డి, దిన్నరెహ్మాన్, ససపల పాండురంగారావు, సున్న నాగేంద్ర, కొల్లి సింహాచలం, పాదుగు కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

దాబాగార్డెన్స్ , న్యూస్‌లీడర్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు 2వ రోజుకు చేరుకుంది. జీవిఎంసీ గాంధీ విగ్రహాం దరి విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరుగు తున్న రిలేనిరహార దీక్షలకు సీఐటీయూ ఏఐటీయూసీ పార్టీలు సంపూర్ణ మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లా డుతూ ప్రభుత్వం మొండి వైఖరిని విడనాడి విద్యుత్ కాంట్రా క్ట్ కార్మికుల జేఏసీ నాయకులతో చర్చలు జరిపి వారి డిమాం డ్లను పరిష్కరించాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ విద్యుత్ సంస్థ ల్లో పనిచేస్తున్న సుమారు 24వేల మంది కాంట్రాక్టు కార్మికులు ఫిబ్రవరి 20వ తేదీ నుంచి నిరవదిక సమ్మెలో వున్నారని, తమ సమస్యలు పరిష్కరించాల్సిందిగా అధికారులు, మంత్రులు చూట్టూ తిరుగుతున్నా ఏఒక్కరూ చొరవ తీసుకోనందున విధిలేక సమ్మె చేయాల్సివస్తుందని వారు అన్నారు. ప్రభుత్వం దిగిరాక పోతే విద్యుత్ ఒప్పంద కార్మికుల ఆగ్రహానికి గురికాకపతప్పదని హెచ్చరించారు. అయిన ప్రభుత్వం కార్మిక సంఘాల ఐక్య వేది కను చర్చలకు పిలవకుండా కాలయాపన చేస్తుందని మండి పడ్డారు. ప్రభుత్వ వైఖరిని నిరశిస్తూ విద్యుత్ కాంట్రాక్టు కార్మికు ల న్యాయమైన డిమాం డ్లు సమానపనికి సమానవేతం చెల్లిం చాలని, థర్డ్‌పార్టీ విధనాన్ని, పీస్‌రేట్ పద్ధతిని రద్దుచేయాలని, ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాలకు 20లక్షల రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని, ఉద్యోగభద్రత కల్పిం చాలని కోరుతూ ఈరోజు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరవ ధిక నిరాహారదీక్షలను సీఐటీయూ విద్యుత్ సంస్థలో పని చేస్తు న్న కాంట్రాక్ట్ కార్మికులకు దశలవారీగా కాం ట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం, ప్రమాదాల్లో మరణించిన వారికి రూ.20 లక్షల నష్ట పరిహారం ఈ దీక్షల్లో సీఐటీయూ నగర అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, వి.సాగర్, ఆర్కేఎస్వీ కు మార్, జ్యోతిశ్వరరావు, వివిఎల్. నరసింహాలు, జి.పోలేశ్వ రరావు, ఎం.సూరీడు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు పదాల రమణ, రెహ్మాన్, మీటర్ రీడర్స్ యూనియన్ నాయకులు వి.వి.సత్య న్నారాయణ, టి.పరుశురాం, ఎస్.శ్రీహరి, రాము, రాజు, సంతోష్, ప్రవీణ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగులకు ఆటవిడుపు అవసరం

జాయింట్ కలెక్టర్ సృజన



పోటీలు ప్రారంభిస్తున్న సృజన

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: మహిళా ఉద్యోగులు కుటుంబ, ఉద్యోగ బాధ్యత లతో అనునిత్యం ఒత్తిడికి గరౌతున్నా రని, ఒత్తిడి తగ్గిందుకు ఆటవిడుపు చాలా అవసరమని జేసీ సృజన తెలి పారు. అంతర్జాతీయ మహిళా దినోత్స వం సందర్భం గా సోమవారం ఎన్జీవోల కార్యాలయంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె పోటీలను ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ మహిళలు సామర్థ్యంతో పనిచేస్తున్నారన్నారు. ఈపోటీలలో జిల్లావ్యాప్తంగా వున్న క్లాస్4 నుండి గెజిటెట్ వరకూ సుమారు 300మంది మహిళా ఉద్యోగులు పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. లెమన్-స్పూన్, బాల్‌పికెంగ్, మ్యూజికల్‌చైర్, పాటలపోటీలు, జ్ఞాపకశక్తి,రన్నింగ్‌రేస్, షటిల్, రింగ్‌ఆట, లక్కీడిప్ ఆటలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కరోజు మాత్రమే జరిగే ఈపోటీలలో గెలుపొందిన వారికి బహుమతుల ప్రధానం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యకమంలో చైర్‌పర్సన్ ఎస్.వి లకవాణి, కన్వీనర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

7 వ వార్డులో కమిషనర్ పర్యటన

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: క్షేత్ర పర్యటనలో భాగంగా జీవీ ఎంసీ కమిషనర్ హరినారా యణన్ సోమవారం ఉదయం జీవీ ఎంసీ జోన్ 2లోని ఏడో వార్డులో పర్యటించారు. ఈసం దర్భంగా అక్కడ పారిశుధ్య ని ర్వహణను పరిశీలిం చారు. వార్డుల్లో పారిశుధ్యం విషయం లో నిర్లక్ష్యం వహిస్తే సహిం చేది లేదని ఈ సందర్భంగా సిబ్బందిని, అధికారులకు హెచ్చరించారు. స్థాని కులు కూడా జీవీఎంసీకి సహకరించాలని పరిసర ప్రాంతాలు శుభ్రంగా వుం చుకోవాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి లక్ష్మీ,జోన్ 2 కమిషనర్ వెంకటే,ఏసీపీ నాయు డు,పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

సీబీసీఐడీతో విచారణ జరిపించాలి

జన చైతన్య హౌసింగ్‌పై చర్యలు తీసుకోవాలి
జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: జన చైతన్య హౌసింగ్ సంస్థ దళితలకు చేసిన మో సంపై సీబీసీఐడీతో విచారణ జరిపిం చాలని లోక్ జనశక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వందాన శ్రీనివాసరావు డి మాండ్ చేశారు. సోమవారం ఉదయం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన చైతన్య హౌసింగ్ ఇళ్ళు అందజేస్తామని దళితల నుండి 2వేల కోట్లు వసూళ్ళు చేసిందన్నారు. ఎళ్ళుగా ఈ సమస్యను పరిష్కరిం చ కుండా కాలయాపన చేయడం తగద న్నారు. జిల్లాలో ఎస్సీ ఎస్టీ అత్యా చార కే సుల పరిష్కారంలో ప్రభుత్వ యం త్రాంగం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని, తక్షణమే ఈ కేసులు విచారించి బాధి తులకు సత్వర న్యాయం చేయా లన్నా రు. అలాగే ఎస్సీ ఎస్టీ లకు సంబంధిం చిన భూములను బినామీలు, దళారు లు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని ఆ రోపించారు. ఇళ్లు, సాగుభూములు కూడా కల్పించకపోవడం దురదృష్టక రం అన్నారు.విద్యా, ఉపాధి, వైద్యం వంటి సౌకర్యాలు సక్రమంగా అమ లు చేయడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ బిసి, మైనార్టీలకు సంబంధించిన బడ్జెట్‌ను సరిగా అమలు చేయడం లేద ని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సత్వరమే స్పందించి తగు చర్యలు తీసు కోవాలని కోరా రు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి వందాన వెంకటరావు, మహి ళా అధ్యక్షురాలు బంగారి సత్యవేణి, కార్యదర్శి ఏ. తాతారావు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి

డిహెచ్‌పీఎస్ డిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల మెస్ ఛార్జీలు రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు జేవి ప్రభాకర్ డిమాండ్ చేశారు. ఎల్ఐసీ బిల్డింగ్ దరి వున్న అంబేద్కర్ విగ్రహాం దరి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్ ఫీజు రియంబర్సుమెంట్, స్కాలర్ షిప్‌లను తక్షణమే విడుదల చేయాలన్నారు. జైల్లో వుండే నేరస్థులకు రోజుకు రూ.65 చెల్లిస్తుండగా చదువకునే బావిపౌరులకు రోజుకు రూ. 50 కూడా చెల్లించకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర కార్యదర్శి బి. వెంకటరావు మాట్లాడుతూ తక్షణమే 50 నుండి రూ. 75కు పెంచాలన్నారు. ఐదేళ్ళుగా దళిత విద్యార్థి సంఘాలు డిమాండ్ మేరకు 7 వ తరగతి పిల్లలకు నెలకు రూ. 1000 కాలేజీ పిల్లలకు రూ. 1500 పెంపుకోసం అధికారులు చేసిన సిఫార్సులు సంవత్సర కాలంగా ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో వున్నాయన్నారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనైనా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిల్లి వీర్రాజు, రెయ్యివెంకటరమణ, జి. రాంబాబు, షారోన్ రాజు, బి. మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మరో వేర్పాటువాదానికి బీజాలు వేస్తున్న చంద్రబాబు

ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణంరాజు



నివేదికను చూపిస్తున్న సభ్యులు

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: చంద్రబాబునాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న విదా నాలతో రాష్ట్రంలో మరోసారి వేర్పాటువాద ఉద్యమాలు తలెత్తే ప్రమాదం వుం దని ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు తెలిపారు. సోమవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశం నిర్వ హించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అభివృద్ధిని కేవలం హైదరాబాద్‌కే పరిమి తం చేయడం వలన రాష్ట్రం విడిపోయిందని ఇప్పుడుకూడా కేవలం అమరావతి ని అభివృద్ధి చేయడంవలన వేర్పాటువాదం పెరిగిపోతోందని ఆవేధన వ్యక్తంచేశారు. హోదా తయ్యే సామర్థ్యం ముఖ్యమంత్రికి లేకపోవడం వలన ఉపాధి అవ కాశాలు వుండవని, ఇప్పటికే రాయలసీమలో వేర్పాటువాదం వినపడు తోందన్నారు. ఉత్తరాంధ్రా పేదరికంపై ఎడిటర్స్ తయారుచేసిన సమగ్ర నివేదికను మీడియాకు వివరించారు. అమరావతిలో గాలిమేడలు కడుతూ, ఉత్తరాంధ్రాకి ఆకలికేకలు మిగులుస్తున్నారన్నారు. విశాఖలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులన్నీ ప్రహసనాలేనన్నారు. ఈ కార్యక్రమంలో బాప్ కో కన్వీనర్ డాక్టర్ కె రాజేంద్రప్రసాద్, ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భరిణికాన రామారావు, సన్‌మూర్తి, సీనియర్ పాత్రికేయుడు ఎన్. నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల డిమాండ్లు పరిష్కరించాలి

ఏపీ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంకుమార్



నిరసన తెలుపుతున్న వైద్యులు

విశాఖసిటీ,న్యూస్‌లీడర్: గత కొంతకాలంగా పెండింగ్‌లో వున్న ప్రభుత్వ వైద్యుల డిమాండ్లను తక్షణమే పరిష్కరిం చాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల అసోసియేషన్ ప్రధాన కార్యద ర్శి డాక్టర్ శ్యాంకుమార్ తెలిపారు. తమ సమస్యలు పరిష్క రించేవరకూ నిరవదికంగా రాష్ట్రవ్యాప్తంగా పేషెంట్లుకు ఇబ్బంది కలుగకుండా వివిద రూపాల్లో తమ నిరసనలు తెలియజేస్తున్నామన్నారు. పెండింగ్‌లో వున్న ప్రమోషన్లను తక్షణమే అమలుచెయ్యాలన్నారు. కేంద్రం అమలుచేస్తు న్న విధంగా 65సంవత్స రాలకు రిటైర్‌మెంటు వుండాలన్నారు. ఖాళీగా వున్న పోస్టులను తక్షణమే భర్తీచెయ్యాలన్నారు. తక్కువమంది డాక్టర్లు వుండడంతో పనిభారం పెరుగుతోందని ఎమర్జెన్సీ సేవలకు అందుబాటులో వుండే ఆరోగ్య శాఖను బయోమెట్రిక్ విదానం నుంచి సడలించాలన్నారు. పీజీ మీట్ పరీక్షల్లో డాక్టర్లకు సర్వీసు గతంలో వలే వుంచాలని మార్పుచెయ్యొద్దని డిమాండ్లలో పే ర్కొన్నారు. నిరసన కార్యక్రమాల్లో బాగంగా విశాఖల రామటాకీస్ వద్ద వినా యక నగర్‌లో దేవునికి ప్రత్యేకపార్ధనలు చేశారు. ఈనెల 18తేదీ వరకూ వివిద రూపాల్లో నిరసనలు తెలియజేసి చివరిరోజున సమ్మెనోటీసు ఇవ్వను న్నట్లు తెలిపారు.

వర్మపై చర్యలు తీసుకోవాలి : ఐద్వా



రాస్తారోకో చేస్తున్న మహిళలు

దాబాగార్డెన్స్,న్యూస్‌లీడర్: ఫోర్న్ చిత్రాలతో యువతను తప్పదోవ పట్టిస్తూ, ప్రశ్నించిన మహిళా నాయకులుపై అసభ్యవాఖ్యలు చేసిన సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మను తక్షణమే అరెస్టు చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) నాయకులు డిమాండ్ చేశారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం మార్చి 8న జరగుతున్న సందర్భంగా సోమవారం పూర్ణమార్కెట్ దరి మానవహారం నిర్వహించారు. ఈ మేరకు మహిళా నేతలు మాట్లాడుతూ విశాఖలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, పట్టపగలే మహిళలపై అఘాత్యాలు జరుగుతన్న పట్టించుకునేవారే కరువయ్యారన్నారు. రాంగోపాల్ వర్మ విశాఖ మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేసిన నెలలు గడుస్తున్న ఇంత వరుకు పోలిసులుగానీ ప్రభుత్వంగానీ చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పి. వరలక్ష్మి, ఆర్ఎన్. మాధవి, కె. మణి, ఎం. అన్నపూర్ణ, ఎస్. పార్వతి, పైడిరాజు, కె. వరలక్ష్మి, నాగలక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణకు జాగ్రత్తలు అవసరం

-బీజేపీ నగర ఉపాధ్యక్షులు శ్యామల



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న శ్యామల

దాబాగార్డెన్స్, న్యూస్‌లీడర్: దంతక్షయం నుండి మనకి మనమే రక్షించు కోవ దానికి చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవాలని బీజేపీ నగర ఉపాధ్యక్షుడు శ్యామల దీపికా విద్యార్థులకు సూచించారు. గీతం డెంటల్ కాలేజీ అండ్ హాస్పటల్ ఆధ్వర్యంలో శంకరమఠం మధురానగర్ మున్సిపల్ పాఠశాలలో విద్యార్థులకు దంతపరీక్షలు, నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిధిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించి విద్యారు లుతో మాట్లాడారు. కన్జర్వేటివ్ డెంటీస్ట్రీ, ఎండోనిటిక్స్ వ్యవస్థాపకదినోత్సవం సం దర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. రోజు రెండు పూటల పళ్ళను శుభ్రం చేసుకోవాలన్నారు. ముందుగానే డాక్టర్లు సంప్రదించి వ్యాధికి తగిన మందులు వాడటం వలన పళ్ళను రక్షించుకోగలమని అన్నారు. అనంతరం వైద్యులు పిల్లకు దంత పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గీతం డెంటల్ కాలేజీ అండ్ హాస్పటల్ డాక్టర్లు ఎం. జ్యోతి, శిరిషా, మోహన్, శ్రీనివాస్, లక్ష్మణ్ వర్మ, రవికుమార్, రూపేష్ , పాఠశాల ప్రదానోపాధ్యాయుదు వై. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంచలన వార్తాపత్రిక
లీడర్
ఎడిటోరియల్

పంచాంగం

శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయనం, శిశిరరుతువు
ఫాల్గుణ మాసం
శుక్లపక్షం

బ.పంచమి రా. 12:59 వరకు
స్వాతి రా. 8:52 వరకు
వర్జ్యం రా. 2:50 నుండి 4:33 వరకు
దు.ము. రా.10-48 నుండి 11-44 వరకు
రా.కా. మ. 3-02 నుండి 4-36 వరకు

విశాఖపట్నం
మంగళవారం 6-3-2018

రాజ్యాల మధ్య ఆయుధ పోటీ

అమెరికా పోటీగా చైనా ఆయుధ వ్యవస్థను పెంచుకుంటుంది. ఈ పరిణామం అనివార్యంగా భారత్‌పై పడుతుంది. ఇక ఈ పోటీకి అంతం ఎప్పుడూ ఉండదు. ఆయుధాల ద్వారా భద్రత చేకూరుతుందనే తప్పుడు ఆలోచనాధోరణి నుంచి బయటపడినప్పుడే ప్రపంచానికి ఈ ముప్పు తప్పుతుంది. నాటో రక్షణ వ్యవస్థలకు దొరుకకుండా లక్ష్యాన్ని ఛేదించే కొత్తరకం క్షిపణులను తయారు చేసుకున్నట్టు రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించడంతో పెద్ద రాజ్యాల మధ్య మళ్ళా ఆయుధపోటీ తీవ్రమవుతుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. రష్యా విధానం వల్ల మళ్ళా ప్రచ్ఛన్నయుద్ధం తలెత్తే ప్రమాదం ఉందని అమెరికా శిబిరంలోని వారు వ్యాఖ్యానిస్తున్నారు. కానీ పుతిన్ మాత్రం అమెరికా విధానమే తాము కొత్త ఆయుధాలు రూపొందించుకోవడానికి ప్రేరేపించిందని ఆరోపించారు. పుతిన్ వెల్లడించిన వివరాల ప్రకారం-రష్యా రూపొందించుకున్న కొత్త క్షిపణి అణుశక్తితో తక్కువ ఎత్తులో ప్రయాణిస్తుంది. అమెరికా రక్షణ వ్యవస్థకు దొరుకకుండా సాగడమే కాకుండా, ఎంత దూరమైనా ప్రయాణించగలదు. ఆకాశం నుంచి ఉల్క మాదిరిగా దూసుకువచ్చే మరో క్షిపణి ధ్వని కన్నా అనేక రెట్లు వేగంగా ప్రయాణించగలదనీ, అజేయమైనదని పుతిన్ వివరించారు. రష్యా పార్లమెంటులో ఈ వివరాలను వెల్లడించిన పుతిన్, ఈ సందర్భంగా వీడియో ద్వారా క్షిపణులను ప్రదర్శించారు. రష్యా అధ్యక్ష ఎన్నిక ఈ నెల పద్దెనిమిదవ తేదీన జరుగనుంది. ఈ ఎన్నిక నేపథ్యంలో ప్రజాభిమానం పొగు చేసుకోవడానికి పుతిన్ ఈ క్షిపణుల కథనాన్ని వినిపించారని అమెరికా శిబిరం అంటూనే, రష్యా విధానం ఆయుధ పోటీని పెంచేదిగా ఉందని కూడా తప్పుపడుతున్నది. పుతిన్ రష్యాలో బలమైన నాయకుడిగా అవతరించారు. రాబోయే ఎన్నికలలో ఆయన గెలుపు దాదాపు ఖాయమనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ నేపథ్యంలో నిరాధారమైన కథనాలు వినిపించవలసిన అవసరం పుతిన్‌కు లేదు. పైగా అగ్రరాజ్యమైన అమెరికాను రెచ్చగొట్టే. కీలకమైన ప్రకటనలను అంత అలవోకగా చేస్తారని ఊహించలే ము. పుతిన్ చెబుతున్న కొత్తరకం క్షిపణులు ఇంకా అమ్ములపొది లో చేరనప్పటికీ, చివరి దశ తయారీలోనైనా ఉండి ఉంటాయని భావించవచ్చు. ఇప్పటికే భూగోళాన్ని అనేకసార్లు సర్వనాశనం చేయగలిగే ఆయుధాలు కుప్పలుతెప్పలుగా ఉన్నా యి. ఈ పరిస్థితుల్లో రష్యా మళ్ళా కొత్తరకం క్షిపణులను తయారుచేయడం సమర్థనీయం కాదు. కానీ ఈ ఆయుధ పోటీ పెరుగడంలో అమెరికా బాధ్యత కూడాఉన్నది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో, ఆ తరువాత ఆయుధ వ్యవస్థ తగ్గింపు ఒప్పందా లు కుదిరాయి. ఈ నిరాయుధీకరణ పరిణామాన్ని మరింత ముందుకు తీసుకుపోతే బాగుండేది. క్షిప ణి ప్రయోగ వ్యవస్థల తగ్గింపు కోసం 1970 దశకంలోనే వ్యూహాత్మక ఆయుధాల పరిమితి చర్చలు (సాల్ట్) సాగి రెండు ఒప్పందాలు కుదిరాయి. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో ఇదొక పెద్ద ముందడుగుగా చెప్పుకోవచ్చు. 1986లో రెక్జవిక్‌లో అమెరికా అధ్యక్షుడు రీగన్, సోవియెట్ యూనియన్ అధినేత గోర్బచేవ్ సమావేశమైన నేపథ్యంలో దీర్ఘశ్రేణి వ్యూహాత్మక ఆయుధాలు తగ్గించుకోవడం సాధ్యమయ్యేదే. కానీ అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థపై పరిశోధనలు మొదలుపెట్టడం వివాదాస్పదమైంది. ఆ తర్వాత 1990 దశకం ఆరంభంలో వ్యూహాత్మక ఆయుధ తగ్గింపు ఒప్పందాలు (స్టార్ట్1, స్టార్ట్ 2) కుదిరాయి. సోవియెట్ యూనియన్ విచ్ఛిన్నమైనా, అణ్వాయుధాలు గల రష్యా, మూడు రిపబ్లిక్‌లు నిరాయుధీకరణ స్ఫూర్తిని కొనసాగించాయి. ప్రచ్ఛన్నయుద్ధం కూడా ముగిసినందువల్ల ఆయుధ పోటీ సమసిపోతుందనే అభిప్రాయం నెలకొన్నది. కానీ మళ్ళా ఆయుధ పోటీ కొత్త రూపం సంతరించుకొని ముందుకురావడం ఆందోళనకరం. రష్యా తాజాగా కొత్త క్షిపణులను తయారుచే యడం గతంలో కుదిరిన నిరాయుధీకరణ ఒప్పందాలను ఉల్లంఘించడమేనని అమెరికా విమర్శిస్తున్నది. కానీ అమెరికా క్షిపణి నిరోధక వ్యవస్థను నిర్మించుకోవడం వల్లనే తాము దానికి అతీతమైన క్షిపణి వ్యవస్థను వృద్ధి చేసుకోవలసి వచ్చిందని పుతిన్ విమర్శించడం గమనార్హం. ఆయుధాలు భద్రత కల్పించినట్టు కనిపిస్తుంది కానీ, ఈ ఆయుధ పోటీ పెరిగే కొద్దీ ప్రమాదం పెరుగుతుంది. అమెరికా, రష్యా, చైనా మొదలైన పెద్ద దేశాలు ఈ భారీ ఆయుధ సంపత్తి తమకు భద్రత కల్పించలేదని గ్రహించాలి. ఎప్పుడూ ఒక దేశాన్ని మించి మరో దేశం ఆయుధాలను తయారుచేస్తూనే ఉంటుంది. ఈ పోటీ ఒక దగ్గర ఆగదు. ఆకాశంలో గూఢచార ఉపగ్రహాలు తిరుగుతున్నాయి. సముద్రంలో జలాంతర్గాములు తిరుగుతున్నాయి. ఖండాంతర క్షిపణులు తయారయ్యాయి. వీటికి రక్షణ వ్యవస్థలు ఏర్పడ్డాయి. తాజాగా రక్షణ వ్యవస్థలకు అతీతమైన క్షిపణులు తయారయ్యాయి. రెండు శిబిరాలు ఆయుధ పోటీకి దిగినట్టే, ప్రతి ప్రాంతంలో వైరిదేశాల మధ్య ఆయుధ పోటీ ఉంటుంది. అమెరికా పోటీగా చైనా ఆయుధ వ్యవస్థను పెంచుకుంటుంది. ఈ పరిణామం అనివార్యంగా భారత్‌పై పడుతుంది. ఇక ఈ పోటీకి అంతం ఎప్పుడూ ఉండదు. ఆయుధాల ద్వారా భద్రత చేకూరుతుందనే తప్పుడు ఆలోచనాధోరణి నుంచి బయటపడినప్పుడే ప్రపంచానికి ఈ ముప్పు తప్పుతుంది. ఈ పోటీని నివారించడం అగ్రదేశాల నుంచే ప్రారంభం కావాలి.

సౌందర్య మరణాల శ్రీదేవతలు

రీడింగ్ రూమ్



రామతీర్థ
9849200385

అతిలోకసుందరి అంటూ నామకోటి స్మరణం చిత్ర శబ్ద సమన్వితంగా రాత్రింబవళ్ళు సాగుతున్నది. యాభై నాలుగేళ్ల జీవితంలో యాభై ఏళ్ళు కెమెరా ముందు నిలబడ్డ ధీరురాలి గురించి మాట్లాడుతున్నాము అన్న ఎరుక లేకుండా, చెప్పిందే చెప్తూ, చానెళ్లలో ముతక గానుగ తిరుగుతున్నది. వారు ఎప్పుడూ అలాగే అవే కొలతలతో నిత్య యవ్వనంగా ఉండాలి అనే కోరికతో కొట్టుకులాడే సినిమా పరిశ్రమ, మీడియా సౌందర్య సరుకుల వ్యాపార రంగాలు సమాజంలో కలిగించే అంచనాలకు తాజా బలి దేవత ఆమె. ముక్కు, కనుబొమలు, పెదవులు, చెంపలు, వక్షోజాలు, పిరుదులు, ఇలా స్త్రీ ఒక కొలతల సూపర్ బజార్‌గా ఆమె తెల్లగానే ఉండాలనే ఒక బ్యూటీ బజారు వ్యాపార వెర్రిలో, సహజ సౌందర్యవతులైన స్త్రీలు, ఎలా ఈ చూపుల అంగడిలో కొలువు బొమ్మలుగా మిగిలేందుకు తమపై ఎటువంటి ఒత్తిడిని తీసుకుంటున్నారో అనే దానికి ఇదొక తాజా ఉదాహరణ.

36-24- 38 కొలతలతో స్త్రీని బాగానే కొలుస్తున్నాము అని స్త్రీ వాదులు ఈ సమాజాన్ని మందలిస్తే, అందుకు నలుపు కూడా సరైన రంగే అని నందితా దాస్ వంటి ప్రతిభ గల ఆర్ట్ సినిమా తారలు అంటున్నా, ఏ మంచి ఫలితాలూ ఇవ్వని అందాల ఇనుమడింపు ఉత్పత్తులను, సినిమారంగపు తెల్ల దనపు పిచ్చిని, మీరు ఇన్ని రోజుల్లో మంచి రంగు పొందుతారు అనే పిండి ముద్దల, పసరుల, లేహ్యాల, పొడుల, రసాయనాల అమ్మకం నాలుగు వేల కోట్లుగా మొదలైంది నేడు ఇరవై రెట్లు పెరిగిందని పరిశ్రమ అంచనాలు చెప్తున్నాయి. ఆడా , మగా తేడా లేకుండా, వెండితెర దేవతలు, దేవ కుమార్తెలు, దేవకుమారులు, ఇలా తమ అందాన్ని పెంచుకునేందుకు లేజర్ లేదా కత్తి కోతలకు తమ దేహాలను వశపరిచి, తద్వారా, కోట్లాదిమంది ప్రేక్షకుల అభిమానాన్ని తమ కైవసం చేసుకోవాలని కోరుకుంటూ ఉంటారు. ఇదొక విరోధాభాస. ఒక పారడాక్స్. కత్రినా వంటి జీరో సైజు నటీమణులు, సిక్స్ పాక్ హీరోలు, ఊరికే బరువు తగ్గిపోవడాలు, లేదా స్టెరాయిడ్ల ద్వారా బరువు పెరిగి పోవడాలు, ఇవన్నీ ఇటీవల రెండు మూడు దశాబ్దాల్లో బాగా పెరిగిపోయాయి. హాలీవుడ్‌లో ఉన్న ఈ తారల అందచందాల భీమా కాళ్ళూ, పొడుగాటి తొడలు, నడుము, పిరుదులు, పాలిండ్లు, ఇవన్నీ కూడా, బీమాకు అర్హమైనవే. వెర్రి (మెర్లిన్ మన్రో తన వక్షోజాల భీమా చేయించుకున్నది). 2013లో సైతం ఆమె ఫుర్రె ఎక్స్‌రేలు వేలంలో కొనుక్కునేందుకు అభిమానులు పోటీ పడ్డారు. ఆమె వక్షోజాలు, కొనగెడ్డం అందంగా బిగువుగా ఉండడం కోసం, చేయించుకున్న రసాయనిక వైద్యం వల్ల అనారోగ్యం పాలైంది. మందులకు మోతాదు ఎక్కువై ఆమె రొమ్ములకు ఇన్ఫెక్షన్ సోకింది అని డాక్టర్లు తెలిపారు. ముప్ఫయ్యారు ఏళ్లకే 1962లో అకాల మరణం పాలైన మెరిలిన్, ఇప్పటికీ పాశ్చాత్య సినిమా లోకంలో ఒక హవా. మగవాడు, పాప్ గాయకుడు, మైకేల్ జాక్సన్ అనేక ప్లాస్టిక్ సర్జరీల ద్వారా, తన నలుపు/చామనచాయ





శరీర వర్ణాన్ని, మొగాన్ని పదుల ఆపరేషన్లకు గురి చేశాడు. దాని కారణమే, తను అకాలంలో, హటాత్తుగా కన్ను మూశాడు. జూన్ 18, 2017 న ఇన్స్టాగ్రామ్ స్టార్, ఫిట్నెస్ కు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చే రెబెకా బర్గర్ ఒక బ్యూటీ క్రీమ్ కేనిస్టర్ (ప్రెజర్తో ఉండే ఒక ఏరోసోల్ డబ్బా తన దేహానికి ఆ క్రీమ్ రాసుకుంటూ ఉండగా పేలి, చని పోయింది. తూర్పు ఫ్రాన్స్ లో జరిగిన ఈ దుస్సంఘటన తమ కుటుంబ విషయంగా వారు పోస్ట్ చేశారు. ఇటువంటి "లోపాలు కలిగిన సౌందర్య సామగ్రి ఇంటిలో వాడ వద్దు" అని ఫ్రాన్స్ నేషనల్ కన్స్యూమర్ ఇన్స్టిట్యూట్ హెచ్చరికలు జారీ చేసింది. లోపల ఉండే కార్బన్ డయాక్సైడ్ మిశ్రమపు ఒత్తిడిని ఈ ప్లాస్టిక్ డొక్కు తట్టుకోలేక పోవడం వల్ల పేలుడు జరిగి ఉంటుంది, అని లోపాలతో కూడిన పేకింగ్‌ని తప్పు బడుతూ, పరిశీలనలు కూడా వచ్చాయి. అందాల పోటీల్లో, దేహం పై జరిగే హింస పెద్దగా ఫోకస్‌లోకి రావడం లేదు కానీ, పెట్టుబడిదారీ సమాజం, తనకు కావలసిన సైజు ముద్దు గుమ్మల కొలతలు నిర్ణయించి, ఆ కొలతలకి లోబడే దేహం ఉన్న వారిని మిస్ వరల్డ్, మిస్ యూనివర్స్, మిస్ ఇండియా, మిస్ అమెరికా అని పిలవడం ఒక యూజ్ అండ్ త్రో నాగరికత (వాడి గిరాటు వేసే సంస్కృతి)కి చెందిన అవలక్షణం. ఈ ఏడాది ముద్దుగుమ్మలు వచ్చే ఏడాదికి పాతబడిపోతారు. కొత్త పంటలా కొత్త ముఖాలు మళ్ళీ కావాలి. ఇదే వ్యాపార లక్షణం. గమ్మత్తు ఏమిటంటే, ఈ పోటీల్లో స్త్రీలు కూడా, అత్యంత సాను కూలంగా పాల్గొనడం. "తాము ఆలోచించే మేధస్సుకి చెందము, ఆకర్షించే దేహాలుగా ఈ గుర్తింపే ఎక్కువ, మాకు చాలు" అనే ధోరణిలో. కాపిటలిస్ట్ సమాజ ఫేషన్లు, వాటికి అనుగుణంగా నడిచే యువతులూ, వీరిని ప్రమోట్ చేసే వ్యాపార వ్యవస్థ, చానెళ్లు, పత్రికలూ, వీటినుంచే కొత్త సినిమా స్టార్లు పుడుతున్నారు. ఈ అందాల పోటీలలో తాము ముందే ఉండాలన్న తాపత్రయానికి శ్రీదేవి కూడా మినహా యింపు కాదు. అందాల ని నిలబెట్టుకునే శస్త్ర చికిత్సల పరోక్ష ప్రభావమే, ఆమె అకాల మరణంలో కూడా కొంత పాత్ర కలిగి ఉన్నది. "ఫేస్ ఈజ్ ద ఇండెక్స్ ఆఫ్ మైండ్" అన్నప్పుడు మేధకు గల సౌందర్యమే మొగంలో కనిపిస్తుంది అంటూ ఒక ప్రఖ్యాత సూక్తి ఉండగా, కాదు, కాదు, మా మొగాలకు నిత్య యవ్వనమే చాలు, ఆలోచనల అందం అక్కరలేదు అను కునేలా, గ్లామర్ బొమ్మలా వయసుతో సంబంధం లేకుండా ఉండడం, అందరికీ అనుకూలించదు, వయసులో బొద్దుగానే ఉన్నా శ్రీదేవి నటించిన ఆ తొలి తెలుగు సినిమాలు చూసిన ప్రేక్షకులు ఎవరు కోరారని, ఈ ప్లాస్టిక్ సర్జరీల వెర్రి. అందం శాశ్వతం అనే భ్రమ, ఏది అందం అనే ప్రశ్న కూడా లేవనెత్తుతుంది. మహానటి అనడం కొంత ఎక్కువ చేసి చెప్పడం తప్పు, ఆకర్షణ, స్క్రీన్ కెమిస్ట్రీ వర్క్ అవుట్ అయిన అదృష్టవంతురాలు శ్రీదేవి. ఆమె ప్రశాంతంగా జీవించలేక పోవడానికి "పాకుడు రాళ్ళు" వంటి పరిశ్రమ, రోజూ అందాల అష్టోత్తరాలు చదివే మీడియా, ఆమె జీవితాన్ని ప్రభావితం చేశాయి. ఎంటర్టైన్మెంట్ ఇండస్ట్రీకి అధిక మొత్తంలో లాభాలు ఆర్జించిన మెస్కోట్ శ్రీదేవి. ప్రేక్ష కుల సాంఘిక మనస్తత్వ ధోరణికి అనుసారంగా పాత్రలు తయారై, ప్రఖ్యాత నటులు అందరితో, భారతీయ చిత్ర పరిశ్రమలో జంటగా నిలిచిన సక్సెస్ స్టోరీ శ్రీదేవి. ఎందరో వ్యాపారుల అందాల ఉత్పత్తుల మార్కెట్, అమెరికా దేశంలో కన్నా వేగంగా, పెరుగుతూ, ఎనభై వేల కోట్లకు చేరుకుంటుందన్న వార్త ఎవరికి సంతోషకరమో, ఆ వర్గాలకు విజయ సాధనలో, తన శరీరంపైనే ప్రయోగాలకు, శస్త్ర చికిత్సలకు స్వాగతించిన వ్యక్తిగా, శ్రీదేవి ఈవేళ మనమధ్య లేకపోవడం, మరీ అంత కాకతాళీయం ఏమీ కాదు.

ఒక సమాజంగా, కన్స్యూమర్ గుంపుగా, అందాల యావ పెంచి పోషించే సమాజంలో, ఇవన్నీ ఎదుర్కోవలసిన సంఘటనలే. అయినప్పటికీ శ్రీదేవి పాపులర్ సినిమాలో "వెండితెర అద్భుతం"గా పొందిన సాఫల్యత, ఆమెను ఇరవయ్యో శతాబ్దపు భారతీయ సినిమా సంస్కృతిలో స్థిర వ్యక్తిత్వంగా నిలబెడుతుంది.

ఉత్తమ సాధ్విని స్వచ్ఛమైనది

బుద్ధుడు సందేశాలు



"భిక్షువులు వానాకాలం ఎక్కడెక్కడో గడిపి తథాగతుని దర్శనానికి తిరిగి శ్రావస్తికి వస్తారు. మీతో మాట్లాడుతూ, ఎవరో ఒక భిక్షువు మరణ వార్త చెప్పి, అతని గతి ఏమవుతుందని అడుగుతారు. ధర్మ పరివర్తన ఫలాన్ని పొందాడనో, అర్హతుడయ్యాడనో, నిర్వాణ స్థితి పొందాడనో ఆయా సందర్భాన్ని బట్టి మీరు సమాధానం చెబుతారు. నేను భిక్షువుల దగ్గరికి వెళ్లి ఆ చనిపోయిన సోదరుడు ఇదివరకు శ్రావస్తి విహారంలో ఉన్నవాడేనా అని అడుగుతాను. వారు అవును అని చెబితే ఆ సోదరుడు వానాకాలానికి ఇచ్చిన దుస్తులనో, వెలపలి నుంచే వచ్చే వారికిచ్చే ఆహారాన్నో, బయటకి వెళ్లే వారికిచ్చే ఆహారాన్నో, జబ్బుపడిన వారికిచ్చే భోజనాన్నో, జబ్బుపడిన వారికి సేవచేసే వారికి ఇచ్చే భోజనాన్ని, మందులనో, పాయసాన్నో ఏదో ఒకటి నేనిచ్చిన దాన్ని అనుభవించి ఉంటాడని తీర్మానించుకొంటాను. అప్పుడు నాలో సంతోషం కలుగుతుంది. సంతోషం నుంచి ఆనందం ఉద్భవిస్తుంది. దాని వలన నాకు మనశ్శాంతి లభిస్తుంది. శాంతి వలన తృప్తి కలుగుతుంది. హృదయానికి ఊరట కలుగుతుంది. నీతిని, ధర్మాన్ని, వివేకాన్ని ఆ విధంగా ఆచరణలో పెట్టినదాన్ని అవుతాను. ఈ వరాలను అడగడంలో నా ఉద్దేశ్యం అది. నా కోరికలు నెరవేరితే కలిగే ప్రయోజనం అది".

బుద్ధుడు అది విని, "బాగు విశాఖా, వరాలడగడంలో నీ ఉద్దేశ్యం మంచిదే. అర్హులైన వారికి దానం సుక్షేత్రంలో మంచి విత్తనం నాటడం వంటిది. దాని వలన సమృద్ధిగా సత్ఫలితాలు వస్తాయి."

అని చెప్పాడు. "అయితే కామమోహాలకు దాసులైన వారికి దానమిస్తే, చవిటి నేలలో విత్తనం వేసి నట్లవుతుంది. ఉద్వేగాలు వారి పురోభివృద్ధికి ఆటంకంగా నిలుస్తాయి" అని అంటూ విశాఖకు పద్యరూపంగా కృతజ్ఞత తెలియజేశాడు.

నీతి, నిజాయితీ, ఔదార్యం మేళవించిన మగువా!
ఉత్తమ సాధ్విని, స్వచ్ఛమైనది నీ హృదయం
తథాగతుని శిష్యురాలిగా నీవు చేస్తున్న త్యాగం
తరతరాలు చెప్పుకొంటారు ఇది తథ్యం
బాధితులకు ఉపశమనం, భిక్షువులకు ఆనందం
కలిగిస్తుంది ధర్మహృదయా నీ దానం
దాతకేగాదు నిశ్చయంగా దాన ఫలితం
అందరికీ తృప్తి, అంతులేని మనశ్శాంతి

దిన ఫలాలు

మంగళవారం -6-3-2018

మేషం: శత్రువులపై విజయం సాధిస్తారు. రాజకీయాలలో వారికి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. మీ సంతానం మొండి వైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది.

వృషభం: కాంట్రాక్టర్లకు ఊహించని సమస్యలు తలెత్తినా పరిష్కరించుకోగలుగుతారు. ఇతరుల ఆనందం, తెలివి మిమ్మల్ని ఆకర్షిస్తాయి.

మిథునం: వదిలేసుకున్న బాకీలు అనుకోకుండా వసూలవుతాయి. ప్రింటింగ్ రంగాల వారికి పనిభారం అధికమవుతుంది. నిలిపివేసిన పనులు పునఃప్రారంభిస్తారు.

కర్కాటకం: విద్యార్థులకు జ్ఞాపకశక్తి కొంత మందగించడం వల్ల ఇబ్బందులకు లోనవుతారు. ఎదుటివారి విషయాలకు దూరంగా ఉండటం క్షేమదాయకం.

సింహం: దుబారా ఖర్చులు తగ్గించాలన్న మీ ఆలోచన ఫలిస్తుంది. స్త్రీలకు ఉదరం, నేత్ర సంబంధిత చికాకులు తలెత్తుతాయి. కేటరింగ్ రంగాల్లో వారికి పనివారల వల్ల సమస్యలు తలెత్తుతాయి.

కన్య: భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ధనవ్యయం విషయంలో మెళకువ వహించండి. బ్యాంకు పనుల్లో ఏకాగ్రత, మెలకువ వహిస్తారు.

తుల: కొబ్బరి, కూరలు, పండ్లు, పూల వ్యాపారస్థులకు సంతృప్తికరంగా ఉంటుంది. పాత మిత్రుల కలయికతో మీకెంతో సంతృప్తినిస్తుంది.

వృశ్చికం: ఇచ్చిపుచ్చుకునే వ్యవహారాలు, వాణిజ్య ఒప్పందాల్లో మీదే పైచేయిగా ఉంటుంది. పాత మొండిబాకీలు వసూలవుతాయి.

ధనస్సు: ఏజెంట్లకు, బ్రోకర్లకు శ్రమాధిక్యత, త్రిప్పట తప్పవు. చాకచక్యంతో లక్ష్యాలు సాధిస్తారు. నిశ్చింతగా ఉండండి మీ సమస్యలు ఇబ్బందులు అవే సర్దుకుంటాయి.

మకరం: అందరికీ సహాయం చేసి మాటపడతారు. ఉద్యోగ, వ్యాపారాలలో ఆటుపోట్లు ఎదుర్కొనవలసి వస్తుంది. స్త్రీలకు కళ్ళు, తల, నరాలకు సంబంధించిన చికాకులు తప్పవు.

కుంభం: ఒక స్థిరాస్తి అమర్చుకోవాలనే ఆలోచన బలపడుతుంది. ధనం రాకడ, పోకడ సరిసమానంగా ఉంటాయి. పెద్ద మొత్తంలో పెట్టుబడులు, స్టాకిస్టులలో మెళకువ అవసరం.

మీనం: ఇతరులకు పెద్దమొత్తంలో ధనసహాయం చేసే విషయంలో పునరాలోచన మంచిది. బ్యాంకు పనులలో ఒత్తిడి, చికాకులను ఎదుర్కొంటారు.

ఆరోగ్యం



అధిక బరువును తగ్గించే కీర దోస జ్యూస్..!

చాలా తక్కువ మొత్తంలో క్యాలరీలను కలిగి ఉండే వాటిలో కీరదోస కాయ కూడా ఒకటి. దీంట్లో పొటాషియం, విటమిన్ ఎ, సి, మెగ్నిషియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. దీన్ని మనం తరచూ పలు ఆహార పదార్థాలతోపాటుగా తీసుకుంటూనే ఉంటున్నాం. అయితే కీరదోసతో తయారు చేసే ఓ జ్యూస్‌ను నిత్యం తీసుకోవడం వల్ల శరీరంలో అధికంగా ఉన్న కొవ్వు కరిగిపోతుంది. దీంతో బరువు తగ్గవచ్చు. ఆ జ్యూస్‌ను ఎలా తయారు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

1 లేదా 2 కీరదోసకాయలను, 1 నిమ్మకాయను, 10 పుదీనా ఆకులను, 1 లీటర్ నీటిని తీసుకోవాలి. కీరదోసకాయలను, పుదీనా ఆకులను, కొద్దిగా నీటిని కలిపి మెత్తని పేస్ట్‌లా చేయాలి. అనంతరం ఈ పేస్ట్‌ను 1 లీటర్ నీటిలో మిక్స్ చేయాలి. దానికి కొంత నిమ్మరసం కలపాలి. అంతే... కీరదోస జ్యూస్ తయారైనట్టే. దీన్ని రోజూ 2, 3 సార్లు తాగుతుంటే ఫలితం ఉంటుంది. దీంతో త్వరగా బరువు తగ్గవచ్చు. అయితే ఈ మిశ్రమం బరువు తగ్గించేందుకే కాదు, జీర్ణక్రియను మెంపొందించడంలోనూ ఉపయోగపడుతుంది. జీర్ణాశయంలో ఏర్పడే అల్సర్లు కూడా తగ్గిపోతాయి. శరీరంలోని విష పదార్థాలు తొలగింపబడతాయి.

చరిత్రలో మార్చి 6

1475 : ప్రముఖ చిత్రకారుడు మైఖేలాంజెలో జననం.(మ. 1564).

1508 : మొఘల్ సామ్రాజ్యపు రెండవ చక్రవర్తి హుమాయూన్ జననం.

1899 : ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు తెలుగు రచయిత్రి తల్లాప్రగడ విశ్వసుందరమ్మ జననం.

1913 : హాస్యనటులకు ప్రాధాన్యత సంతరింపజేసిన ప్రముఖ హాస్యనటుడు కస్తూరి శివరావు జననం (మ.1966).

1919 : ప్రముఖ సాహితీవేత్త గడియారం రామకృష్ణ శర్మ జననం.

1937 : అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి మహిళగా చరిత్రలో ప్రసిద్ధికెక్కిన వాలెంతినా తెరిష్కోవా జననం.

1936 : పాత తరం తెలుగు సినిమా కథానాయిక కృష్ణకుమారి జననం.



పశ్చిమ బెంగాల్ లోని 1933, మార్చి 6న నౌహతిలో జన్మించింది. వేదాంతం జగన్నాథ శర్మ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకుంది. షావుకారు జానకి ఈమెకు పెద్దక్క, మరో అక్క దేవకి కూడా ఒకటి రెండు సినిమాల్లో నటించింది. కానీ ఆమె చిన్న వయసులోనే మరణించింది. నాన్నగారి ఉద్యోగరీత్యా తరచుగా బదిలీల మూలంగా ఈమె విద్యాభ్యాసం రాజమండ్రి, చెన్నై, అస్సాం, కలకత్తా మొదలైన ప్రదేశాలలో జరిగింది. మెట్రిక్ అస్సాంలో పూర్తయిన తర్వాత మద్రాసు చేరిన వీరి కుటుంబం అక్కడే సినీ అవకాశాలు రావడం జరిగింది. ఒకసారి ఆమె తల్లితో సహా స్వప్నసుందరి సినిమా చూడడానికి వెళితే అక్కడికి సౌందరరాజన్ గారి అమ్మాయి భూమాదేవి కూడా వచ్చింది. సినిమా హాల్లో కృష్ణకుమారిని చూసిన ఆమె నవ్వితే నవరత్నాలు సినిమా కోసం అమాయకంగా కనిపించే కథానాయిక కోసం వెతుకుతున్నట్లు చెప్పారు. తర్వాత రోజే వారు కృష్ణకుమారి ఇంటికి వచ్చి తల్లిదండ్రుల అనుమతి తీసుకొని ఆమెకు ఆ పాత్రనిచ్చారు. అలా తెలుగు సినిమా తెరకు 1951లో నిర్మించిన నవ్వితే నవరత్నాలు సినిమా ద్వారా పరిచయం అయ్యారు. కానీ దానికంటే ముందు మంత్రదండం అనే సినిమా విడుదలైంది. తొలి చిత్రంలో నటిస్తుండగానే ఆమెకు 14 సినిమాల్లో అవకాశాలు వచ్చాయి. అప్పటికి ఆమె వయసు కేవలం 16 ఏళ్ళు మాత్రమే. తర్వాత 1953లో తాతినేని ప్రకాశ రావు యన్.ఎ.టి.వారి పిచ్చి పుల్లయ్యలో కథానాయిక వేషం వేయించారు. అందులో మంచి నటన ప్రదర్శించిన కృష్ణకుమారికి పినిశెట్టిగారి పల్లె పడుచు, బంగారు పాప వంటి మంచి చిత్రాలతో పరిశ్రమలో మంచి గుర్తింపు వచ్చింది.

శ్రీవేంకటేశ్వర వైభవము

ఆణివర ఆస్థానోత్సవము

అఖిల బ్రహ్మాండ నాయకుడై అపార కారుణ్య సాగరుడై (తిరుమల) శేషాచలమునందు ఆశ్రిత రక్షణార్థమై వేంచేసి యున్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ప్రతి సంవత్సరము దక్షిణాయన ప్రారంభ దినమున ఆనివర ఆస్థానము అనుపేరుతో నొక మహత్తరమగు ఆస్థానోత్సవము జరుగును.

ఆ పర్వదినమునందు శ్రీ స్వామివారికి విశ్వరూపము, తోమాల సేవ జరిగినవెంటనే ఉత్సవమూర్తులగు శ్రీమలయప్పస్వాముల వారికి వారి పట్టమహిషులగు శ్రీ భూదేవులకూ సేనాధిపతియగు విష్వక్సేనుల వారికి ఏకాంతముగా అభిషేకము (తిరుమంజనము) జరుగును. తరువాత శ్రీ స్వామివారికి అర్చనము జరిగి కొలువు లేకనే (నివేదినము) మొదటిఘంట జరుగును. వెంటనే శ్రీమలయప్పస్వామివారు శ్రీ భూదేవులతో సువర్ణ ద్వారము ముందుగల ఆస్థాన మండపమునందు అమర్చియున్న బంగారు సర్వభూపాల వాహనమందు వేంచేయుదురు. వారలకు వజ్రకవచాద్యాభరణములతో అతిమనోహరముగా అలంకారము సమర్పింపబడును. సేనాధి పతివారు శ్రీవారి పార్శ్వమునందు వేరొక పీఠము మీద దక్షిణాభిముఖముగా వేంచేయుదురు. వారికిని తిరువాభరణములు సమర్పింపబడును. శ్రీవార్లకు అతివైభవముగా పుష్పమాలలతో అలంకారము సమర్పింపబడును. తరువాత శ్రీవారి సన్నిధానములోను, ఆస్థానములోను రెండవ అర్చనము అయిన పిమ్మట పేష్కార్లు, పారుపత్త్యదార్లు, ఇతర ఉద్యోగస్థులు పెద్దజియ్యంగార్లు, చిన్నజియ్యంగార్లు, ఏకాంగులు, ఆచార్యపురుషులు వెంటరాగా మంగళవాద్యములు, శ్వేతఛత్రములు, చామరములు వగైరా మర్యాదలతో శ్రీస్వామివారి ప్రసాదములను గమేకార్ల విమాన ప్రదక్షిణముగా ధ్వజప్రదక్షిణము చేయించితెచ్చి శ్రీవారి సన్నిధానమున, ఆస్థానమునందును ఉంచెదరు. వెంటనే శ్రీవార్లకు ఆరగింపు రెండవఘంట సన్నిధిలోను, ఆస్థానములోను జరుగును.

తరువాత శ్రీవారికి నూతన వస్త్రములను అరింటిని వెండితట్ట యందుంచుకొని జియ్యంగార్లు శిరస్సునవహించి మంగళవాద్యములు, శ్వేతఛత్రములు వగైరా మర్యాదలతో దేవస్థానం అధికార్లు అందరు వెంటరాగా విమాన ప్రదక్షిణముగా శ్రీస్వామివారి సన్నిధిలోనికి వచ్చెదరు.



అర్చకులు ఆతట్టలోని ఆరు వస్త్రములలో నాలుగు వస్త్రములను శ్రీస్వామివారికి సమర్పించెదరు. వెంటనే శ్రీవారికి హారతి జరిగి గోష్ఠికి మాములు ప్రకారం తీర్థం, ఆలవట్టం, చందనం, శఠారి, మడుపు వినియోగం జరుగును. తరువాత జియ్యంగార్లు మిగిలిన రెండు వస్త్రములుగల తట్టను శిరస్సుయందుంచుకొని ఆస్థాన మండపమునగల శ్రీమలయప్పస్వామివార్ల సన్నిధికి వచ్చెదరు. అర్చకులు ఆ రెండువస్త్రములలో ఒక వస్త్రమును శ్రీమలయప్పస్వామివారికి మరియొక వస్త్రమును శ్రీసేనాధిపతివారికి సమర్పించెదరు. అర్చకులు శ్రీసేనాధిపతివారికి శ్రీపాదవస్త్రముతో పరిపట్టం కట్టి శ్రీ మలయప్పస్వామి వారికి అక్షతారోపణము చేసి సేనాధిపతివారికి శఠారిసాయించి పరిపట్టం విచ్చెదరు. అర్చకులకు శఠారిమర్యాదలు జరుగును. తరువాత ఆస్థానము (కొలువు) అయి హారతి జరుగును. ముల యందుంచబడిన వారి స్వంత మొహరును వారిచేతికి యిచ్చి దేవస్థానంలచ్చన అనుబీగాలగుత్తిని వారి చేతికి తగిలించి చందన తాంబూలాది మర్యాదలు చేసేదరు. తరువాత ఆ లచ్చన అనుబీగాలగుత్తిన శ్రీస్వామివారి పాదారవిందములయందుంచెదరు. చిన్న జియ్యంగారువారికి వారిస్వంత మొహరును వారిచేతికి యిచ్చిపై విధముగా వారికిని మర్యాదలు జరుగును. తరువాత ఏకాంగి వారికి, తరువాత దేవాస్థనం కమిటీవారి తరఫున ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు వారికి యావత్తు మర్యాదలు జరుగును. ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారికి మాత్రము శ్రీవారి పాదములయందుంచబడిన సర్కారు మొహరు ఇవ్వబడును. తరువాత ఆస్థానములో నజరానాకానుకలను ఏకాంగివారు వసూలు పరిచి సర్కారు వారి వశంచేసెదరు. వారు చిట్టాను జమకట్టెదరు. తరువాత ట్రస్టీలు, ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు, పేష్కారు, పారుపత్త్యదారు, మైసూరురాజా, తాళ్ళపాకంవారు, తరిగొండవారు వీరి యొక్క హారతులు చేయబడును. తరువాత జియ్యంగారు వారికి, ట్రస్టీలకు ఎగ్జిక్యూటీవ్ ఆఫీసరువారికి మర్యాదలు జరుగును. పిమ్మట శ్రీ స్వామివారికి నివేదింపబడిన చందన, తాంబూల ప్రసాదములు గోష్ఠి మర్యాద ప్రకారముగాను, ఇష్టవినియోగ ప్రకారముగాను జరుగును. తరువాత యాత్రికులకు ప్రసాద వినియోగము వగైరాలు జరుగును. శ్రీస్వామివారు శ్రీభూదేవులతో, శ్రీ సేనాధిపతివారితోను ఆస్థానము నుండి సన్నిధికి వేంచేయుదురు. ఇదియే ఆనివర ఆస్థానోత్సవము.

సంచలన వార్తాపత్రిక
లీడర్ అనకాపల్లి
విశాఖపట్నం
మంగళవారం 6-3-2018

పీజేఆర్ ట్రస్ట్ ఆర్థిక సాయం

గోపాలపట్నం, న్యూస్‌లీడర్:
పీజేఆర్ ట్రస్ట్ ద్వారా ఛైర్మన్ పెతకంశెట్టి శ్యామ్ సుధాకర్ చెవిటి, మూగ విద్యార్థికి రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ గుంటూరు ఆసుపత్రిలో పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు చొరవతో సీఎం సహాయనిధినుంచి అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో 66వ వార్డు టీడీపీ అధ్యక్షుడు బొడ్డేటి విజయ్‌కుమార్, గవ్వా భాస్కర్, యల్ల రాంబాబు, నాయుడు, సాయి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీచ్ పరిశుభ్రత భేష్




విశాఖపట్నం, న్యూస్‌లీడర్:
స్మార్ట్ సిటీగా అభివృద్ధి చెందుతున్న మహావిశాఖ నగర పాలక సంస్థ పారిశుధ్యం విషయంలో అత్యంత శ్రద్ధ వహిస్తోంది. ముఖ్యంగా బీచ్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. పర్యాటక ప్రదేశం కావడంతో పాటు నిత్యం జనంతో నిండివున్న బీచ్ వద్ద ఎప్పటికప్పుడు శుభ్రత పాటించే విధంగా చర్యలు ముమ్మరం చేసింది. ప్రత్యేకంగా అక్కడ పారిశుధ్య సిబ్బందిని నియమించి "రౌండ్ ద క్లాక్"గా పనిచేసేలా చర్యలు తీసుకుంది. ఈమేరకు బీచ్ పరిసర ప్రాంతాలు స్వచ్ఛతకు మారుపేరుగా మారాయి. బీచ్‌రోడ్డులోని అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద (పామ్‌బీచ్) సీపీఐ పార్టీ ఆదివారం ప్రత్యేకహోదా కోసం పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అక్కడి రహదారులు పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయాయి. వాటర్‌పాకెట్లు, భోజనం ప్లేట్లు ఇతరత్రాలుతో చెత్తచెత్తగా మారడంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది రంగంలోకి దిగి సాయంత్రంకే పూర్తి పరిశుభ్రతగా వుండేలా చర్యలు తీసుకోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బీచ్ పరిసర ప్రాంతాల్లో జీవీఎంసీ చేపడుతున్న చర్యలు అభినందనీయమని, ముస్ముందు ఇదే విధంగా చర్యలు తీసుకోవాలని నగర వాసులు కోరుతున్నారు.



రైలు ప్రయాణికుడిపై విరుచుకుపడ్డ
ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్

బ్యాంకు ఉద్యోగిని తీవ్రంగా కొట్టి గాయపరచిన కానిస్టేబుల్
స్టేషన్‌వద్ద ఆందోళన నిర్వహించిన ప్రజాసంఘాల
కానిస్టేబుల్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్:
ప్రజలు మాన ప్రాణాలు కాపాడవలసిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ బి.చిరంజీవులు అనకాపల్లికి చెందిన ఎం.రవిశంకర్ అనే ప్రయాణికుడిపై ఆతడి ప్రతాపాన్ని చూపించి తలను చితక్కొట్టాడు. వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లికి చెందిన రవిశంకర్ తుని బ్యాంకు ఆఫ్ ఇండియాలో అడ్మిన్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రవిశంకర్ ప్రతీరోజూ అనకాపల్లి నుంచి తునికి రైలులో వెళ్లి విధులు నిర్వహిస్తుంటాడు. యథాప్రకారం సోమవారం ఉదయం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌లో డ్యూటీకి వెళ్లేందుకు రైలు ఎక్కే ప్రయత్నం చేస్తుండగా అదే రైలులో అనకాపల్లి ఆర్‌పీఎఫ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ బి.చిరంజీవులు రైలు దిగుతుండగా చిన్నిపాటి తోపులాటలో బ్యాంకు ఉద్యోగి రవిశంకర్‌పై ఒక రౌడి వలే చేతిలోఉన్న కర్రతో ఇష్టానుసారంగా కొట్టాడు. దీంతో అక్కడ ఉన్న ప్రయాణికులు కానిస్టేబుల్‌ను వారించి పక్కకు నెట్టివేసి రవిశంకర్‌ను రైలు ఎక్కించారు. దీంతో చిరంజీవులు ఆగకుండా తిరిగి మరలా రైలులో కూర్చొనిఉన్న రవిశంకర్‌ను చొక్కా పట్టుకొని బయటకు తీసుకువచ్చి తలపై తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. విషయం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు, వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు రైల్వేస్టేషన్‌కు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. అన్యాయంగా కొట్టి తీవ్రంగా గాయపరచిన ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్ చిరంజీవులను తక్షణమే సస్పెండ్ చేసి తగిన చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ వినకోట రాజాసతీష్, పీఆర్‌టీయూ నాయకులు బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, ప్రైవేటు స్కూల్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేవీ గౌరిపతి, ప్రకాష్, గుండా సాయి, బేరి రాజబాబు, బద్రి డిమాండ్ చేశారు. అలాగే పట్టణానికి చెందిన పెద్ద సంఖ్యలో యువకులు స్టేషన్‌వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం స్టేషన్ సూపరింటెండెంట్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు.



తలపై గాయమైన దృశ్యం



రైల్వేస్టేషన్‌వద్ద ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

సీఎం సహాయనిధి అందజేత



ఎస్‌పిడి, న్యూస్‌లీడర్: స్థానిక జీవీఎంసీ 42 వార్డు ఎస్‌వికె నగరల్లో నివాసం ఉంటున్న సక్క సోమునాయుడు గత కొంత కాలంగా గుండె జబ్బుతో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో రూ. 70 వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధికి పశ్చిమ నియోజకవర్గం శాసన సభ్యుడు పి.గణబాబు నేరుగా అనారోగ్యపాలు అయినా ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపీ అధ్యక్షుడు కామాకుల నాగేశ్వరావు, అంగటి మూర్తి, మహిళలు, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రారంభమైన పైడితల్లమ్మ అమ్మవారి మహోత్సవాలు



గాజువాక : న్యూస్‌లీడర్
నేటి నుండి ఈ నెల 15వ తేదీ వరకూ జరగనున్న జీవియంసి 61వ వార్డు శ్రీరాంనగర్ ఏరియాలో ఉన్న శ్రీరాంనగర్ గ్రామ దేవత శ్రీ పైడితల్లమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రారంభమైయ్యాయి. సుమారు 11 రోజుల పాటు జరిగే అమ్మవారి మహోత్సవాలకు వేలాదిగా భక్తులు తరలి వస్తారని ఆలయ అర్చకులు దార్లపూడి సురేష్, కుమార్ శర్మలు తెలిపారు. అమ్మవారి మహోత్సవాల్లో నిత్యం కుంకుమార్చనలు, కలశపూజలు, గ్రామ దేవత అమ్మవారిని గ్రామాల్లో ఊరేగింపులు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. స్థానిక గ్రామాలనుండే కాకుండా చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన వేలాది భక్తులు పాల్గొంటున్నారని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

గర్భిణీలకు సీమంతాలు

నర్సీపట్నం, న్యూస్‌లీడర్:
నర్సీపట్నం మండలం వేములపూడి గ్రామంలో చంద్రన్న ముందడుగు దళిత తేజం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆరుగురు గర్భిణీలకు సామూహిక సీమంతం చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి సుకల రమణమ్మ మాట్లాడుతూ దళితుల సంక్షేమానికి టీడీపీ పెద్ద పీట వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పార్టీ అధ్యక్షులు శ్రీరంగస్వామి, కోడి జ్యోతి, బోళెం వెంకునాయుడు, పోలుపర్తి వెంకునాయుడు, సీనియర్ నాయకులు పోలుపర్తి తాతీలు, కోడి శ్రీనివాసు, దళిత నాయకులు చెక్క పైడిరాజు, కొత్తపల్లి రమణ, గడమాల సూకారాజు పాల్గొన్నారు.

అగ్నిబాధితులను పూర్తిస్థాయిలో ఆదుకొంటాం

తాహాశీల్దార్ పార్వతీసం


సంఘటనా స్థలంలో పరిశీలిస్తున్న ఎమ్మార్వో పార్వతీసం

గాజువాక : న్యూస్‌లీడర్
పెదగంట్యాడ మండలపరిధి వెంకన్నపాలెం ప్రాంతం ఉప్పర కాలనీలో ఆదివారం జరిగిన భారీ అగ్ని ప్రమాధంలో పెద్ద ఎత్తున పూరిళ్ళు దగ్ధమైన అంశం తెలిసిందే. నేడు పెదగంట్యాడ తాహాశీల్దార్ సంఘటనా స్థలం వద్ద స్థానిక నేతలతోపాటుగా అగ్నిబాధితులతో సమావేశమైయ్యారు. జరిగిన అగ్ని ప్రమాధంలో సుమారు 56 గృహాలు ఉన్నట్లు అంచనాలు వస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, స్థానిక శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు ఆదేశాలతో బాధితుల నివేదికను తయారు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బాధితులకు పునరావసం కల్పించేందుకు దాతలు ముందుకు రావడం శుభపరిణామమని తెలిపారు. బాదితులను సామాజిక భవనంలో ఉంచినట్లు తెలిపారు. దగ్ధమైన గృహాలకు సంభందించి నివేదికను తయారు చేసి ఎవరు సొంత గృహయజమానులు, ఎవరు అద్దె నివాసాల్లో ఉంటున్నారో నివేదిక తయారు చేస్తున్నాట్లు తెలిపారు. స్థానిక నేతల సహకారంతో ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా బాదితుల లిస్ట్ తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నుండి అందవలసిన తక్షణ సహాయాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మాజీ శాసన సభ్యులు చింతలపూడి...

వెంకన్నపాలెం ఉప్పరకాలనీలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదం సంఘటనా స్థలాన్ని గాజువాక మాజీ శాసన సభ్యులు చింతలపూడి వెంకట్రామయ్య పరిశీలించి బాధితులకు ధైర్యం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాదితులకు పక్కా గృహాలు మంజూరు చెయ్యాలని, ఒక్కోక్క కుటుంభానికి నష్టపరిహారంగా 5 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం అందించాలని డిమెండ్ చేసారు. సర్వం కోల్పోయి నిరశ్రాయులైన బాదితులకు అన్ని విధాలా ప్రభుత్వం న్యాయం చెయ్యాలని తెలిపారు. పూర్తి సబ్సిడీతో గృహాలనిర్మాణానికి లోన్లు మంజూరు చెయ్యాలని తెలిపారు.

తెరచాటున అక్రమ నిర్మాణాలు

చోద్యం చూస్తున్న అధికారగణం
కోట్లాది రూపాయల భూమి కబ్జా



గోపాలపట్నం, న్యూస్‌లీడర్:
కోట్లాది రూపాయల ప్రభుత్వ భూమిని దర్జాగా కబ్జా చేస్తున్నా దీనిపై ప్రజా సంఘాలు నిత్యం కలెక్టర్‌కు ఫిర్యాదులు చేస్తున్నా పత్రికల్లో వస్తున్నా మాకేంటి భయం అంటూ ఆక్రమణదారులు బరితెగించారు. దీనికి అధికార ఘణం సపోర్టు చేయడం విశేషం. 66వ వార్డు పద్మనాభ నగర్ 76/బి సర్వే నెంబర్‌లో ప్రధాన రహదారి పక్కన ప్రభుత్వ భూమికి ఎన్టీఆర్ గృహం పేరిట లేని ఇళ్లకు స్కీమ్ తెచ్చేసుకున్నారు. దాంతో స్థానికులు జిల్ల కలెక్టర్‌కు ఫిర్యాదు మేర హౌసింగ్ స్కీమ్‌ను నిలుపుదల చేశారు. అయినా పాత ప్రోసిడింగ్ పత్రాన్ని అడ్డం పెట్టుకొని తెరచాటున అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ తతంగం అంతా రెవెన్యూ, జీవీఎంసీ అధికారులకు తెలిసే చేస్తుండటం చూస్తే ఈ అక్రమదారునికి ఎంత పలుకుబడి ఉందో తెలుస్తుంది. పేదవాడు అదే సర్వేనెంబర్‌లో చిన్న పాక వేసుకొంటే ఆఘమేఘాలమీద వాలిపోయి యంత్రాలతో కూల్చేసే రెవెన్యూ విఆర్వో దొర ఈ భవనంపై ఎందుకో చర్యలు చేపట్టకపోవడంపై పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. హుధూద్‌లో ఇల్లు పోయి ప్రభుత్వం నగదు అందజేసినా ఆ పేదవారు ఇళ్ళు కొంటే పడగొట్టే రెవెన్యూశాఖ ఈ భవనంపై ఉదాసీనత ప్రవర్తించడం సందేహించక తప్పదు. ఈ భవన నిర్మాణంలో లక్షలాది రూపాయలు చేతులు మారినట్లుగా ఇక్కడ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. 2014 నుంచి ఈ స్థలంపై స్థానికులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వ భూమిని కాపాడలేని అధికారులుగా రెవెన్యూ శాఖ ఎప్పటికి గుర్తుండిపోతుంది. టౌన్‌ప్లానింగ్ అధికారులు ఆపినా, హౌసింగ్ స్కీమ్ అధికారులు ఆపినా మమ్మల్ని ఎవరూ ఏమీ చేయలేదు. అంటూ దర్జాగా కోట్లాది రూపాయల భూమికి ఎసరు పెట్టిన అక్రమ నిర్మాణదారున్ని ఏమి చేయలేరా అంటూ ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డుల ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను సైతం కాలదన్ని తెరచాటున అక్రమ నిర్మాణాలు కొనసాగించేస్తున్న వీరిని అడ్డుకునేదెవరు...!

ప్రజల గోడు పట్టని గవర్నర్, సీఎం



విశాఖపట్నం, న్యూస్‌లీడర్:
గడచిన మూడు నెలలుగా, రాష్ట్రంలోని ప్రజలు ఆర్థిక అవసరాల తీరక అల్లాడుతుంటే, రాష్ట్రంలో తొంభైశాతం ఏటీఎంలు మూతపడి, బ్యాంకులకు వెళ్లినా డిపాజిట్ దారులకు బ్యాంకులు డబ్బులు ఇవ్వని స్థితి ఉంటే రాష్ట్ర గవర్నర్ నరసింహాన్ గానీ, సీఎం గాని స్పందించక పోవడం విచిత్రమనిపిస్తోందని లోక్‌సత్తాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని జిల్లా అధికారులను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భీశెట్టి మాట్లాడుతూ బ్యాంకింగ్ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం లేని స్థితికి పాలకులు దిగజార్చారన్నారు. ప్రజల అవసరాలు తీర్చడంలో సీఎం, గవర్నర్ విఫలమయ్యారని ఆరోపించారు. ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా చూడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ముఖ్యమంత్రి చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మొల్లేటి చిన్నారావు, శిమ్మా శ్రీను, వెంకటరమణ, జామి ఎర్నిబాబు, ఆదీశ్వరరావు, ఎస్ అమృత, ఎస్ ప్రియాంక, భారతి, ఎస్ రేణుక, పి సంగీత, జి ప్రాణ ప్రసన్న, కె శాంతి, పి దివ్య, కె సలోమి తదితరులు పాల్గొన్నారు.

పార్కులు, కళావేదికలు ఏర్పాటు చేయాలి

ఎలమంచిలి, న్యూస్‌లీడర్:
ఎలమంచిలి మున్సిపాలిటీలో పట్టణంతో పాటు పల్లెల్లో కూడా ప్రజల వినోదం కోసం పార్కులు నిర్మాణం చేపడతామని గత మూడు సంవత్సరాల నుంచి మాటలు తప్ప పనులు ప్రారంభం కాలేదని ప్రజలు విసుగు చెందుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం ఎలమంచిలి పట్టణంలో కొమ్మయ్యగుండం చెరువు చుట్టూ పార్కుతో పాటు ప్రజలు మార్నింగ్ వాక్ చేయడానికి అనుకూలంగా వాకింగ్ ట్రాక్ కూడా నిర్మిస్తామని రెండు సంవత్సరాల క్రితం రూ.11లక్షలు నిధులతో నిర్మాణం చేయడానికి కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. తరువాత కాలంలో ఆ నిధులు చాలవు భారీ బడ్జెట్‌తో నిర్మాణం చేస్తామన్నారు. ఇప్పుడు ఆ ఊసేలేదు. ఇక స్టేషన్ రోడ్డు ఎప్పటి నుంచో డబల్ రోడ్డు వేసినా అభివృద్ధి లేదని రోడ్డు మధ్యలో గార్డెన్ ఏర్పాటు చేసి ఆహ్లాదకరంగా ఉండేందుకు రోడ్డు మధ్యతో పిట్రామెన్స్ లైట్లు వేయడానికి రూ.20 లక్షలు ఖర్చుతో పనులు చేబట్టారు. రోడ్డు మధ్యలో ట్రెంచ్ నిర్మించి గార్డెన్ కోసం కాగితం పూల మొక్కలు పెంచారు తప్ప ఆహ్లాదకరమైన గార్డెన్‌లేదు. ఆ లైట్ల సంగతి పాలకులు, అధికారులు మార్చిపోయారు.
మున్సిపాలిటీ వినోదానికి అవసరమైన ప్రదేశాలు లేకపోయినా ఇంటి పన్ను వసూళ్లలో ఆ పన్ను కూడా కలిపి వసూలు చేస్తారు కాని ఎలమంచిలి మున్సి పాలిటీ ఏర్పడి సుమారు ఎనిమిది సంవత్సరాలు గడి చినా ప్రజలు వినోదాలకు అవసరమైన పార్కులు, స్టేడియంలు, కళావేదికలు నిర్మాణంలో వెనుకబడి ఉందనే చెప్పాలి. దీనిపై దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

సెజ్‌లో ఏషియన్ పెయింట్స్ రంగుల పరిశ్రమ



అచ్యుతాపురం, న్యూస్‌లీడర్:
మండల కేంద్రంలో పూడి వద్ద సెజ్ పరిశ్రమల్లో ఆసియాలోనే అతిపెద్ద మూడవ కంపెనీగా ఏషియన్ పెయింట్ రంగులు పరిశ్రమ సరి వేగంగా పనులు జరుగుతున్నాయి. ఈ రంగులు పరిశ్రమ పూర్తయితే నిర్వాసిత ఉపాధితో పాటు నిరుద్యోగ యువతకు వేలమీద ఉద్యోగాలు అవకాశాలు కలుగుతాయి. ఇప్పటికే భూములు కోల్పోయిన నిర్వాసితులు ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే ఏషియన్ పెయింట్ రంగులు పరిశ్రమ దాదాపుగా 50 శాతం పూర్తయింది.

కరాటే క్రీడకు ప్రపంచ స్థాయి గుర్తింపు

రాష్ట్ర ప్రెసిడెంట్ డాక్టర్ కరణంరెడ్డి నర్సింగరావు


ధృవత్రాలతో కరాటే క్రీడాకారులు

గాజువాక : న్యూస్‌లీడర్
ప్రపంచంలో కారాటే క్రీడ ఉన్నత స్థానంలో విలువలను పెంచిన క్రీడగా ప్రసిద్ధి చెందిందని రాష్ట్ర కరాటే రియో స్కూల్ ప్రెసిడెంట్ డా॥ కరణంరెడ్డి నర్సింగరావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జరిగిన కరాటే బెల్ట్ గ్రేడింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు కరాటే క్రీడలపై మక్కువ చూసిస్తున్నారని తెలిపారు. కారటే క్రీడ ద్వారా బాలికలకు వారి రక్షణ కవచంగా ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 70మంది కరాటే క్రీడాకారులు మంచి నైపున్యాన్ని పెంచుకోవాలని సూచించారు. అనంతరం కరాటే క్రీడాకారులకు బెల్టులు అందించారు. ఈ కార్య క్రమంలో సెక్రటరీ ఆనందబాలు, పి సురేష్‌కుమార్, లాజర్, సంపత్, పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అందరూ భాగస్వాములు కావాలి

టీడీపీ కార్యదర్శి వెంకు మహంతి చంద్రశేఖర్



ఎస్‌పిడి, న్యూస్‌లీడర్:
స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరానికి 2018 ప్రథమ స్థానం రావాలని నగర టీడీపీ కార్యదర్శి వెంకుమహంతి చంద్రశేఖర్ అన్నారు. ఈ మేరకు స్థానిక జీవీఎంసీ 42 వార్డు కరాస ప్రాంతంలో జీవీఎంసీ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటింగ్ కార్యక్రంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖ నగరానికి ప్రథమ స్థానం రావడానికి ఇంకా 1400 వందల మార్కులు అవసరమన్నారు. మరో అడుగు ముందుకు వేస్తే అది సాధ్యమన్నారు. అది ప్రజల సహకారం ఎంతో అవసరమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఏ ప్రాంతంలో నివాసం ఉంటున్న కూడా విశాఖపట్నం పిన్ కోడ్ 530001 అని చెప్పాలన్నారు. ఈ నెల 10 తేదీలోగా తమ అభిప్రాయాలు తెలియ చేయగలరన్నారు. తదనంతరం ఓటింగ్‌ను వినియోగించుకొని స్థానికులకు స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అవగాహనా కల్పించారు. ఈ కార్యక్రంలో సిబ్బంది రమేష్, వి.శ్రీనివాస్, శర్మ, ప్రసాద్, స్థానికులు మహిళలు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన


చికిత్సలు చేస్తున్న డాక్టర్ విష్ణుమూర్తి

అనకాపల్లి, న్యూస్‌లీడర్:
పట్టణంలోని గవరపాలెం చినరామస్వామి కోవెల వద్ద పోతురాజు సిండికేట్‌వారి ఆధ్వర్యంలో చినరామ యంగ్ టైగర్ గోవింద యూత్ వారి ప్రోత్సాహంతో శ్రీనూకాంబిక అమ్మవారి అర్ధమండలి దీక్ష మహోత్సవం సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి శ్రీవివేకానంద ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.విష్ణుమూర్తి, డాక్టర్ కేవీ సత్యవతి పాల్గొని రోగులకు ఉచిత వైద్యసేవలు, మందులు అందించారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, కాండ్రేగుల నాయుడు, సూరిశెట్టి రాముడు, పీలా పూర్ణ, పీలా ఉమామహేష్, చినరామ గోవిందయూత్, యంగ్ టైగర్ యూత్ పాల్గొన్నారు.

హోదాపోరు ఆగదు: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఐ నేత రామకృష్ణ

గాజువాక : న్యూస్‌లీడర్
రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హెూదా వచ్చేవరకూ రాష్ట్రంలో కేంద్రంపై పోరు ఆగదని రాష్ట్ర సిపిఐ కార్యదర్శి రామకృష్ణ హెచ్చరించారు. కార్యక్రమంలో భాగంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎజె స్టీలిన్ ఇంటి వద్ద ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతీరుపై విరుచుకు పడ్డారు. విభజన చట్టంలో ఉన్న హామీలు అమలు చేయమని అడుగుతుంటే బిజెపి నాయకులు కాకిలెక్కలు చూపిస్తున్నారని దుయ్యబట్టారు. దేశంలో ఉన్న అన్ని రాష్ట్రాలకు మాదిరిగానే ఆంధ్రప్రదేశ్‌కు నిదులు కేంద్ర ఇవ్వాలని వాటిపై ప్రజలు అడగటం లేదని విభజన చట్టంలో పెట్టిన హామీలు రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విశాఖకు రైల్వేజోన్, రాష్ట్రానికి లోటు బడ్జెట్ తీర్చడం వంటి వాటిని అమలు చెయ్యాలని తామంతా అడుగుతుంటే కాకిలెక్కలు చూపిస్తూ తప్పిచుకు తిరిగేందుకు బిజెపి నాయకులు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. చంద్రబాబు బిజెపి మత్తులో నుండి భయటకు రావాలని అఖిలపక్షాన్ని కేంద్రానికి తీసుకువెళ్ళే భాద్యతలు ఆయనే తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రజలు ఓపికతో చూస్తున్నారని వారు రొడ్లపైకి వస్తే రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తట్టుకునే పరిస్థితి ఉండదని సూచించారు. పవన్‌కళ్యాన్ నిర్వహించిన భాద్యత మంచి ఫలితాను ఇస్తుందని తెలిపారు.

మింది కళ్యాణమండపాన్ని గ్రామస్థులకు అప్పగించాలి

అఖిలపక్షం నేతల డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న అఖిలపక్షం నేతలు

గాజువాక : న్యూస్‌లీడర్
ప్రజా ప్రయోజనాల నిమిత్తం నిర్మించిన మింది శ్రీ గుడివాడఅప్పన్న ట్రస్టు ద్వారా నిర్వహించవబడుతున్న కళ్యాణమండపాన్ని గ్రామ ప్రజలకు స్వాదీనం చెయ్యాలని మింది, చుట్టుప్రక్కల గ్రామస్థుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అఖిలపక్షం నేతలు డిమెండ్ చేసారు. మందిలో గల శివారు కాలనీలు చక్కవానిపాలెం, రాజీవ్‌నగర్,గిరి ప్రసాద్‌నగర్, కాళీకానగర్ కాలనీలకు చెందిన వందలాదిమంది ప్రజలు మింది గ్రామంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నేతలు గుడివాడ అమ్మన్న, ఈటి శ్రీను తదితరులు మాట్లాడుతూ గ్రామప్రజల సహకారంతో నిర్మించిన కళ్యాణమండపాన్ని సొంత జాగీరుగా ట్రస్టు పేరుతో వాడుకొంటున్నారని దుయ్యబట్టారు. సుమారు 24 ఏళ్ళుగా కళ్యాణమండపానికి వస్తున్న ఆదాయ వివరాలు ప్రజలకు చెప్పకుండా దోచుకొంటున్నారని దుయ్య బట్టారు. ప్రజలకు చెందాల్సిన సొమ్ములు ఏళ్లతరబడి దోచుకొంటున్న నిర్వాహకులు ప్రజలను ప్రక్కదారి పట్టించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కళ్యాణమండపం ద్వారా వస్తున్న ఆదాయాన్ని మింది, చుట్టుప్రక్కల గ్రామ ప్రజల సేవా కార్యక్రమాలకు వాదాలనే నిభందన ఉన్నప్పటికీ వాటిని అమలు చేయకుండా వచ్చిన కాడికి వచ్చినట్లు దోచుకోవడమే పనిగా పెట్టుకోన్నారని తెలిపారు. ప్రముఖుల వద్ద నుండి ట్రస్టు పేరుతో చేసిన డొనేషన్లు ఏమైనట్లు అని ప్రశ్నించారు. ఈ 24 ఏళ్ళలో కళ్యాణమండపానికి కోట్ల రూపాయల్లో ఆదాయాలు వచ్చిపడ్డాయని సూచించారు. తక్షణమే కళ్యాణమండపాన్ని గ్రామ కమిటీలకు స్వాదీనం చెయ్యాలని డిమెండ్ చేస్తూ లేని పక్షంలో వారి ఇళ్ళ ముందు ధర్నాలు, కళ్యాణమండపం వద్ద నిరస నలు తెలియజేయనున్నట్లు వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్షం నేతలు ఎల్ రాజారావు, గుడివాడ గురునాథ్, జీలకర్ర ఈశ్వరరావు, రవికాంత్, బాబూరావు, గ్రామ మహిళలు, యువకులు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లో తాగుబోతు హల్‌చల్

ఎస్‌పిడి, న్యూస్‌లీడర్: కంచరపాలెం పోలీస్ స్టేషన్లో తాగుబోతు హల్చల్ చేసి పోలీసులకు కళ్లుగప్పి పరారయ్యాడు. స్థానిక పోలిసుల సమాచారం ప్రకారం జీవరత్నం మల్కాపురం నివాసి అయిన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మద్యం దుకాణం దగ్గర మద్యం సేవించి హల్చల్ చేసాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు కంచరపాలెం పోలీసులు జీవరత్నంను అదుపులోకి తీసుకుని స్టేషనుకు తరలించారు. అయితే సీఐ చంద్రశేఖర్ కౌన్సిలింగ్ నిమిత్తం ఆయనను స్టేషన్లో కూర్చుండబెట్టారు. అయితే ఆయన పోలీసులు కల్లుగప్పి ఆయన పరారయ్యాడు. ఎట్టకేలకు పోలీసులు అతన్ని పట్టుకుని స్టేషనుకు తరలించారు.

దళితులకు గౌరవం లేదు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: టీడీపీలో దళితులకు గౌరవం లేదని ఎమ్మెల్యే రావేల కిషోర్‌బాబు ఇప్పటికైనా తెలుసుకున్నందుకు సంతోషకరమైన విషయమని వైఎస్సార్ సీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మామిడి నూకరాజు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘ సభ్యులు పాలెక నిరీక్షణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ నాయకులు దళితులపై చూపిస్తున్న కపట ప్రేమను తెలుసుకొని దళితులందరూ ఆ పార్టీని విడిచి బయటకు రావాలని వారు కోరారు.

మాతృభాషపై మమకారం పెరగాలి

విజయనగరం, న్యూస్‌లీడర్ : ప్రతీ ఒక్కరిలోనూ మాతృభాషపై మమకారం పెరగాలని రాజ్యసభ మాజీ సభ్యులు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలిపారు. విజయనగరంలోని రుద్రభట్ల వారి వీధిలోని తాతా సుబ్బరాయశాస్త్రి ఇంటిని రామకృష్ణ మఠానికి అంకితం చేసే కార్యక్రమం భారతీ తీర్థ త్యాగరాజ సంగీత నృత్య కళానికేతన్ నిర్వహణలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ ఎంతో గొప్ప వారసత్వం, సంస్కృతి కలిగిన ఈ దేశంలో తెలుగు వారిగా పుట్టడం పూర్వజన్మ సుకృతమన్నారు. తెలుగు భాషను, పురాణాలను కాపాడుకోకపోతే మన బతుకులు వృద్ధాశ్రమాలుగా మారుతాయని తెలిపారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వి.జ్యోతిర్మయి



పిల్లలతో కేక్ కట్ చేయిస్తున్న జిల్లా జడ్జి జ్యోతిర్మయి

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ సూర్యాబాగ్ దరి పోలీస్ బ్యారెక్స్ క్వార్టర్స్‌లో గల పాపాహోం ప్రాంగణంలో పాపాహోం 18వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించినాము. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.వి.జ్యోతిర్మయి హాజరై జ్యోతిని వెలిగించి పాపాహోం 18వ వార్షికోత్సవాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె పాపాహోం బాలలను బాలికలను ఉద్దేశించి ప్రసంగిస్తూ విద్యార్థి దశ ఎంతో విలువైందని కావున విద్యార్థి దశలో ఉన్న మీరు బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. పాపాహోం విద్యార్థుల కోసం కమిటీ సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన పాపాహోం వైస్ చైర్మన్, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శాంతిభద్రతలు కె.ఫక్కీరప్ప మాట్లాడుతూ పాపాహోం బాలలు, బాలికలు క్రమశిక్షణతో మెలగాలన్నారు. చక్కగా చదువుకొని మంచి పేరు ప్రఖ్యాతులను సంపాదించుకోవాలని విద్యార్థులకు హితవు పలికారు. ప్రత్యేక ఆహ్వానితులుగా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (క్రైమ్స్), డా॥ షేముసి బాజాపాయ్, గౌరవ అతిథులుగా సిఎంఆర్ షాపింగ్ మాల్ అధినేత మావూరి వెంకటరమణ, డా॥ అస్లామ్ అరీఫ్, సంస్థ అధ్యక్షులు పి.సత్యనారాయణ, సంస్థ కార్యదర్శి పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు. పాపాహోం 18వ వార్షికోత్సవం సందర్భంగా పాపాహోం బాలలు, బాలికలు ప్రదర్శించిన వివిధ సాంస్కృతికాంశాలు అందరినీ అలరించాయి. అతిథుల హర్షధ్వానాలతో ప్రాంగణం మారుమోగింది. ఈ కార్యక్రమంలో పాపాహోం కోశాధికారి వి.వెంకటరత్నం, పాపాహోం కార్యవర్గ సభ్యులు డి.సూర్యప్రకాశరావు, ఆర్.సి.జైన్, రాజ్యలక్ష్మి, పి.కె.లింగేశ్వరరావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.వి.రాజశేఖర్ పాపాహోం సభ్యులు, సిబ్బంది తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి



హాస్యవల్లరిలో పాల్గొన్న కళాకారులు

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: ఫ్రెండ్స్ కామెడి క్లబ్ , విశాఖపట్నం వారు ప్రతి నెల మొదటి ఆదివారం అందించే హాస్య కార్యక్రమంలో భాగంగా స్థానిక పౌరగ్రంథాలయము నందు " వినోదాల విందు కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వాఖ్యాతగా డి.వి.త్రినాద్ వ్యవహరించినారు ఈ కార్యక్రమములో మెదడు మార్పబడును, అదర్శ స్నేహితుడు, ప్రపంచవింత సభాయన మహా.ఓరి డాక్టర్, సినిమాస్టోరీ , లేదిపో దాంరా, మొదలగు స్కిట్స్ ప్రదర్శించారు. ఇందులో హాస్యనటులు ఎమ్.వి.సుబ్రహ్మణ్యం, పి.వి. త్రినాద్, కోరు కొండరంగారావు, లీలా కుమారి, పి.కె.దుర్గాప్రసాద్, యిమ్మం ది ఈశ్వర రావు కోరుకొండ శివప్రసాద్, రావి గోపికృష్ణ , రామానుజం, సూర్యారావు నాయుడు, సందీప్ ,పోర్ట్ శేషగిరి రావు, రమ పాల్గొని కామెడీ స్కిట్స్ ప్రదర్శించారు. ప్రముఖ గాయకులు మహేష్ గారు చక్కని మెలోడి పాటలు పాడి ప్రేక్షకుల మనసులు రంజింప జేసారు. స్టార్ మేకర్ సత్యానంద్ గారు, మ్. తిలక్ పట్నాయక్, నందూ రామకృష్ణ హాజరయినారు.

ముగిసిన మేధో సాంకేతిక ఉత్సవం


డ్యాన్స్‌లు చేస్తున్న విద్యార్థులు

విజయనగరం, న్యూస్‌లీడర్ రఘు విద్యా సంస్థల నిర్వహణలో రెండు రోజుల మేధో, సాంకేతిక, సాంస్కృతిక ఉత్సవం చక్రవ్యూహ్ 2018ను ఘనంగా ముగిసింది. రెండు రోజుల చక్రవ్యూహ్ ఆద్యంతం యువత ప్రతిభకు అద్దంపట్టింది. సాంకేతిక, సాంస్కృతిక, మేధో వారసత్వ వారసులము మేమంటూ యువత నిర్వహించిన కార్యక్రమాలు దేనికదే ధీటుగా నిలచాయి. రెండో రోజు కార్యక్రమాలను రఘు విద్యా సంస్థల చైర్మన్ కలిదిం డి రఘు ప్రారంభించారు. పోటీలో పాల్గొనే ప్రతీ విద్యార్థి విజేతేనన్నారు. సానుకూల దృక్పథం, సాధిం చాలనే తపనతో సాగాలని సూచించారు. సాంకేతిక సదస్సులు, విద్యార్థుల మేధస్సును పదునుపెట్టే సాంకేతిక పోటీలు నిర్వహించారు. తమ స్వీయ ఆలోచనలను ప్రస్ఫుటం చేస్తూ సమాజ సమస్యలకు పరిష్కారం చూపే దిశగా యువత తయారు చేసిన నమూనాలు ఆలోచింపచేసాయి. దివ్యాంగులకు ఉపయుక్తమైన సెల్‌ఫోన్, సౌరశక్తిని ఒడిసిపట్టే చెట్టు వంటి పలు ఆలోచనలు యువత ప్రతిభకు నిదర్శనంగా నిలుస్తూ భవిష్యత్ ఆవిష్కర్తలుగా నిలుస్తారనే భరోసాను అందించాయి. రెండు రోజుల సాంస్కృతిక, మేధో, సాంకేతిక సమ్మేళనం చక్రవ్యూహ్ ఎంతో ఉత్సాహంగా ముగిసింది. విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, బహుమతులను ప్రధానం చేశారు. కార్యక్రమం ఆద్యంతం యువత ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు.

సాధనతోనే విజయాలు వరిస్తాయి

రిటైర్డ్ పిడి ఇందిరా ప్రసాద్


విజేతలతో ఇందిరా ప్రసాద్

శ్రీకాకుళం, న్యూస్‌లీడర్ : నిరంతర సాధనతోనే విజయాలు వరిస్తాయని, మంచి ఆరోగ్యంతోనే మంచి క్రీడాకారులు తయారుకాగలరని, ఆరోగ్యమే నిజమైన సంపదని, శ్రీకాకుళం లోక్ అదాలత్ న్యాయవాది, రిటైర్డ్ పిడి జి.ఇందిరాప్రసాద్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని గొంటివీధి జంక్షన్‌లో గల స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో జరిగిన జిల్లా స్థాయి ఓపెన్ చదరంగం పోటీలు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షల కాలంలో విద్యార్థులు మానసిక ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యోగా తో ఆత్మస్థైర్యం కలుగుతుందని తెలిపారు. చదరంగం క్రీడ మేధావుల క్రీడ అని అలాంటి క్రీడలో జిల్లా చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని చెస్ క్రీడను నేర్చుకోవడం, పోటీలలో రాణిస్తుండటం గొప్ప విషయమని అన్నారు.అనంతరం ఆయన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో చెస్ కోచ్ భేరి చిన్నారావు, పలువురు తల్లితండ్రులు, చెస్ క్రీడాకారులు పాల్గొన్నారు.

స్త్రీని అంగడి వస్తువులా చూస్తున్నారు


ర్యాలీ చేస్తున్న మహిళలు

గాజువాక, న్యూస్‌లీడర్ : మహిళల హక్కులు, సాదికారికత పాలకుల బాసలకే పరిమితమవుతుందని, ఎనిమిదేళ్ల పసికూన నుంచి 80ఏళ్ల ముదుసలిపైనా లైంగిక దాడులు పెరుగుతున్నాయని ఏపీ మహిళా సమాఖ్య విశాఖ నగర గౌరవ అధ్యక్షు రాలు బూసి పరమేశ్వరి అన్నారు. 108వ అంతర్జాతీయ మహిళా దినోత్సవాల ను పురస్కరించుకుని స్టీల్ ప్లాంటు ప్రగ తి మైదానంలో ఎన్ఎఫ్ఐడబ్ల్యూ పతా కాన్ని ఆవిష్కరించారు.ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదునిక సమాజంలో స్త్రీని అంగడి వస్తువుగా చూస్తుందన్నారు. ప్రపంచలో వినోదా నికి ప్రథమ పెట్టుబడి స్త్రీని అశ్లీలంగా చూడడం అత్యంత దుర్మార్గం అని ఆమె ఆవేదన వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో బి.సాంబారి, లక్ష్మి, దులారి, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజం నిర్మిద్దాం

వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం చంద్రబాబునాయుడు


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు

విజయనగరం, న్యూస్‌లీడర్: పేదల ఆరోగ్యం కాపాడే లక్ష్యంగా అన్ని శాఖల సమన్వయంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో హెల్త్ బులిటెన్, చిన్నారుల ఆరోగ్యం కోసం పలకరింపు కార్యక్రమాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ, పేదరిక నిర్మూలన శాఖల సహకారంతో ఐదు సంవత్సరాలలోపు చిన్నారుల ఆరోగ్యం కోసం పలకరింపు అనే కార్యక్రమాన్ని రాష్ట్రంలో వినూత్నంగా అమలు చేస్తున్నామని చెప్పారు. ప్రతి చిన్నారికి ఆయా వయస్సులో అందవలసిన వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందించడమే పలకరింపు కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పోషకాహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి తగిన జాగ్రత్తలు, సలహాలు అందించాలన్నారు. గ్రామ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో వ్యాధులను గుర్తించ టానికి హెల్త్ బులిటెన్ కార్యక్రమాన్ని అనులు చేస్తున్నామన్నారు. ఆశాలు, అంగన్ వాడీలను బృందాలుగా నియమించి ప్రతిరోజు గ్రామంలోని 15 గృహాలను సందర్శించి ఆరోగ్య సమస్యలను తెలుసుకొని నివేదించడం జరుగుతుందన్నారు. ముందుగా హెల్త్ బులిటెన్, సలకరింపు గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ పూనం మాలకొండయ్య, జిల్లా కలక్టరు వివేక్ యాదవ్, సంయుక్త కలక్టరు-2 కె. నాగేశ్వరరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. వి. వెంకటరావు, డిసిహెచ్ఎస్ డా. ఉషశ్రీ, ఐసిడియస్ సిడి ఎ.యి. రాబర్ట్స్, డిఐఓ డా. కె. కిషోర్, జిల్లా పరిషత్ సిఇఓ టి. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజధానిలో బాలికలకు భద్రత కరువా?

విశాఖపట్నం, న్యూస్‌లీడర్: దేశ రాజధాని ఢిల్లీలో బాలికలకు భద్రత కరువైనట్లేనని ఆంధ్రప్రదేశ్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం, ఫోరం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బి. శకుంతలలు అన్నారు. ఓ సమావేశంలో వారు మాట్లాడుతూ ఓ వైపు మొత్తం ప్రపంచ వ్యాప్తంగ అంతర్జాతీయ లైంగిక దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేదినం జరుపుకొంటుండగా యావత్ భారత్‌దేశం ఉలిక్కిపడేలా దేశరాజధానిలో ముగ్గురు బాలికలను అపహరించడమే కాకుండా వారిని లక్షలాది రూపాయలకు అమ్మివేస్తూ ఢిల్లీ పోలీసులకు పట్టు బడ్డ అక్రమ తరలింపు ముఠాను కఠినంగా శిక్షించడమే కాకుండా అవసరమైతే ఢిల్లీ పాలిత, కేంద్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా దేశ బహిష్కరణ చేయాలని, బాలికల సంరక్షణకు మరింత కట్టుదిట్టమైన చట్టాలు తీసుకురావాలని వారు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.

పోలీసుల అదుపులో పరారైన ఖైదీ

చీపురుపల్లి, న్యూస్‌లీడర్ : గతనెల 27న స్థానిక సబ్‌జైలు నుండి పరారైన రిమాండ్ ఖైదీ గొల్లుపల్లి గోవింద్ ఈనెల 2న కృష్ణా జిల్లా పామర్రు వద్ద పట్టుబడ్డాడు. గొల్లుపల్లి గోవింద్ చీపురుపల్లి సబ్ జైలు నుండి పరారైన సంగతి తెలిసిందే. అయితే చాకచక్యంగా సబ్ జైలు నుండి తప్పించు కున్న గోవి ంద్ పట్టుబడడం కూడా అంతే వేగంగా జరిగింది. స్థానిక ఎస్ ఐ టి.కాంతికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జైలు నుండి పరారైన గోవింద్ తన కుటుంబ సభ్యులతో కలిసి కృష్ణా జిల్లా పామర్రు గ్రామంలో ఉన్న దుగ్గ మిల్లు వద్ద పట్టుబడ్డాడని ఎస్ఐ తెలిపారు. చీపురుపల్లి పోలీసులు కుమారస్వామి, బసవకుమార్‌లతో పాటు పామర్రు పోలీసులు కూడా చాకచక్యంగా గోవింద్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అయితే గతంలో పామర్రులో ఉన్న మిల్లులో గోవింద్ సభ్యులు పని చేసేవారని వాటి ఆధారంగా పట్టుకున్నామని తెలిపారు. పట్టుకున్న గోవింద్‌ని స్థానిక మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం హాజరు పరచగా స్థానికి సివిల్ జడ్జి గోవింద్‌కు 14 రోజుల పాటు రిమాండ్ చెప్పినట్లు ఎస్ఐ కాంతికుమార్ తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

మెంటాడ, న్యూస్‌లీడర్ : మండలంలోని అమరాయవలసకు చెందిన పొట్నా రాజేశ్వరి(30) నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ విశాఖ ప్రైవేటు ఆసుపత్రిలో మృతిచెందింది. మహిళ మృతి వివాదాస్పదమైంది. రక్తహీనత కారణంగా రాజేశ్వరి మృతిచెందిందని అందుకు వైద్య సిబ్బంది కారణమని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. రాజేశ్వరి నిద్రమాత్రలు, లేదా పురుగుల మందు సేవించడంతోనే మృతిచెందిందని చల్లపేట పిహెచ్‌సి వైద్యులు నషీరుద్దీన్ అన్నారు. రాజేశ్వరి మరణం అత్తవారు, కన్నవారి కుటుంబాల నడుమ చిచ్చురేగినట్లు తెలిసింది. గ్రామ పెద్దలు రాజీ యత్నం కోసం పంచాయితీ నెరపుతున్నారని బోగట్టా. అమరాయవలస గ్రామానికి చెందిన పొట్నా వీర్రాజుతో తెర్లాం గ్రామానికి చెందిన రాజేశ్వరితో 2014లో వివాహమైంది. వీరికి లలిత(2), హారిక(1) కుమార్తెలున్నారు. కొన్నాళ్ళు వారిద్దరి జీవనం అన్యోన్యంగా సాగింది. కొద్దినెలలుగా రాజేశ్వరి అత్తతో పొరపొచ్చాలు వచ్చాయి. రాజేశ్వరి, ఆమెఅత్త మధ్య గొడవ జరగడంతో నిద్రమాత్రలు, పురుగుల మందు సేవించిందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే గజపతినగరం ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు సూచించడంతో విశాఖ కేర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం రాజేశ్వరి మృతిచెందింది. రక్తహీనత, షుగర్ లెవెల్స్ అదుపుతప్పడంతోనే తన భార్య మృతిచెందిందని భర్త వీర్రాజు తెలిపారు. చల్లపేట పిహెచ్‌సి వైద్యులు నషీరుద్దీన్‌ను వివరణ కోరగా రాజేశ్వరి రక్తహీనత కారణంగా చనిపోలేదన్నారు.

న్యాయం చేసే వరకు పోరాటం

పార్వతీపురం, న్యూస్‌లీడర్ : ఉత్తరాంధ్ర అభివృద్ధికి రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను అన్నింటినీ నెరవేర్చేంతవరకు పోరాటం చేయడం అనివార్యమవుతుందని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనరు అజశర్మ అన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో ఇచ్ఛాపురం నుంచి పాయకరావుపేట వరకు నిర్వహిస్తున్న జీపుజాతా పార్వతీపురం చేరుకుంది. ఈసందర్భంగా ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో అజశర్మ, కె.విజయగౌరి, రాము తదితరులు మాట్లాడారు. విద్యల నగరంగా చెప్పుకొనే విజయనగరం జిల్లాలో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుచేస్తామని విభజన చట్టంలో ప్రకటించారని, దీనికి నిధులు విడుదల చేయడం చూస్తే.. హామీపై ఎంత చిత్తశుద్ధి ఉన్నది ప్రస్ఫుటం అవుతుందన్నారు. ఉత్తరాంధ్రలో నదులు నిత్యం పరవళ్లు తొక్కుతాయని, ఆనీటిని సాగునీరుగా మలిచే ఆలోచన ప్రభుత్వానికి లేదన్నారు.


వైసీపీ తలపెట్టిన మహా ధర్నాకు విశాఖ ఉత్తర నియోజకవర్గానికి సంబంధించిన వార్డు అధ్యక్షులు ఎస్ హేమంత్, ఎస్ గోవింద్, ఎం సూర్య రావు, కేవీ బాబా, కట్టమూరి సతీష్, బి ఎర్రినాయుడు, చల్లా ఈశ్వరరావు, అళ్ల శివగణేష్ తదితరులు సోమవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు.
-న్యూస్‌లీడర్, విశాఖపట్నం

రాష్ట్రస్థాయి యూత్ బాక్సింగ్ విజేత విశాఖ


విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న దృశ్యం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ జిల్లా బాక్సింగ్ సంఘం నిర్వహించిన రెండవ రాష్ట్ర యూత్ పురుషుల ,మహిళల బాక్సింగ్ పోటీల్లో విశాఖ జట్టు ఓవరాల్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ద్వితీయ స్థానంలో శ్రీకాకుళం జట్టు నిలిచింది. రైల్వే బాక్సింగ్ హాల్లో ముగింపుకార్యక్రమానికి ఏపీ బాక్సింగ్ సంఘం అధ్యక్షుడు ఏసీపీ ఐ.చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి జీవీ. రవిరాజు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ.వెంకటేశ్వరరావు, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి బి.అప్పన్నరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో బాక్సింగ్ సంఘం ప్రతినిధులు లక్ష్మణ్‌దేవ్, డాక్టర్ రామకృష్ణ,రెడ్డి శ్రీనివాసరావు, మురళి పాల్గొ న్నారు.

విజేతలు వీరే

పురుషుల విభాగంలో

పురుషుల 49 కిలోల విభాగంలో ఆర్.సాయికుమార్ (విశాఖ), పి.హరికృష్ణ పాత్రుడు(చిత్తూరు), 52కిలోల విభాగంలో కె.గోవింద్(విశాఖ), బి.హేమంత్‌కుమార్ (కర్నూలు), 56కిలోల విభాగంలో జి.వంశీ (అనంతపురం), ఎం.సతీష్(విశాఖ), 60కిలోల విభాగంలో ఎన్.జీవ (విశాఖ), హెచ్.భానుప్రకాష్(శ్రీకాకుళం), 64కిలోల విభాగంలో డి.గణేష్(విశాఖ), వై.సూర్యనారా యణ(శ్రీకాకుళం), 69కిలోల విభాగంలో ఎస్.కళ్యాణ్(విశాఖ), పీపీ. కుమార్ (శ్రీకాకుళం), 75కిలోల విభాగంలో ఎన్.పవన్(విశాఖ), జి.సాయికుమార్ (కర్నూలు), 81కిలోల విభాగంలో మహ్మద్ అందన్(విశాఖ), కె.వెంకట్మేంరావు (కృష్ణా),91కిలోల విభాగంలో బిసాయిధనుష్(విశాఖ), స్వర్ణ, రజిత పతకాలు సాధించారు.

మహిళల విభాగంలో

48కిలోల విభాగంలో జి.రమ్య, 51కిలోల విభాగంలో జె.రేవతి, 54కిలోల విభాగంలో పి.కవిత, 57కిలోల విభాగంలో జి. ప్రవల్లిక, 60కిలోల విభాగంలో సీహెచ్.హాసిని, 64కిలోల విభాగంలో షేక్ నస్రీన్, 69కిలోల విభాగంలో బి.కీర్తిక, 75కిలోల విభాగంలో మానస, 81కిలోల విభాగంలో ఎస్.సిరిచందన పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు.

ఎంవీజీఆర్‌లో వైభవంగా వార్షికోత్సవం

డెంకాడ, న్యూస్‌లీడర్ : మండలం లోని చింతలవలసలో ఉన్న ఎంవిజిఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 21 వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ సభకు మాన్సాస్ చైర్మన్, కేంద్ర మంత్రి పూసపాటి అశోక్‌గజపతిరాజు విచ్చేశారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, లక్ష్మణ్‌ప్రసాద్, డిఆర్‌కె రాజు, కెవిఎల్ రాజు, జి.కష్యప్ విచ్చేశారు. వార్షికోత్సవంలో భాగంగా విద్యార్థులకు కళాశాలలో వివిధ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కళాశాలలో ఈ విద్యా సంవత్సరంలో చేపట్టిన వివిధ ప్రణాళికలను ఎంవిజిఆర్ ప్రిన్సిపల్ కెవిఎల్ రాజు వివరించారు. ఈ సందర్భంగా చదువులో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను కేంద్ర మంత్రి అశోక్‌గజపతిరాజు అభినందించారు. వార్షికోత్సవంలో భాగంగా కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. దీనికి విశేషమైన స్పందన లభించింది. వార్షికోత్సవంలో ఎంవిజిఆర్‌కు చెందిన వందలాదిమంది ఎంతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం

మూతపడిన దుకాణాలు నిలిచిన వాహన రాకపోకలు

కురుపాం,గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌లీడర్ : బోయ వాల్మీకులను, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చొద్దని, రాష్ట్రానికి ప్రత్యేక హెూదా ఇవ్వాలని, పార్లమెంట్‌లో గిరిజన యూనివర్సిటీ బిల్లు పెట్టాలని, విశాఖలో రైల్వేజోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గిరిజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపుతో చేపట్టిన మన్యం బంద్ జిల్లాలో విజయవంతమైంది. ఉదయం 6 గంటల నుంచే గిరిజనులంతా కురుపాం, మొండెంఖల్, గుమ్మలక్ష్మీపురం, నీలకంఠాపురం, కొమరాడ మండలం మాదలింగి ఏజెన్సీ ప్రాంతాలకు చేరుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బంద్ చేపట్టారు. గిరిజన సంఘాల జెఏసి జిల్లా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే కోలక లక్ష్మణమూర్తి, జిల్లా కార్యదర్శి టి.రమేష్, నాయకులు ఎం.శ్రీరాములు, పి.అప్పన్న దొర, కిశోర్, ఎన్.దాసు, తిరుపతిరావు, జి.తిరుపతిరావు నాయకత్వంలో బంద్ చేపట్టారు. మండల కేంద్రాల్లో అన్ని షాపులను మూసివేసి యజమానులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నారు. ఆర్టీసి బస్సులు, ప్రైవేటు వాహనాలు తిరగకుండా గిరిజనులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు.

కొమరాడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్రానికి తీవ్ర నష్టం చేయడమేకాకుండా ప్రత్యేకహెూదా, ఉత్తరాంధ్ర అభివృద్ధికి పోరాటంచేసిన నాయకులను అరెస్టులు, నిర్బంధాలుచేయడం అన్యాయమని, ఇలా చేసి పోరాటాలను ఆపలేరని సిపిఎం మండల నాయకులు కొల్లి సాంబమూర్తి అన్నారు. గిరిజన జాయింట్ యాక్షన్ కమిటీ(జెఏసి) రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆదివారం మండల కేంద్రంలో వామపక్షాల ఆధ్వర్యాన చేపట్టిన బంద్ విజయవంతమైంది. ఉదయం నుంచే మండల కేంద్రంలోని అన్ని కిరాణా, టీ, టిఫిన్, బట్టలషాపులు స్వచ్ఛందంగా మూసివేశారు. అలాగే అన్ని వర్గాల ప్రజలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొమరాడ అంతర్‌రాష్ట్ర రహదారిపై సుమారు రెండు గంట పాటు రాస్తారోకో నిర్వహించారు.

హరినామ సంకీర్తన యాత్ర


ఊరేగింపులో పాల్గొన్న విశేష భక్తజనం

విశాఖపట్నం, న్యూస్‌లీడర్ మురళీనగర్‌లోని భరద్వాజ్ క్షేత్రం ఆధ్వర్యంలో ఉదయం హరినామ సంకీర్తన యాత్ర నేత్రపర్వంగా జరిగింది. ఫాల్గుణ పూర్ణిమ, చైతన్య మహా ప్రభు జయంతి సందర్భంగా శ్రీమాయా పురం నవదీపం ధామం నుంచి సాధు కుంగవులు, సన్యాసులు, బ్రహ్మచారులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ కృష్ణ చైతన్య మఠం ఆచార్యులు త్రిదండి స్వామి బి.ఎస్.కేశవ్ మహారాజ్ నేతృత్వంలో శ్రీ కృష్ణ మహాప్రభు, నిత్యానంద ప్రభువు ఉత్సవ విగ్రహాల ఊరేగింపుతోపాటు కోలాటం, తప్పెట గుళ్ళు, శాస్త్రీయ, జానపద నృత్యాలు, అఖండ హరినామ సంకీర్తనం, మహా దీప ప్రజ్వలనం కోటి హరినామ జపం, పూజాభిషేకం ప్రసాదాల వితరణతో ఊరేగింపు మురళీనగర్ ప్రధాన కూడలినుంచి కళింగనగర్, మాధవధార, గాయత్రి విద్యా మందిరం వరకు నృత్య కళారూపాలై అత్యంత వైభవోపేతంగా జరిగింది. ఈ సందర్భంగా భరద్వాజ్ క్షేత్రం ప్రతినిధి జగదీష్ త్రిదండి స్వామి బి.ఎస్.కేశవ్ మహారాజ్ ను ఘనంగా సత్కరించారు. ఊరేగింపు కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పపువా న్యూగినియాలో మరో



పోర్ట్‌మోర్స్బై :
స్థానిక దక్షిణ హైలాండ్స్, వెస్టర్న్, ఇంగ్గా, హేలా ప్రాంతాలలో సోమవారం కూడా భూకంపం సంభవించిందని అధికారులు వెల్లడించారు. దాని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.0గా నమోదైందని అన్నారు. గత వారం భూకంపం ధాటి నుండి కోలుకోకుండానే తాజాగా మరో భూకంపం సంభవించడంతో స్థానిక ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిందని అసంస్థ వ్యాఖ్యానించింది. ఫిబ్రవరి 26న పపువా న్యూ గినియా రిమోట్ పర్వతాలలో సంభవించిన భూకంపం ధాటికి నిరాశ్రయులైన వేలాదిమంది స్థానికులకు ఇప్పటివరకు ఆహారం, తాగునీరు, శానిటేషన్ సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్నారని రెడ్‌క్రాస్ వెల్లడించింది. భూకంపం తీవ్రత రిక్టర్‌స్కేలుపై 7.5గా నమోదవగా, దాని ధాటికి అనేక గ్రామాలకు రోడ్డు, విద్యుత్ సంబంధాలు తెగిపోయాయని, శుక్రవారం వెల్లడించిన నివేదిక అధారంగా 67మంది మృతి చెందగా, 1,43,000మంది ప్రజలపై ప్రభావం పడిందని రెడ్‌క్రాస్ అధికారులు తెలిపారు. 17,000మంది ఇళ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయన్నారు. వాహనాల ద్వారా నిరాశ్రయులైన వారికి ఆహారం అందిస్తున్నామని, అయితే కొన్ని ప్రాంతాలలోకి వెళ్లడానికి వీలులేకుండా కొండ చరియలు విరిగిపడటంతో రోడ్లు నాశనమయ్యాయన్నారు. దేశంలోనే అతిపెద్దదైన యుఎస్ శక్తి ఉత్పాదక ఎక్సాన్ మొబిల్‌తో పనిచేసే పిఎన్‌జి ఎల్ఎన్‌జి ప్రాజెక్ట్‌లో మరమ్మత్తులు కొనసాగుతున్నాయన్నారు. గ్యాస్‌ప్లాంట్ మూతపడటంతో ఆ ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడిందని ప్రధాన మంత్రి పీటర్ ఒ నైల్ వ్యాఖ్యానించారు.

ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో
మను భకర్‌కు స్వర్ణం



మెక్సికో:
భారత్‌కు చెందిన 16 ఏండ్ల మను బకర్ ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్‌లో స్వర్ణం సాధించింది. మహిళల పది మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో మను భకర్ స్వర్ణ పతకాన్ని గెలిచింది. ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచకప్ మెక్సిలోని గౌదలజరలో ప్రస్తుతం జరుగుతున్నది. ఈ విభాగంలో అలెజంద్రా జవాలా వాక్వెజ్‌ను మను భకర్ ఓడించింది. అలెజంద్రా రెండు సార్లు ప్రపంచకప్‌లో విజయం సాధించింది. ఇక.. ఈ టోర్నమెంట్‌లో ఇండియాకు ఇది రెండో గోల్డ్ మెడల్.

బ్యాంకులతో ఆధార్ లింక్ గడువు పెంపు?



న్యూఢిల్లీ:
ఆధార్‌తో బ్యాంకు ఖాతాల అనుసంధానికి ఇచ్చిన గడువును పొడిగించాలని, ముఖ్యంగా ప్రభుత్వరంగ బ్యాంకులకు ఇది అవసరమని పరిశ్రమల సమాఖ్య అసోచామ్ సూచించింది. పీఎన్‌బీ స్కామ్ అనంతరం ప్రభుత్వరంగ బ్యాంకుల (పీఎస్‌బీ) సిబ్బంది తమ ప్రధాన వ్యాపారాన్ని కాపాడుకునే క్రమంలో ఉన్నారని, ఆధార్ అనుసంధానం కోసం వారిపై ఒత్తిడి తీసుకురావడం తగదని అభిప్రాయపడింది. పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ తాలూకు ప్రభావాల నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ ఇంకా బయటకు రాలేదని, మార్చి 31 తర్వాత బ్యాంకు ఖాతాలు నిర్వహణ రహితంగా మారిపోయే రూపంలో ఎదురయ్యే మరో సవాలుకు సిద్ధంగా లేదని పేర్కొంది.

ఆధార్‌తో బ్యాంకు ఖాతాల అనుసంధానానికి ఈ ఏడాది మార్చి 31 వరకు గడువు ఉంది. అయితే, కస్టమర్ల ఖాతాలన్నింటినీ మార్చి 31లోపు ఆధార్‌తో అనుసంధానించడం సవాలుతో కూడుకున్నదని, కనుక గడువును పొడిగించాల్సిన అవసరం ఉందని సూచించింది. ఆధార్‌తో అనుసంధాన లక్ష్యాన్ని చేరేకంటే ముందుగానే బ్యాంకులు ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేందుకు అవకాశం ఇవ్వాలని కోరింది.

నటుడు సుమన్ ఎన్నికల్లో పోటీకి రెడీ



హైదరాబాద్:
ఏపీలోని చంద్రబాబు సర్కారు, తెలంగాణలోని కేసీఆర్ సర్కారు తాను కోరుకున్న విధంగా పలన సాగిస్తే, వారికి మద్దతు పలుకుతానని, ఎన్నికల్లో అనుకూలంగా ప్రచారం చేయడంతో పాటు ప్రత్యక్షంగా బరిలోకి దిగేందుకూ సిద్ధమని నటుడు సుమన్ వ్యాఖ్యానించారు. హుజూర్ నగర్ లో మీడియాతో మాట్లాడిన ఆయన, వైద్యం, వ్యవసాయం, విద్య తదితర రంగాల్లో మరింత అభివృద్ధి దిశగా పాలకులు కృషి సాగించాలని ఆయన కోరారు. దేశంలో మరెక్కడా లేని విధంగా వ్యవసాయానికి నిరంతర విద్యుత్‌ను అందిస్తున్న ఘనత ఒక్క కేసీఆర్‌కు మాత్రమే దక్కిందని పొగడ్తలు కురిపించారు. రైతులకు బీమా సౌకర్యాన్ని కల్పించడం అభినందనీయమని, గ్రామాల అభివృద్ధికి బాటలు వేయాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ప్రజాసంకల్పయాత్ర @ 1400 కి.మీ

ఒంగోలు :
నాలుగేళ్లుగా రాష్ట్ర ప్రజలు పడుతున్న కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకుంటూ, వారికి భరోసా ఇస్తూ ముందుకు సాగుతున్న ప్రజాసంకల్పయాత్ర మరో మైలురాయిని అధిగమించింది. ప్రజలతో మమేకం అవుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న పాదయాత్ర సోమవారం ప్రకాశం జిల్లాలో 1400 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. పాదయాత్ర 1400 కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన నాగులపాడులో ఓ మొక్కను నాటారు. వైఎస్ జగన్ 2017 నవంబర్ 6న వైఎస్ఆర్ జిల్లా ఇడుపులపాయలో ప్రజాసంకల్పయాత్రను ప్రారంభించిన విషయం విదితమే.



ఆస్కార్ వేడుకలో శ్రీదేవి, శశికపూర్‌కి నివాళి



లాస్‌ఏంజెల్స్:
90వ ఆస్కార్ అవార్డుల వేడుక ప్రారంభమైంది. లాస్‌ఏంజెల్స్‌లోని డాల్బీ థియేటర్‌లో ఈ వేడుక కన్నులపండువగా జరుగుతోంది. భారత కాలమానం ప్రకారం సోమవారం 6.30 గంటలకు ఈ వేడుక ప్రారంభమైంది. ఈ సందర్భంగా దివంగత బాలీవుడ్ నటులు శశికపూర్, శ్రీదేవికి నివాళులు అర్పించారు. ప్రముఖ అమెరికన్ సంగీత దర్శకుడు ఎడ్డీ వెడ్డర్ స్టేజ్‌పైన సంగీత ప్రదర్శనతో వీరికి నివాళులు అర్పించారు. 2017 డిసెంబరులో శశికపూర్ అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. 2018 ఫిబ్రవరి 25న శ్రీదేవి ప్రమాదవశాత్తు బాత్‌టబ్‌లో పడి కన్నుమూశారు. భారతీయ ప్రేక్షకుల కోసం.. వీరికి నివాళులు అర్పించేలా ఆస్కార్ ఏర్పాట్లు చేసింది.

ఎదురుకాల్పుల్లో ఉగ్రవాదితో పాటు
నలుగురు వ్యక్తులు మృతి



శ్రీనగర్ :
జమ్మూ-కాశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య ఆదివారం రాత్రి జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక ఉగ్రవాదితో పాటు నలుగురు వ్యక్తులు మృతిచెందారు. పాహన్‌కు సమీపంలో అనుమానాస్పదంగా ఉన్న ఒక కారును ఆపేందుకు భద్రతా బలగాలు ప్రయత్నించగా, అందులోని వ్యక్తులు ఆగ కుండా వేగంగా వెళ్లడంతో భద్రతా బలగాలు వారిపైకి కాల్పులు జరిపా యని ఆర్మీ అధికార ప్రతినిధి తెలిపారు. ఉగ్రవాదులు కూడా కాల్పులు జరిపారని, ఈ ఎదురు కాల్పుల్లో ఉగ్రవాదితో పాటుగా ముగ్గురు వ్యక్తులు మృతిచెందారని వెల్లడించారు. మ అతిచెందిన ఉగ్రవాది షొపెయిన్‌కు సమీపంలోని జామ్నాగ్రికి చెందిన ఉగ్రవాది ముస్తాక్ అహ్మద్ దార్ కుమారుడు షాహిద్ అహ్మద్‌దార్‌గా పేర్కొన్నారు. మిగిలిన ముగ్గురు అతనికి సహాయకులని అధికారులు వెల్లడించారు. దీంతో ఈ ప్రాంతంలోని ఇంటర్నెట్ సేవలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్మీ అధికారులు తెలిపారు.

సంగీతపై మరోసారి దాడి



హైదరాబాద్ :
ఇంటి నుంచి గెంటేయడంతో భర్తపై పోరాటం సాగిస్తున్న సంగీతపై మరోసారి దాడి జరిగింది. ఆమె తమ్ముడు ఇంటికి వచ్చాడన్న కారణంతో అత్తమామలు, మరిది దాడి చేశారు. అదనపు కట్నం కోసం వేధించడంతో సంగీత కోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. భర్త ఇంట్లో ఉండాలని, ఆమె ఖర్చులకు నెలకు రూ.20 వేలు చెల్లించాలని ఇటీవల ఫ్యామిలీ కోర్టు తీర్పు చెప్పింది. దీంతో ఆమె బోడుప్పల్ శ్రీనగర్ కాలనీలో భర్త, టీఆర్ఎస్ మాజీ నేత కె.శ్రీనివాస్ రెడ్డి ఇంట్లో ఉంటున్నారు. ఆదివారం సాయంత్రం ఆమె తమ్ముడు రంజిత్‌రెడ్డి.. ఆ ఇంటికి రావడంతో ఎందుకు వచ్చావంటూ సంగీత మరిది శ్రీధర్‌రెడ్డి దాడికి దిగాడు. ఇది గమనించిన సంగీత.. వీడియో తీస్తుండగా ఫోన్ లాక్కొని అత్తమామలు, మరిది కలిసి దాడికి దిగారు. దీంతో సంగీత మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ముగ్గురిపై కేసు నమోదు చేశారు. మామ బాల్ రెడ్డి, శ్రీధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు.

రవితేజ సినిమాలో అవకాశం ఇప్పిస్తానంటూ..

టీవీ నటిపై లైంగిక వేధింపులు!



రవితేజ సినిమాలో చాన్స్ ఇప్పిస్తానంటూ టీవీ నటిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన హైదరాబాదులో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, గచ్చిబౌలిలో నివాసముండే ఒక టీవీ నటికి ఫేస్ బుక్ ద్వారా జగదీశ్ పిచ్చికి అనే వ్యక్తి పరిచయమయ్యాడు.

దర్శకుడు కళ్యాణ్ కృష్ణ దర్శకత్వంలో రవితేజ హీరోగా రూపొందనున్న తాజా సినిమాలో క్యారెక్టర్ నటి అవకాశ కల్పిస్తానంటూ ఆమెను నమ్మబలికాడు. దాని కోసం మాట్లాడాలని ప్రగతినగర్లోని శ్రీ సాయిరామ్ మానర్ అపార్టుమెంట్ లోని 507 ఫ్లాట్‌కు రావాలని ఆమెకు సూచించాడు. దీంతో అపార్టుమెంట్ కు వెళ్లిన ఆమెను లైంగికంగా వేధించాడు. దీంతో ఆమె అతనిని ప్రతిఘటించింది. దీంతో ఆమెపై దాడికి దిగి, బెల్టుతో ముఖం, వీపుపై కొట్టి బయటకు గెంటేశాడు. తీవ్ర అవమానభారంతో బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఐపీఎల్ వేడుకలు వాయిదా

(మొదటి పేజీ తరువాయి)

వెల్లడించారు. తొలుత క్రికెట్ క్లబ్ ఆఫ్ ఇండియా వేదికగా అంగరంగ వైభంగా అరంభ వేడుకలు నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. తాజాగా ఏప్రిల్ 7న 2018 ఓపెనింగ్ మ్యాచ్ జరిగే స్టేడియంలోనే వీటిని నిర్వహించాలని సీవోఏ నిర్ణయించింది. అరంభ వేడుకలను ఘనంగా నిర్వహించాలని వీటి కోసం రూ.50కోట్ల బడ్జెట్‌ను కేటాయిస్తూ ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ గతంలోనే ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఆ మొత్తాన్ని సీవోఏ రూ.30కోట్లకు కుదించింది. రూ.20కోట్ల మేర సీవోఏ కోత పెట్టిందని అధికారి వివరించారు. లీగ్‌లో తొలి మ్యాచ్ ముంబయిలోని వాంఖడే స్టేడియంలో ఏప్రిల్ 7న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబయి ఇండియన్స్, రెండు సార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరగనుంది. ఏప్రిల్ 7న ప్రారంభమయ్యే ఐపీఎల్ మెగా టోర్నీ మే 27తో ముగియనుంది.

మరో భారీ స్కామ్

(మొదటి పేజీ తరువాయి)

శిక్ష పడే అవకాశాలు ఉన్నాయి. కాగా, ఈ కంపెనీలపై మోసం, నమ్మకద్రోహం సెక్షన్లను కూడా జోడించాలని ఐటీ అధికారులు భావిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న కంపెనీల్లో అత్యధికం రియల్ ఎస్టేట్ రంగానికి చెందినవి కాగా, వాటిల్లో ప్రముఖ రాజకీయ నాయకులకు సంబంధించిన కంపెనీలు కూడా ఉన్నాయని ఐటీ వర్గాలు వెల్లడించాయి. ఓ రాజకీయ నేత సంస్థ దాదాపు రూ. 100 కోట్లను ఉద్యోగుల నుంచి టీడీఎస్ రూపంలో కట్ చేసుకుని, ప్రభుత్వానికి కట్టకుండా వ్యాపార అవసరాలకు తరలించినట్టు తేలిందని తెలిపాయి. ఇక, ఈ 447 కంపెనీల్లో సినీ నిర్మాణ సంస్థలు, మౌలిక రంగంలోని కంపెనీలు, స్టార్టప్ సంస్థలు ఉన్నాయని సమాచారం. ఓ మౌలిక సంస్థ రూ. 14 కోట్లను ఎగ్గొట్టగా, మరో ఐటీ సేవల సంస్థ రూ. 11 కోట్లను చెల్లించలేదని ఐటీ అధికారి ఒకరు తెలిపారు. 'ఏప్రిల్ 2017 నుంచి మార్చి 2018' మధ్య వసూలు చేసిన టీడీఎస్ నుంచి ఈ 3,200 కోట్లు కేంద్రానికి రావాల్సి వుందని, ఈ కంపెనీలపై చట్టపరమైన చర్యలుంటాయని ఆయన వెల్లడించారు.

పార్లమెంటులోనే ఉన్నామా?

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేశారు. అనంతరం సభ 11.20 నిమిషాలకు తిరిగి ప్రారంభమైనా సభ్యులు ఆం దోళన కొనసాగించారు. దీంతో వెంకయ్యనాయుడు సభ్యులపై తీవ్ర ఆగ్ర హం వ్యక్తం చేశారు. మనం పార్లమెంటులోనే ఉన్నామా? ఇంకెక్కడైనా ఉన్నామా? అని వ్యాఖ్యానించారు. సభలో మన వ్యవహార శైలిని దేశమంతా చూస్తూ ఉంటుందని.. సభ్యులు సంయమనంగా వ్యవహరించాలని సూచించారు. అయితే ఛైర్మన్ వ్యాఖ్యలను పట్టించుకోని తెదేపా, వైకాపా సభ్యులు వెల్ వద్దకు చేరుకుని ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేపట్టారు. ప్లకార్డులు ప్రదర్శించడంపై ఛైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. ఈ చర్యలు సభా సంప్రదాయాలకు వ్యతిరేకమన్నారు. క్రమశిక్షణ తప్పితే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అయినా సభ్యులు వినకపోవడంతో ఛైర్మన్ రాజ్యసభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. నెల రోజుల విరామం తర్వాత సోమవారం నుంచి పార్లమెంట్ సమావేశాలు పునః ప్రారంభం అయ్యాయి. లోక్‌సభ, రాజ్యసభలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రారంభం కాగానే.. ఇటీవల మృతి చెందిన ఎంపీలకు లోక్ సభ నివాళులర్పించింది. ముందుగా లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు.

లోక్‌సభ వాయిదా..

బడ్జెట్ మలి విడత సమావేశాలు తొలిరోజే పార్లమెంటు ఉభయసభల్లో గందరగోళం నెలకొంది. లోక్‌సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతిచెందిన సభ్యులకు నివాళులర్పించారు. అనంతరం స్పీకర్ సుమిత్రా మహాజన్ ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే సభ్యులు ఆందోళన చేయడంతో స్పీకర్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. దీంతో సభను మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు వాయిదా వేశారు.

జేఎఫ్సీ ప్రొడ్యూసర్, డైరెక్టర్ చంద్రబాబే

(మొదటి పేజీ తరువాయి)

తీవ్రంగా నష్టపోయిన అంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్ కోసం వైఎస్ఆర్‌సీపీ నడుంకట్టింది. ఐదుకోట్ల ఆంధ్రులకు ప్రత్యేక హోదా సంజీవని అని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీ వేదికగా తన పోరాటాన్ని మరింత ముమ్మరం చేసింది. 'ప్యాకేజీతో మోసం చేయొద్దు.. ప్రత్యేక హోదా మన హక్కు'' అన్న నినాదంతో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్యనేతలు సోమవారం ఢిల్లీలోని సంసద్‌మార్గ్‌లో మహాధర్నా చేపట్టారు.

సోమవారం మధ్యాహ్నం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, జేఎఫ్సీ దర్శకుడు, నిర్మాత చంద్రబాబేనని, పవన్, ఉండవల్లి తదితర సభ్యులంతా పెయిడ్ ఆర్టిస్టులని ఎద్దేవా చేశారు. వైసీపీతోనే ప్రత్యేక హోదా సాధ్యమని, కేంద్ర మంత్రి వర్గం నుంచి టీడీపీ వైదొలగి, అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. జేఎఫ్సీతో ఒరిగేదేమీ లేదని అభిప్రాయపడ్డ ఆయన, కమిటీలు, నివేదికలతో ప్రజలకు కలిగే ప్రయోజనం ఏంటని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రకటించిన తృతీయ కూటమిపై ఇప్పటివరకూ ఇంకా ఎటువంటి స్పష్టతా లేదని, కాబట్టి ఆ విషయంలో తమ పార్టీ ప్రస్తుతానికి స్పందించబోదని తెలిపారు.

ప్రత్యేక హోదా నినాదాల హోరు.. ప్రత్యేక హోదా ఇవ్వకుంటే కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి కూడా సిద్ధమేనని వైఎస్ఆర్‌సీపీ సీనియర్ నేత ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. హోదా కోసం పార్లమెంటులో వైఎస్ఆర్‌సీపీ ఎంపీలంతా పోరాడుతారని, ఈ నెల 21న కేంద్రంపై అవిశ్వాస తీర్మానం పెడతామని ఆయన తెలిపారు. అయినా, కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే ఏప్రిల్ 6న పార్టీ ఎంపీలతో రాజీనామా చేస్తారని తెలిపారు. ఏపీకి ప్రత్యేక హోదా సాధించేవరకు తమ పోరాటం ఆగబోదని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే వైఎస్ఆర్‌సీపీతో కలిసిరావాలని పిలుపునిచ్చారు. ఐదుకోట్ల ఆంధ్రులకు అపర సంజీవని వంటి ప్రత్యేక హోదా సాధన కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలోని సంసద్ మార్గ్‌లో సోమవారం చేపట్టిన మహాధర్నా పెద్ద ఎత్తున ప్రారంభమైంది. ఈ ధర్నాలో వైఎస్సార్‌సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, ముఖ్యనేతలతోపాటు శ్రేణులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వైఎస్ఆర్‌సీపీ ఎంపీ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ప్రత్యేక హోదా సాధించే వరకు తమ పోరాటాన్ని ఆపేది లేదని స్పష్టం చేశారు. నాలుగేళ్లుగా ప్రత్యేకహోదా కోసం వైఎస్ఆర్‌సీపీ పోరాటాలు చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా బంద్‌లు, ధర్నాలు, యువభేరీ కార్యక్రమాలు నిర్వహించిందని గుర్తుచేశారు. ప్రత్యేకహోదా కోసం అసెంబ్లీలో కూడా తీర్మానం చేశామన్నారు. గతంలో హోదా వద్దు ప్యాకేజీ ముద్దు అన్న చంద్రబాబు ఇప్పుడు కల్లబొల్లి కబుర్లు చెప్తున్నారని మండిపడ్డారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రత్యేకహోదాపై ప్రకటన రాకపోతే మార్చి 21న కేంద్రంపై అవిశ్వాసం తీర్మానం పెడతామని ప్రకటించారు. అప్పటికీ కేంద్రం స్పందించకపోతే ఏప్రిల్ 6న రాజీనామాలు చేస్తామని వైవీ స్పష్టం చేశారు.

త్వరలో 'మహారాజ' యోగం...!

(మొదటి పేజీ తరువాయి)

అందుబాటులో ఉండేలా వాటిలో ప్రయాణ ఛార్జీలను సగానికి సగం తగ్గించేందుకు నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఈ ఛార్జీలు ఇప్పటివరకు వేలల్లో ఉన్నాయి. 'ది పయనీర్' నివేదిక ప్రకారం, తగ్గించిన ఈ ఛార్జీల వల్ల వచ్చే నష్టాలను రాష్ట్ర పర్యాటక శాఖలు, ఐఆర్‌సీటీసీ లాంటి భాగస్వాములు భరించాల్సి ఉంటుంది. ఈ లగ్జరీ రైళ్లపై విదేశీ ప్రయాణికుల ఆసక్తి గణనీయమైన రీతిలో తగ్గిపోవడం కూడా ఛార్జీల తగ్గింపు నిర్ణయానికి ఓ కారణం. ప్యాలెస్ ఆన్ వీల్స్, రాయల్ రాజస్థాన్ లగ్జరీ రైళ్ల రెవిన్యూ వరుసగా 24 శాతం, 63 శాతానికి పైగా పడిపోయింది. ఈ రెండు రైళ్లను భారత రైల్వే శాఖే నడిపిస్తోంది. ఈ నెల 1న జరిగిన రైల్వే బోర్డు సమీక్షా సమావేశంలో ఛార్జీల తగ్గింపు నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి ఓ నోటిఫికేషన్ కూడా విడుదల చేశారు.

అట్టహాసంగా ఆస్కార్ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)

వరించాయి. ఈ ఏడాదికి సంబంధించి ఆస్కార్ అవార్డుల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి...

ఉత్తమ చిత్రం : ది షేప్ ఆఫ్ వాటర్
ఉత్తమ దర్శకుడు : గులెర్మో డెల్ టోరో (ది షేప్ ఆఫ్ వాటర్ దర్శకుడు)
ఉత్తమ నటి : ఫ్రాన్సెస్ మెక్ డోర్మండ్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి సినిమాకు గాను)
ఉత్తమ నటుడు : గ్యారీ ఓల్డ్ మ్యాన్, (డార్కెస్ట్ హవర్ చిత్రానికి)
ఉత్తమ సహాయ నటి : అల్లిసన్ జానే (ఐ, టోన్యా చిత్రానికి)
ఉత్తమ సహాయ నటుడు : శామ్ రాక్ వెల్ (త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరి సినిమాకు గాను)
ఉత్తమ ఒరిజినల్ స్క్రీన్ ప్లే : గెట్ అవుట్
ఉత్తమ అడాప్టెడ్ స్క్రీన్ ప్లే : కాల్ మి బై యువర్ నేమ్ చిత్రం
ఉత్తమ యానిమేషన్ ఫీచర్ ఫిల్మ్ : కోకో
ఉత్తమ విదేశీ భాషా చిత్రం : ఏ ఫాంటాస్టిక్ ఉమెన్, చిలీ
ఉత్తమ ఒరిజినల్ స్కోర్ : ది షేప్ ఆఫ్ వాటర్
ఉత్తమ ఒరిజినల్ గీతం: రిమెంబర్ మి, (కోకో సినిమా)
ఉత్తమ డాక్యుమెంటరీ చిత్రం : ఐకారస్
ఉత్తమ డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ : హెవెన్ ఈజ్ ఏ ట్రాఫిక్ జామ్ ఆన్ ద 405
ఉత్తమ లైవ్ యాక్షన్ షార్ట్ : ది సైలెంట్ చైల్డ్
ఉత్తమ యానిమేషన్ షార్ట్ : డియర్ బాస్కెట్ బాల్
ఉత్తమ సౌండ్ ఎడిటింగ్ : డన్ కిర్క్
ఉత్తమ సౌండ్ మిక్సింగ్ : డన్ కిర్క్
ఉత్తమ నిర్మాణ డిజైన్ : ది షేప్ ఆఫ్ వాటర్
ఉత్తమ సినిమాటోగ్రఫీ : బ్లేడ్ రన్నర్
ఉత్తమ మేకప్ అండ్ హెయిర్ : డార్కెస్ట్ హవర్
ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ : ఫాంటమ్ థ్రెడ్
ఉత్తమ ఫిల్మ్ ఎడిటింగ్ : డన్ కిర్క్
ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ : బ్లేడ్ రన్నర్

ప్రత్యేక హోదా, రైల్వే జోన్ ఇవ్వాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అమలుపై కేంద్రంతో ఎప్పటి కప్పుడు సంప్రదింపులు జరుపుతూనే ఉన్నామని తెలిపారు. రాష్ట్రానికి ఇంకా రాజధాని ఏర్పడలేదని, ప్రధాన ఆర్థిక వనరులను కోల్పోయామని, రెవెన్యూ లోటు, తక్కువ ఆదాయం, ఆస్తుల పంపిణీ పూర్తికాకపోవడంతో కొత్త రాష్ట్రానికి కష్టాలు మరింతగా పెరిగాయని గవర్నర్ అభిప్రాయపడ్డారు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్ లో సూచించిన విధంగా ఆస్తుల పంపిణీ చేపట్టాలని కోరారు. కేంద్ర నిధులతో గ్రేహౌండ్స్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సి వుందని అన్నారు. రాష్ట్ర ప్రజలు తీవ్ర కష్టాల్లో ఉన్నారని, అవమాన భారంతో ఆగ్రహంగా ఉన్నారని, కష్టాలు తీర్చి, ఆగ్రహాన్ని చల్లార్చాల్సిన బాధ్యత ఇప్పుడు కేంద్ర ప్రభుత్వంపైనే ఉన్నదని నరసింహన్ అభిప్రాయపడ్డారు.

కడప జిల్లాలో స్టీల్ ప్లాంట్, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు కావాలి. విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు, రోడ్డు అనుసంధానం కావాల్సి ఉందని, అసెంబ్లీ సీట్ల పెంపు, పన్ను విధింపు విషయాల్లో తేడాలను పరిష్కరించాలన్నారు. ఐదు కోట్ల ప్రజల రాష్ట్రంగా విభజన కష్టాలను అధిగమించాలంటే కేంద్ర సాయం అనివార్యమన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసు వ్యవస్థ ఆధునీకరణ చేశామన్నారు. ఎకో, హెరిటేజ్, బీచ్ టూరిజం విభాగాల్లో ఆధునిక సదుపాయాలతో కొత్త పర్యాటక ప్రాజెక్టులు ప్రారంభిస్తున్నామన్నారు. కియా మోటార్స్ కర్మాగారం అనంతపురం జిల్లాకు ఒక గేమ్ ఛేంజర్‌గా నిలిచిందన్నారు. ఆటోమొబైల్ కేంద్రంగా అనంతపురం అభివృద్ధి చెందుతోందన్నారు. చిత్తూరు జిల్లాలోని తిరుపతి ఎలక్ట్రానిక్ హబ్‌గా మారుతోందని, ఔషధ, ఏరోస్పేస్, డిఫెన్స్, ఇంజినీరింగ్ ఉత్పత్తుల హబ్‌గా విశాఖ, జౌళి, ఆహార శుద్ధి కేంద్రాలుగా, కృష్ణా, గుంటూరు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. కర్నూలులో ఒక అల్ట్రా మెగా ఫుడ్‌పార్క్ ఏర్పాటు కాబోతోందని, వృద్ధి గమనాన్ని సుస్థిరపరచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

యువతకు ఉపాధి కల్పించడమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. ప్రైవేటు రంగంలో పెద్దయెత్తున ఉపాధిని ప్రోత్సహిస్తోంది. ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేస్తోంది. 2019లో 10లక్షల మందికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందిచనున్నామన్నరు. 2018లో చమురు, సహజ వాయువు అన్వేషణలో ప్రభుత్వం పెట్టుబడులు ఆశిస్తోంది. విజయవాడ, విశాఖ, తిరుపతి విమానాశ్రయాలు ప్రయాణికుల రద్దీ విషయంలో దేశంలోనే అధికవృద్ధి నమోదు చేస్తున్నామన్నారు. భోగాపురం, ఓర్వకల్లు, దగదర్తి, దొనకొండ కొత్త విమానాశ్రయాల పనులు పురోగతిలో ఉన్నామన్నరు.

సంచలన వార్తా పత్రిక
లీడర్
విశాఖపట్నం
మంగళవారం 6-3-2018

'నా నువ్వే' వచ్చేది అప్పుడే

నందమూరి కాంపౌండ్ నుంచి వచ్చినా తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న కళ్యాణ్ రామ్ పూర్తి మేకోవర్ తో కొత్తగా రెండు సినిమాల్లో కనిపించ బోతున్నాడు. అందులో ఒకటి 'నా నువ్వే'. మిల్కీ బ్యూటీ తమన్నా మొదటి సారి కళ్యాణ్ రామ్ తో జట్టు కట్టిన ఈ మూవీ రిలీజ్ డేట్ లాక్ చేసారు. మే 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్ణయించు కున్నారు. తమన్నా రేడియో జాకీగా నటిస్తున్న ఈ మూవీ ఫీల్ గుడ్ లవ్ స్టొరీ. సిద్దార్థ్ ప్రియా ఆనంద్ లతో గతంలో 180 అనే సినిమాతో క్రిటిక్స్ ని సైతం మెప్పించిన జయేంద్ర దీనికి దర్శకత్వం వహించడం ప్లస్ గా మారింది. ఇప్పటికే విడుదలైన టీజర్ మంచి అంచనాలు రేకేత్తించగా ఫాన్స్ సైతం ఆశ్చర్యపోయేలా కళ్యాణ్ రామ్ లవ్ బాయ్ గా కనిపించడం ఆసక్తిని రేపుతోంది.

స్వచ్ఛవిశాఖి లక్ష్యాన్ని సాధించాలి

విశాఖ లోక్‌సభసభ్యులు డాక్టర్ కంభంపాటి హరిబాబు



విశాఖపట్నం, న్యూస్‌లీడర్: స్వచ్ఛ విశాఖ లక్ష్యాన్ని శతశాతం సాధించే విధంగా అంతా కలసికట్టుగా కృషి చేయాలని విశాఖ లోక్‌సభ సభ్యులు డాక్టర్ కంభంపాటి హరిబాబు పిలుపునిచ్చారు. కోస్టల్ ఛారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం బీజేపీ కార్యాలయంలో డెస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు చేతులు మీదుగా వాటిని 1500 మంది నగరవాసులకు అందచేశారు. కార్యక్రమానుద్దేశించి ఎంపీ మాట్లాడుతూ నరేంద్రమోడీ పిలుపుమేరకు స్వచ్ఛభారత్ కార్యక్రమం దేశం వ్యాప్తంగా విజయవంతంగా జరుగుతోందన్నారు. ముఖ్యంగా మహావిశాఖనగరపాలక సంస్థ మొదటి విడతలోనే స్మార్ట్‌సిటీగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం, అదే సందర్భంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే ఇలాంటి కార్యక్రమాలు విజయవంతం అవుతాయన్నారు. ముఖ్యంగా జీవీఎంసీలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు హర్షణీయమన్నారు. స్వచ్ఛ భారత్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధతో అనేక కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఈ కార్యక్రమం మరింత విజయవంతంగా సాగుతున్నదని అభినందించారు. అన్ని వార్డుల్లో ప్రజలు పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని , తడి,పొడి చెత్తను వేరే చేసి జీవీఎంసీ సిబ్బందికి అందచేయాలన్నారు. అందమైన, ఆరోగ్యకరమైన నగరంగా విశాఖను తీర్చిదిద్దాలని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో



స్వచ్ఛభారత్ అంబాసిడర్లు వి.వి. రమణమూర్తి, డాక్టర్ శిరీషా రెహమాన్, ఆచార్య బాలమోహన్‌దాస్, జీజ వలసరాజు, తదితరులు పాల్గొన్నారు.

సన్ ఆస్తరా 2018 స్పోర్ట్స్ మీట్





సన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో సోమవారం పోర్టు స్టేడియంలో సన్ ఆస్తరా 2018 స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గంటా శారద పాల్గొన్నారు. కార్యక్రమంలో సన్ ఇన్సిట్యూట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశాజాస్తి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. -న్యూస్‌లీడర్, విశాఖపట్నం

ప్రపంచ 19వ ఉత్తమ మహిళా అవార్డు లోగో ఆవిష్కరణ



విశాఖపట్నం, న్యూస్‌లీడర్ : మా సంస్కృతి కళా పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 8న ఢిల్లీలో జరిగే మహిళా దినోత్సవ కార్యక్రమం లోగోను మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్క రించారు. సీతమ్మధారలోని సంస్థ కార్యాల యంలో సోమవారం ఆయన ఆవిష్క రించారు. ఈ సందర్భంగా మా సంస్కృతి కళా పరిషత్ అధ్యక్షురాలు లక్ష్మి భార్గవి మాట్లాడుతూ ఢిల్లీలోని భవన్‌లో ఈ నెల8వ తేదీన మా సంస్కృతి కళా పరిషత్, ఢిల్లీ తెలుగు ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తు న్నారని తెలిపారు. మహిళలు అత్యంత శక్తివంతంగా, ఎప్పుడూ విశ్వాసం కోల్పోకుండా ఉండాలని కోరారు. మహి ళలు చైతన్యవంతులై, వారు ఉన్నత శిఖరాలు అధిరో హించడానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందని ఈ సందర్భంగా తెలిపారు.

వెంకీ సినిమాలో కుండ మార్పిడి



ఇప్పుడంటే ఈ మాట తక్కువగా వింటాం కాని పెద్దవాళ్ళను అడిగితే కుండమార్పిడి అనే పదానికి అర్థాన్ని బాగా వివరిస్తారు. మనం ఒకరింట్లో అమ్మాయినో అబ్బాయినో పెళ్లి చేసుకునేందుకు ఒప్పుకోవడానికి అవతలి వైపు నుంచి కూడా రివర్స్ లో మన ఇంట్లో వాళ్ళతో ముడి పెట్టించే పద్ధతే కుండమార్పిడి. సింపుల్ గా చెప్పాలంటే నేను మీ అక్కను చేసుకోవాలంటే నువ్వు మా చెల్లిని చేసుకోవాలి అనే స్కీం అన్నమాట. ఇప్పుడు దీన్నే వెంకటేష్ కొత్త సినిమా కోసం వాడుతున్నట్టు టాక్. తేజ దర్శకత్వంలో మార్చ్ 12 నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టుకోబోతున్న ఈ మూవీలో వెంకీతో పాటు నారా రోహిత్ కూడా ఒక కీలక పాత్ర పోషిస్తున్న సంగతి తెలిసిందే. మొదట సీతమ్మ వాకిట్లో తరహాలో అన్నదమ్ములేమో అనుకున్నారు కాని అది నిజం కాదట. విశ్వసనీయ సమాచారం మేరకు ఇద్దరు బావ బావరమరుదులగా కనిపిస్తారట. వెంకటేష్ నారా రోహిత్ అక్కయ్య శ్రేయను చేసుకుంటే బదులుగా వెంకీ చెల్లెలు ఈశా రెబ్బాను రోహిత్ చేసుకుంటాడన్న మాట. పైన చెప్పిన కుండ మార్పిడి ఫార్ములా ఇదే. ఇది అనధికారికంగా బయటికి వచ్చిన వార్తే. మంచి ఫ్యామిలీ డ్రామా వీళ్ళ మధ్య దర్శకుడు తేజ సెట్ చేసాడని తెలిసింది. దానితో పాటు యాక్షన్ ఎలెమెంట్స్ కూడా బాగా దట్టించి వెంకటేష్ ఫాన్స్ కి మంచి జోష్ ఇచ్చేలా స్క్రిప్ట్ సిద్ధం చేయించాడని తెలిసింది. ఆటా నాదే వేటా నాదే టైటిల్ పరిశీలనలో ఉన్న ఈ ప్రాజెక్ట్ ని వీలైనంత త్వరగా ఫినిష్ చేసి దసరా బరిలో దించేలా ప్లానింగ్ జరుగుతోంది. అ!! లో స్వలింగ భాగస్వామిని కోరుకునే పాత్రలో మెప్పించిన ఈశా రెబ్బకు ఇది మంచి ఛాన్స్ అని చెప్పోచ్చు. లాస్ట్ ఇయర్ అమీ తుమితో మంచి హిట్ తన ఖాతాలో వేసుకున్న ఈషకు ఇది మంచి ఆఫర్. ఎన్టీఆర్ బయోపిక్ కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉండటంతో తేజ తన పూర్తి ఫోకస్ వెంకీ సినిమా మీదే పెట్టనున్నాడు. ఇది పూర్తయ్యాక వెంకీ త్రివిక్రమ్ సినిమా చేసే ఛాన్సెస్ ఉన్నాయి.

మెహ్రీన్ చాలా తగ్గిందే !!



సినిమా ఇండస్ట్రీలో విజయాలు అందితేనే క్రేజ్ అయినా రెమ్యునరేషన్ అయినా గట్టిగా ఉంటుంది. కష్టకాలంలో ఉన్నప్పుడు అవకాశాలు ఎలా అయినా రప్పించుకోవచ్చు. కానీ రెమ్యునరేషన్ పై మాత్రం ఎక్కువగా ఆశలు పెట్టుకోకూడదు. ఎంత ఇస్తే అంత తీసుకోవాలి. లేదంటే ఫ్రీ గా అయినా చేయాలి. ఎవ్వరికైనా కొన్ని సమయాల్లో ఇలాంటి తిప్పలు తప్పవు. రీసెంట్ గా అదే తరహాలో ఓ హీరోయిన్ పరిస్థితి మారిందని తెలుస్తోంది.

కృష్ణ గాడి వీర ప్రేమ కథ సినిమాతో తెలుగు ఇండస్ట్రీకి పరిచయమైన నార్త్ గర్ల్ మెహ్రీన్ పిర్జాద. అమ్మడు వచ్చిన కొత్తలో ఒక్క సినిమాతోనే మంచి క్రేజ్ తెచ్చుకుంది. నవ్వుతోనే అందరిని ఆకర్షించింది. వరుసగా ఆఫర్స్ ని కూడా అందుకుంది. మహానుభావుడు – రాజా ది గ్రేట్ సినిమాలతో హ్యాట్రిక్ విజయాలను అందుకోవడంతో అందరు తిరుగులేదు అనుకున్నారు. కానీ వెంటనే మెహ్రీన్ ఖాతాలో హ్యాట్రిక్ పరాజయాలు కూడా కొనసాగడం మొదలయ్యాయి. కేరాఫ్ సూర్యా తెలుగు తమిళ్ లో డిజాస్టర్ అయ్యింది. జవాన్ అయితే ఏ మాత్రం లాభాన్ని ఇవ్వలేదు.

దీంతో మెహ్రీన్ పరిస్థితిని అర్థం చేసుకొని తనకు తానే సరికొత్త దారిని ఎందుకుంది. ఇలాంటి టైమ్ లో రెమ్యునరేషన్ విషయంలో తగ్గాల్సిందే అని కేవలం అవకాశాల కోసమే ఆలోచిస్తోందట. కథ బాగా నచ్చితే రెమ్యునరేషన్ లెక్కలను పట్టించుకోవడం లేదట. కేవలం 20 లక్షలు మాత్రమే ఇవ్వమని అంటోందని టాక్. కానీ ప్రియా వారియర్ లాంటి లేటెస్ట్ ముద్దు గుమ్మాలు మాత్రం మొదటి 50 లక్షల వరకు లాగేస్తున్నారు. మెహ్రీన్ మాత్రం సినిమాకు తగ్గట్టు చాలా వరకు రెమ్యునరేషన్ ని తగ్గించేస్తోందట. ప్రస్తుతం విజయ్ దేవరకొండతో అలాగే జ్ఞాన్ వెల్ రాజ్ ప్రొడక్షన్ లో ఈ భామ సినిమాలు చేస్తోంది.

శ్రీదేవి అస్థికలు అక్కడ కలిపేశారు

ఇండియన్ సిల్వర్ స్క్రీన్ బ్యూటీ శ్రీదేవి కపూర్ మరణించి రోజులు గడుస్తున్నా ఎదో ఒక విషయం ఆమె గురించి వైరల్ అవుతునే ఉంది. ఎవ్వరైనా మర ణించక తప్పదు అనే సత్యాన్ని అప్పుడపుడు మనుషులకు ఇలా ంటి ఘటనలు గుర్తు చేస్తాయి అనడంలో ఎలాంటి సందేహం





లేదు. శనివారం దుబాయ్ లో శ్రీదేవి మరణం గత ఆదివారం ఉదయం భారతీయులకు ఒక మర్చిపోలేని చేదు అనుభవం.

ఇకపోతే రీసెంట్ గా శ్రీదేవి మరణం అనంతరం చివరి కార్య క్రమం ముగిసింది. కుటుంబ ఆచారాల ప్రకారం మార్చ్ 3వ తేదీన ఆమె అస్థికలను రామే శ్వరంలో కలిపారు. బోణి కపూర్ తో పాటు శ్రీదేవి కూతుళ్లు జాహ్నవి – ఖుషి కూడా చివరి తంతులో తల్లి ఆత్మకు శాంతి కలగాలని కోరుకున్నారు. ప్రస్తు తం అందుకు సంబందించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ముగ్గురు తెల్లని దుస్తుల్లో శ్రీదేవికి వీడ్కోలు పలికారు. ఈ సందరరేలో బోనీ కపూర్ కాస్త కోలుకున్నట్లే కని పించినా.. జాహ్నవి అండ్ ఖుషీ మాత్రం బాగా కుంగిపోయారని వారిని చూస్తేనే అర్దమవుతోంది.

ఇక టాలీవుడ్ సినీ ప్రము ఖులు కూడా రీసెంట్ గా శ్రీదేవి ని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని శ్రీదేవి కూతుళ్లు కూడా ఆమె కోరు కున్నట్లుగా అత్యున్నత స్థాయికి ఎదగాలని మనసారా ఆశీర్వదించారు.

Printed, Published and Owned by V.V.Ramana Murthy and Printed at LEADER PRESS, 58-14-109/5, Block No. 113 A, VUDA Layout, Marripalem, Visakhapatnam - 530009, A.P. and Published at 47-10-7/3, Diamond Park Junction, Visakhapatnam - 530016, A.P.
EDITOR - V.V. RAMANA MURTHY, **RNI NO: 72163/99, Registered Postal Regd. No. - VSP/211/2015-17 E-MAIL andhraleader@gmail.com, Telephone Nos. 0891-6660599, 98488 49832**

విద్యార్థులకు నెలకు రూ.1200

రోలుగుంట, న్యూస్‌లీడర్: ప్రధానమంత్రి జీవన్‌జ్యోతి, బీమా యోజన, చంద్రన్న బీమా పథకం ద్వారా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్న పిల్లలకు ఏడాదికి రూ.1200 అందిస్తున్నామని సంబంధిత దరఖాస్తులు నేరుగా వెలుగు కార్యాలయానికి అందజేయాలి తప్ప బయట ఇంటర్నెట్ సెంటర్లలో గానీ, మీ సేవా కేంద్రాల్లో గానీ అందజేయవద్దని వెలుగు ఏపీఎం లక్ష్మి తెలిపారు.

ఈ మేరకు ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకం చేయించి నేరుగా ఈ నెల 15వ తేదీ లోగా అందజేయాలని కోరారు.

6న పారిపల్లి అమ్మవారి జాతర మహోత్సవం

భారీ ఏర్పాట్లు చేసిన ఉత్సవ కమిటీ సభ్యులు



పారిపల్లి అమ్మవారు

మునగపాక, న్యూస్‌లీడర్: విశాఖజిల్లాలో ప్రఖ్యాతిగాంచిన మండలంలోని వాడ్రాపల్లి శ్రీ పారిపల్లి అమ్మవారి జాతర మహోత్సవం ఈ నెల 6వ తేదీ మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ జాతరకు వాడ్రాపల్లితోపాటు అప్పికొండ వానిపాలెం, కుంచవానిపాలెం, గొల్లలపాలెం, మల్లవరం ఏడు గ్రామాలకు చెందిన ప్రజలు అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించుకుంటారు. దీనిలో భాగంగా ఉత్సవం సంబంధించిన పోస్టర్‌ను మాజీ ఎంపీపీ ఆడారి మంజు ఆవిష్కరించారు. ఉత్సవంలో భాగంగా మంగళవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకములు నిర్వహించనున్నారు. వంశపారంపర్య ధర్మకర్త అయిన గ్రామ మాజీ సర్పంచ్ మళ్ల నర్సింహమూర్తి (రవి) మొద టగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే జాతర సందర్భంగా అమ్మవారి ఆల యాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలం కరించారు. అలాగే గ్రామంలోని ప్రధానకూడళ్లవద్ద భారీ విద్యుత్ సెట్టింగులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జాతర సందర్భంగా మంగళవారం రాత్రికి భారీ స్టేజి ప్రోగ్రామ్‌లు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటి చైర్మన్ కొయిలాడ రాంబాబు, కార్యదర్శి మళ్ల శేషు, కమిటీ సభ్యులు పిల్లా సూరిబాబు, యల్లపు పారునాయుడు, గ్రామపెద్దలు మళ్ల వరహాసర్సింగరావు, కాంట్రేగుల సూకరాజు, పెతకంశెట్టి రామజోగినాయుడు, కాంట్రేగుల సూక అప్పారావు, కొయిలాడ దశావతారం తదితరులు తెలియజేశారు.



ఉత్సవం పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

వడ్డాది వెంకన్న హుండీ ఆదాయం లెక్కింపు

బుచ్చెయ్యపేట,న్యూస్‌లీడర్: గత నెల 25 నుండి ఈనెల 3వరకు నిర్వహించిన వడ్డాది వెంకటేశ్వరస్వామి కళ్యాణోత్సవాలలో భక్తులు సమర్పించిన కానుకలను, హుండీ ఆదాయాన్ని ఆదివారం సాయంత్రం లెక్కించారు.దేవాదాయ ఇన్స్‌పెక్టర్ వి.శ్రీనివాసరాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.వాసుదేవరావు, ధర్మకర్త దొండా కన్నబాబుల సమక్షంలో శ్రీహరి సేవకులు లెక్కింపు చేపట్టారు.టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ.3.09,120లు, హుండీలో కానుకుల ద్వారా రూ.5,08,506లు, కొబ్బరి చిప్పలు వేలం ద్వారా రూ.35వేలు, తలనీలాలు ద్వారా రూ.25వేలు , మొత్తం రూ.8,77,626లు ఆదాయం వచ్చింది.గత ఏడాది కంటే ఈ ఏడాది రూ.30వేలు అదనంగా వచ్చింది.పది తులాల వెండి వస్తువులు కూడా వచ్చాయి.లక్ష మందికి పైగా భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దాడి సూర్యనాగేశ్వరరావు, కోవెల జనార్ధనరావు, దాడి పెదగోవింద, సయ్యపురెడ్డి సత్యనారాయణ, శిరిగిరిశెట్టి చినవెంకయ్యదొర తదితరులు పాల్గొన్నారు.



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

సంత తరలింపుతో తీరిన కష్టాలు




పరిశుభ్రమైన మెయిన్‌రోడ్డు

మాడుగుల, న్యూస్‌లీడర్: సోమవారం సంత రోజున మాడుగులలో మెయిన్‌రోడ్డు మీద గిరిజనులు, రైతులు పండించిన కూరగాయలను ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాడేరుకు వెళ్లే బస్సులు, వాహనదార్లు, దారిన నడిచేవారు తీవ్ర ఇబ్బంది పాడేవారు. సంత జరిగే ప్రాంతంలో కొంత మంది రాత్రిపూట, తెల్లవారుజామున బహిరంగ మలమూత్ర విసర్జన చేస్తుండేవారు. దేవతా చెట్టుగా పూజలందుకునే చెట్టు సమీపంలో చేపలు, మాంసం దుకాణాలను ఏర్పాటు చేయడం వలన వాటి వ్యర్థాలు కారణంగా తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడేవారు. ఈ పరిస్థితి గమనించి సర్పంచ్ దంగేటి వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి చదరం రామ సత్యనారాయణ, పంచాయతీ సభ్యుల సహకారంతో సంత జరిగే ప్రాంతాన్ని పూర్తిగా మార్చివేయాలనే ప్రణాళిక సిద్ధం చేశారు. దీంతో ముందుగా సంత దుకాణాలను దుర్గాదేవి ఆలయం ఎదురుగా మార్చడంతో రోడ్డుమీద ట్రాఫిక్ క్లియర్ అయింది. బహిరంగ మలమూత్ర విసర్జన జరగకుండా ముగ్గురు పంచాయతీ సిబ్బందిని కాపలా ఏర్పాటు చేయడంతో పూర్తిగా మలమూత్ర విసర్జన అరికట్టారు. చేపలు, మాంసం దుకాణాలను పూర్తిగా తొలగించి పంచాయతీ దుకాణాల వెనుక భాగంలో ఏర్పాటు చేశారు. దీంతో సంత జరిగే ప్రాంతం పూర్తిగా అహ్లాదకరంగా మారిపోయింది. చేపలు, మాంసం దుకాణాలు తొలగించడంతో దేవతా చెట్టును అభివృద్ధి చేయడానికి కాండ్రేగుల దుర్గాప్రసాద్ 50వేల రూపాయలతో అభివృద్ధి చేపట్టారు. పంచాయతీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి మాడుగుల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గ్రామస్తులు, పంచాయతీ సభ్యులు, కార్యదర్శి, సిబ్బంది సహకారంతో సంతను మార్పు చేయడం జరిగింది.

-దంగేటి వెంకటలక్ష్మి, సర్పంచ్



పంచాయతీ చేసే అభివృద్ధి కార్యక్రమాల ద్వారా సంతలో ట్రాఫిక్ సమస్య పూర్తిగా తీరిపోయింది. చేపలు, మాంసం దుకాణాలు పూర్తిగా తొలగించడంతో సంత ప్రాంతం అహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది.

-మామిడి సత్తిబాబు, రైతు, మాడుగుల

నరకాన్ని తలపిస్తున్న

సాగరం రహదారి



రాళ్లు తేలిన సాగరం రహదారి

మాడుగుల, న్యూస్‌లీడర్: మాడుగుల నుంచి సాగరం వెళ్లే రహదారి పూర్తిగా శిథిలమై రాళ్లు తేలిపోవడంతో నడవలేని పరిస్థితి ఏర్పడిందని ఆ ప్రాంతానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ సోమవారం, గురువారం సంత జరిగే సమయంలో పండిన కూరగాయలను సంతకు తీసుకువచ్చే రైతులు ఈ దారిలోనే ప్రయాణం చేస్తుంటారు. ఉదయం పొలాలకు వెళ్లే వందలాది మంది రైతులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ దారినే వెళ్తుంటారు. వర్షాకాలం వచ్చిందంటే తాచేరు నది ఉధృతంగా ప్రవహించడం వలన రైతులు నదిలో దిగి నడిచిరాలేక తాడు సహాయంతో పొలాలకు వెళ్తుంటారు. ఈ పరిస్థితిని రైతులు మాడుగుల శాసన సభ్యులు బూడి ముత్యాలనాయుడుకు, మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గవిరెడ్డి రామానాయుడుకు విన్నవించుకున్నా ఎటువంటి ప్రయోజనం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఈ పరిస్థితి గమనించి రైతులకు ఇబ్బందులు కలగకుండా సిమెంట్ రోడ్డు నిర్మాణం, తాచేరు నదికి వంతెన ఏర్పాటు చేయాలని ఈ ప్రాంతానికి చెందిన రైతులు కోరుతున్నారు.

శ్రీగురుదత్తాత్రేయ ఆలయ

నిర్మాణ పనులకు శంకుస్థాపన

మాడుగుల, న్యూస్‌లీడర్: మండలంలోని కేజేపురం గ్రామంలో సోమవారం ఉదయం ఐదవ వార్డు గాంధీ వీధిలో తెల్లవారుజామున శ్రీగురుదత్తాత్రేయ ఆలయ నిర్మాణ పనులకు పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు, సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్, కీర్తశేషులు సాలాపు వరహా నర్సింహమూర్తి అప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు సాలాపు వీరునాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆలయ నిర్మాణం, విగ్రహాలను తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సాలాపు గోవింద, సీతా ధనలక్ష్మి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం

బుచ్చెయ్యపేట,న్యూస్‌లీడర్: చిన అప్పన్న పాలెం గ్రామంలో రామాలయ విగ్రహప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. సోమవారం విఘ్నేశ్వర పూజ, స్థంభ ప్రతిష్ట నిర్వహించారు. 6న విగ్రహాల గ్రామ ప్రదిక్షణ, యాగశాల ప్రవేశం, అంకురార్పణ, కలశాభిషేకం, బుధవారం అగ్ని ప్రతిష్టాపన, క్షీరాధివాసం, హెూమాలు, 8న గణపతి హెూమం, సీతారామ,లక్ష్మణ,ఆంజనేయ, లక్ష్మీగణపతి దేవతా విగ్రహాలు ఆలయంలో ప్రదిక్షణ, శిఖర కలశ కార్యక్రమాలు, భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నట్లు గ్రామ పురోహితులు బైరి సీతారామమూర్తి తెలిపారు.

26న సీతారాముల కల్యాణం

రావికమతం, న్యూస్‌లీడర్: సీతారాముల కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం చేయాలని మండల కేంద్రానికి చెందిన రామసేన కమిటీ ప్రతినిధి గొర్లె నాగేశ్వరరావు కోరారు. ఈ నెల 26న రావికమతంలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండరామ ఆలయంలో సీతారాముల కల్యాణం జరగనుంది. ఈ మేరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. వివాహ తంతులో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు బియ్యం సిద్ధం చేసుకోవాలని సభ్యులు ఊరంతా ప్రచారం చేస్తున్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ద్రోపరయుగంలో అనాటి ప్రజలు పవిత్రంగా ధాన్యాన్ని మరపట్టకుండా చేతులతో వలిచి సిద్ధం చేసిన బియ్యాన్ని తలంబ్రాలుగా ఉపయోగించేవారని, ఆ ఆచారాన్ని కలియుగంలో కొనసాగించాలన్న లక్ష్యంతో కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. స్త్రీలు అందరూ ముందుగా సిద్ధం చేసుకున్న ధాన్యాన్ని వలిచి బియ్యంగా చేసి ఆలయానికి తీసుకురావాలని కోరారు.

ప్రభుత్వ చౌక్ దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానం



సబ్బవరం, న్యూస్‌లీడర్: జిల్లాలో గల పలు మండలాలకు సంబంధించి ప్రభుత్వ చౌక దుకాణాలు (రేషన్ డిపోలు) అర్హులైన అభ్యర్థులను ఆహ్వానిస్తున్నట్లు ఆర్డీవో నుంచి తహశీల్దార్ కార్యాలయానికి ఉత్తర్వులందాయని, సబ్బవరం మండలానికి సంబంధించి పెదగొల్లలపాలెం చౌకడిపో ఎస్సీ ఉమెన్ కేటగిరికి, అసకపల్లి రెండు డిపోలకు సంబంధించి ఓసీ, బీసీ - డి ఉమెన్ల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డిప్యూటీ తహశీల్దార్ ఆనంద్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ ఏడాది మార్చి 2వ తేదీకి 18 సంవత్సరాలు నుంచి 40లు మించకుండా ఉండాలన్నారు. దరఖాస్తుదార్లు పదవ తరగతిలో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. స్థానికంగా నివాసం ఉండాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 17వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని, 25న రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలో రాతపరీక్ష, 29న మౌఖిక పరీక్షకు హాజరుకావాలని ఆయన తెలిపారు.

గ్రామాలలో తాగునీటి సమస్య పరిష్కరించాలి



మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: గ్రామాలలో మంచినీటి సమస్య పరిష్కారానికి ముందస్తు చర్యలు చేపట్టాలని సీపీఐ మండల కార్యదర్శి ఆదారి అప్పారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని శ్రామిక సదనం గోవిందరావు భవన్‌లో సోమవారం సీపీఐ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలలో పలు గ్రామాలలో మంచినీళ్లు దొరకక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత సంవత్సరాలు వర్షాలు సరిగా కురవకపోవడం వలన భూగర్భ జలాలు అడుగంటాయన్నారు. ఈ కారణంగా పలు బోరు బావులలో నీరు సరఫరా కావడంలేదన్నారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య మరింత జటిలం కానుందని వెంటనే ప్రభుత్వం స్పందించి ఇప్పటి నుంచే మంచినీటి సమస్య పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల నాయకులు చెల్లూరి నాగరాజు, బోయిన గోవింద, కోరుకొండ సత్యనారాయణ, వైఎస్ భద్రం, కోన లక్ష్మణ, శంకరరావు, తాకాశి వెంకటేశ్వరరావు, శ్రీరాందాసు అబ్బులు, కర్రి సూర్యనారాయణ, దొడ్డి సూర్యనారాయణ, సిద్దా గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

7న విశాఖ డెయిరీ పార్లర్ ప్రారంభం

అనకాపల్లి, న్యూస్‌లీడర్: పట్టణంలోని గవరపాలెం ఆంధ్రాబ్యాంకు రోడ్డులో ఈ నెల ఏడవ తేదీన రేవంత్ విశాఖ డెయిరీ పార్లర్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకుడు బొడ్డేడ భాస్కరరావు తెలిపారు. ఈ పార్లర్‌ను టీడీపీ నాయకులు డాక్టర్ పీలా శ్రీకాంత్ ప్రారంభిస్తారని, మున్సిపల్ మాజీ చైర్మన్ కొణతాల జగన్నాథరావునాయుడు (జగన్), టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ధ నాగజగదీశ్వరరావు, విశాఖ డెయిరీ బోర్డ్ డైరెక్టర్ దాడి గంగారాజు, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ ఏవీఎస్ ప్రసాద్ గౌరవ అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విశాఖ జోన్ ఇవ్వాలి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వే జోన్ కేటాయించాలని, రాష్ట్రానికి జరిగిన అన్యాయానికి నిరసనగా పట్టణంలో నాలుగురోడ్ల జంక్షన్‌లో ఆమ్‌ఆద్మీపార్టీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమ్ ఆద్మీపార్టీ కన్వీనర్ కొణతాల హరినాథ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం తీవ్రమైన నమ్మక ద్రోహం చేసిందన్నారు. రాష్ట్రాన్ని విడదీసి ప్రజాగ్రహానికి గురైన కాంగ్రెస్‌కు పట్టినగతే బీజేపీకి పడుతుందని హెచ్చరించారు. రాష్ట్రం అభివృద్ధికి తప్పనిసరిగా ప్రత్యేక హెూదా ఇవ్వాలని, విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పార్టీ నాయకుడు మావూరి రవికుమార్, ప్రజా సంఘ నాయకుడు సూదికొండ మాణిక్యాలరావు, గిరిజన నాయకుడు బోయిబాబ పూర్ణరావు, ఎ.నారాయణరావు, ఎ.ధర్మారావు, అద్దేపల్లి సూరి అప్పారావు, మోపరాల తిరుమలేశ్వరరావు, కె.గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పథకం ఆధునీకరణ

నాతవరం, న్యూస్‌లీడర్: నాతవరం ప్రజల దాహార్తి తీర్చే గుమ్ముడుగొండ తాగునీటి పథకాన్ని ఆధునికీకరణ చేసేందుకు ప్రతిపాదించామని ఏఈ జయరామ్ పేర్కొన్నారు. తాండవ నది నుంచి తాగునీటిని పంపిణీ చేసేందుకు అమర్చిన పంపులు శిథిలం కావడంతో తరచూ ఇబ్బందులు కలుగుతున్నట్లు తెలిపారు. గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా మరమ్మత్తులకు గురైన పంపులను అమర్చేందుకు ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ వేసవిలోనే సమస్యకు పరిష్కారం చేస్తామని తెలిపారు. గుమ్ముడుగొండ బీసీ కాలనీలో అదనపు పంపులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఏపీకి ప్రత్యేక హెూదా, రైల్వేజోన్ ఇవ్వాలి



నిరాహార దీక్షల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు ఆధ్వర్యంలో తహశీల్దార్ ఎదురుగా సోమవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రమణ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర విభజన జరిగిన తర్వాత విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా కేంద్ర ప్రభుత్వం ఇవ్వకపోవడం, ఎన్నికల ముందు తిరుపతి బహిరంగ సభలో ప్రధాని మోదీ, వెంకయ్యనాయుడు, చంద్రబాబునాయుడు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హెూదా కల్పిస్తామని చెప్పి ఎన్నికలైన వెంటనే ప్రత్యేక హెూదాకు త్రిలోదకాలిచ్చారన్నారు. విభజన చట్టం ప్రకారం ఒక రాష్ట్రం విడిపితే రాష్ట్రానికి ఆరునెలల్లో రైల్వేజోన్ ప్రకటించాల్సి ఉందన్నారు. అశాస్త్రీయంగా, అడ్డగోలుగా, అన్యాయంగా విడగొట్టబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హెూదా, విశాఖ రైల్వేజోన్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ మహిళా అధ్యక్షురాలు ఏపీ రత్నకుమారి, మండల అధ్యక్షురాలు మరిపల్లి శోభ, అధికార ప్రతినిధి ఆళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి గైపూరి రాజు, జిల్లా యువజన కార్యదర్శి వేగి త్రినాధ్, మాజీ కౌన్సిలర్ లట్టాల రామకృష్ణ, కె.రామకృష్ణ, మళ్ల, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌ల సమస్యలు పట్టని పాలకులు


మాజీ మంత్రి దాడి



మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ప్రజా సమస్యలపై స్పందించే జర్నలిస్టులు వారి సమస్యలను వారు పరిష్కరించుకోలేని దుస్థితిలో ఉన్నారని మాజీ మంత్రి దాడి వీరభద్రరావు అన్నారు. స్థానిక సీపీఎం పార్టీ కార్యాలయంలో జరిగిన ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిస్ట్‌ల ఇళ్ల సమస్య చాలా కాలంగా నలుగుతుందని, ఎన్టీఆర్ హయాంలో జర్నలిస్ట్‌ల సమస్యలు త్వరితంగా పరిష్కారమయ్యేవని అన్నారు. అనకాపల్లిలో నాటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి జర్నలిస్ట్‌లకు పట్టాలు ఇస్తే నేటికి ఏడేళ్లు అయినా అతిగతి లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి స్వయంగా తన చేతులతో ఇచ్చిన పట్టాలకే దిక్కులేకుండా పోయిందని అన్నారు. అనకాపల్లి జర్నలిస్ట్‌ల విషయంలో తాను ఎంత కష్టానికైనా పూనుకుంటానని, అవసరమైతే ఎంతటి పనికైనా వెనుకాడనని అన్నారు. విశాఖ అర్బన్‌శాఖ అధ్యక్షుడు పి.నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఈశ్వరరావు, జేటీడీపీ నాయ కులు బుద్ధ నాగజగదీష్, డాక్టర్ కె.నారాయణరావు, బీజేపీ జిల్లా కార్యదర్శి గొంతిన భక్త సాయిరామ్, సీపీఎం కార్య దర్శి ఎ.బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు ఐఆర్ గంగాధర్, జిల్లా నలుమూలల నుంచి పాత్రికేయులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తలకు తగిన న్యాయం చేయాలి




శెట్టి వెంకటరమణ(ఎంపీటీసీ)

అనకాపల్లి టౌన్, న్యూస్‌లీడర్: ఆది నుంచి తెలుగుదేశం పార్టీవెంటే ఉన్న కార్యకర్తలకు తగిన న్యాయం జరిగేలా చూడాలని ఎంపీటీసీ శెట్టి వెంకటరమణ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి దాడి వీరభద్రరావు 2014 ఎన్నికల ముందు పార్టీని వీడివెళ్లినప్పటికీ పార్టీ అధినేత ఆదేశాల మేరకు కోర్ కమిటీ కనుసన్నల్లో టీడీపీని బలోపేతంచేసి 2014లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అనకాపల్లి మండలంలో అత్యధిక స్థానాలను తెలుగుదేశం పార్టీ కైవసం చేసుకోవడం జరిగిందన్నారు. తరువాత జరిగిన శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అధినేత ఇచ్చిన ఆదేశాల మేరకు 17 రోజుల్లో వీరిద్దరిని ఎంపీ, ఎమ్మెల్యేలను అత్యధిక మెజార్టీతో గెలిపించడం జరిగిందన్నారు. గెలిచి నాలుగేళ్లు పూర్తయినప్పటికీ కార్యకర్తలు మనోధైర్యం కోల్పోయి అసహనంతో ఇబ్బందులు పడుతున్నామని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వచ్చిందనే ఆనందం ఎప్పుడూలేదన్నారు.

నీటి తీరువా తక్షణమే వసూలు చేయాలి


విధి నిర్వాహణలో తేడాలొస్తే మెమోలు తప్పవు



మాట్లాడుతున్న తహశీల్దార్ సత్యనారాయణ

అనకాపల్లి రూరల్, న్యూస్‌లీడర్: కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలోని ప్రభుత్వ భూమిని కాపాడవలసిన బాధ్యత వీఆర్వోలదేనని తహశీల్దార్ సత్యనారాయణ అన్నారు. సోమవారం వీఆర్వోలతో తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంతాలైన కాలువనీరు అందుబాటులో ఉండే ప్రాంతాలు తుమ్మపాల, తగరంపూడి, మార్టూరు, శంకరం, బవులవాడ, సీతానగరం, కుంచంగి, పట్టణ సౌత్ వన్, టు, నార్త్ టు, పలు ప్రాంతాల నుంచి పది లక్షల మేరకు నీటి పన్ను వసూలు చేసి ప్రభుత్వ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణలో ఉన్నవారిని సైతం ఖాళీ చేయించాలన్నారు. వారికి ఎక్కడా ఇళ్లు లేనివారైతే వారి కూడా గ్రామస్తులతో పాటు 1.25 సెంట్ల చొప్పున ప్రభుత్వ స్కీంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతేతప్ప ఎకరాల ఆక్రమణలు తగదన్నారు. ఉగాది నాటికి అన్ని గ్రామాలలో అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసేందుకు సిద్ధం చేయాలన్నారు. దీనిలో ప్రధానంగా స్థానికులకు మాత్రమే అర్హులుగా గుర్తించి ఆధార్, ఇతర ఐడీ కార్డులను పరిశీలించి అర్హులకు మాత్రమే మంజూరు చేయాలన్నారు. సెలవు రోజులలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక, గ్రావెల్‌ను ఎవరు పరిధిలో వారే కాపాడుకోవాలని వీఆర్వోలకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శ్రీరామ్మూర్తి, ఆర్‌ఐ అచ్చిబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

చురుగ్గా రోడ్డు పనులు



రోడ్డు పనులు చేస్తున్న కూలీలు

నాతవరం, న్యూస్‌లీడర్: మండలంలో తాండవ తాళ్ల పాలెం రోడ్డు పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి నాబార్డు రూ.1.24 కోట్లు మంజూరు చేసింది. ఈ నిదులతో తాండవ నుంచి మాధవనగరం మీదుగా గొలుగొండ మండలం సరిహద్దు వరకు తారురోడ్డు నిర్మించాలి. ఈ పనులకు సంబంధించి మెటల్ సిద్ధం చేశారు. నవంబర్ నెలాఖరు నాటికి రోడ్డు పను లు పూర్తి చేస్తామని స్పెషల్ జేఈ సత్యనారాయణ తెలిపారు. రోడ్డు నిర్మాణం పూర్తయితే రెండు మండలాల మధ్య రహదారి సౌకర్యం మెరుగుపడనుంది.

ఢిల్లీ ధర్నాలో అనకాపల్లి వైసీపీ నాయకులు



ఢిల్లీలో ధర్నాలో పాల్గొన్న వైసీపీ నాయకులు

అనకాపల్లి, న్యూస్‌లీడర్: ఏపీకి ప్రత్యేక కల్పించాలని, విభజన చట్టంలోని హామీలను నెరవేర్చాలని కోరుతు వైసీపీ అధినేత, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్‌మంతర్‌వద్ద సోమవారం మహాధర్నా నిర్వహించారు. ఈ మహాధర్నాలో అనకాపల్లి నియోజకవర్గం నుంచి పలువురు నాయకులు పాల్గొన్నారు. వీరిలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మళ్ల బుల్లిబాబు, పట్టణశాఖ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు(జానీ), అనకాపల్లి, కశింకోట మండలాల పార్టీ అధ్యక్షులు గొర్లె సూరిబాబు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.